
'ప్రాజెక్టులు పూర్తి చేసి
శాశ్వత వనరుల ద్వారా
రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 313

శనివారం 3-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రూ. 29కే కిలో బియ్యం

రిటైల్‌గా భారత్ రైస్ విక్రయాలు. వచ్చే వారమే ప్రారంభం -13లో



యశస్వి జైస్వాల్ 179 నాటౌట్

వైజాగ్‌లో ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో తొలి రోజు భారత్ 336/6. -13లో



ఆప్, బీజేపీ నిరసనలు

బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన పోటాపోటీ నిరసనలతో శుక్రవారం సెంట్రల్ ఢిల్లీ ప్రాంతం రణరంగాన్ని తలపించింది.

- వివరాలు 6లో



రాజకీయాల్లోకి 'దళపతి'

తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు తమిళ అభిమానుల 'దళపతి', నటుడు విజయ్ ప్రకటించారు.

- వివరాలు 6లో



'ప్రత్యేక దేశం' వ్యాఖ్యలపై రగడ

బడ్జెట్‌లో అన్యాయం దృష్ట్యా దక్షిణాదిని ప్రత్యేక దేశం చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ సురేశ్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటు అట్టుడికింది.

- వివరాలు 6లో



పాక్‌లో ఎన్నికలకు వేళాయె..

పాక్‌లో నేతల భాగ్యరేఖలను నిర్దేశిస్తూ వస్తున్న సైన్యం కనుసన్నల్లో ఎప్పట్లాగే మరో ఎన్నికల తంతుకు సర్వం సిద్ధమవుతోంది.

- వివరాలు 6లో

ప్రజా ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తే..

ప్రజలు ఊరుకోరు!

ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ తెలంగాణ పునర్నిర్మాణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య

- పదేళ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు.. ఆడబిడ్డలను పట్టించుకోలేదు
- ఇప్పుడు మోదీ, కేసీఆర్ ఒక్కటై ముందుకొస్తున్నారు
- మతం పేరిట బీజేపీ, మద్యంతో బీఆర్ఎస్ గెలవాలని చూస్తున్నాయి
- పార్లమెంటు ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలి
- 15 రోజుల్లో 15వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తాం
- త్వరలోనే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తాం
- ప్రియాంకా గాంధీ చేతుల మీదుగా పథకం ప్రారంభిస్తాం
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ కూడా త్వరలో అమల్లోకి తెస్తాం



ఇంద్రవెల్లిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు తుమ్మల, సీతక్క, కోమటిరెడ్డి, కొండా సురేఖ

అలా చేస్తే ఊర్లలోకి రానిస్తరా?

''ఈ మధ్య కొందరు మాట్లాడుతున్నరు. మూడు నెలలు, ఆరు నెలల్లో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతాడు, ఈ ప్రభుత్వాన్ని పడగొడతామని అంటున్నారు. నీ అయ్యా.. ఎవడు పడగొట్టేటోడు.. మా యువకులు వేలాది మంది ఇక్కడ ఉన్నారు. పడగొడితే వారంతా చూస్తూ ఊరుకుంటరా? ఊర్లలోకి రానిస్తరా? ఎవడైనా ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న ఆలోచన చేస్తే.. మీ ఊర్ల వేపచెట్టుకు కట్టేసి కొట్టండి. ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం. ఇదేమైనా మీరు దోపిడీ చేసిన లక్ష కోట్ల కాళేశ్వరం కూలినట్టు అనుకున్నరా? ప్రజాప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తే ప్రజలు ఊరుకోబోరు''

సాక్షి, ఆదిలాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామని, త్వరలోనే కేసీఆర్ మళ్లీ సీఎం అవుతాడని కొందరు మాట్లాడుతున్నారని.. ప్రజాప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తే ప్రజలు ఊరుకోబోరని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తెలంగాణను కొల్లగొట్టి విధ్వంసం చేశారని.. తాము పునర్నిర్మించే పనిలో ఉన్నామని పేర్కొన్నారు. హామీ ఇచ్చినట్టుగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, పదిహేను రోజుల్లో కానిస్టేబుల్ నియామకాలను చేపడతామని ప్రకటించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పునర్నిర్మాణ సభ నిర్వహించింది. సీఎం రేవంత్ ఇందులో పాల్గొని మాట్లాడారు. ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే.. 'కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తెలంగాణను కొల్లగొట్టి విధ్వంస రాష్ట్రంగా మార్చారు. కేసీఆర్ తన సొంత కుటుంబ సభ్యుల కోసమే తప్ప ఏనాడూ ప్రజల కోసం ఆలోచించలేదు. మిషన్ భగీరథ పేరుతో వేల కోట్లు దోచుకున్నారు. నాడు ఇంద్రవెల్లి సాక్షిగా సమరశంఖం పూరించి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నాం. అందుకే అభివృద్ధి కార్యక్రమాలను ఈ ప్రాంతం నుంచే ప్రారంభిస్తున్నాం. మళ్లీ ఇదే

మిగతా 2వ పేజీలో ▶

4.30 గంటల్లో విశాఖకు..

తుది దశకు హై స్పీడ్ రైలు కారిడార్ సర్వే

రెండు మార్గాల్లో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు..



కిలోమీటర్లు సుమారు **922**

అంచనా వ్యయం రూ. **20,000** కోట్లకు పైనే..

శంషాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖ వరకు ఒక రూట్

విశాఖ నుంచి విజయవాడ మీదుగా కర్నూలు వరకు మరొకటి

రైలు వేగం : గంటకు 220 కి.మీ.

సాక్షి, హైదరాబాద్: హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి రైల్వేశాఖ చేపట్టిన ప్రాథమిక సర్వే తుదిదశకు చేరుకుంది. వచ్చే మార్చినాటికి ప్రిలిమినరీ ఇంజనీరింగ్ అండ్ ట్రాఫిక్ (పెట్) సర్వే పూర్తి కానుంది. పెట్ సర్వేకు రైల్వేశాఖ గతేడాది మే నెలలో ఎస్ఎం కన్సల్టెన్సీని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ సర్వే నివేదిక ఆధారంగా సమగ్రమైన సర్వే (డీపీఆర్) కోసం మరో కన్సల్టెన్సీని ఏర్పాటు చేయనున్నట్టు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రస్తుతానికి రూ.20,000 కోట్లకుపైగా వ్యయం అవుతుందని అధికారుల అంచనా. కానీ పనులు ప్రారంభించే నాటికి నిర్మాణ వ్యయం ఇంకా పెరిగే అవకాశముంది. పెట్ సర్వేలో భాగంగా ఎంపిక చేసిన రూట్‌లలో ఇంజనీరింగ్ అంశాలపై అధ్యయనం చేశారు. ఎక్కడెక్కడ వంతెనలు, ఇతర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందనే దానిపై కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండు మార్గాల్లో ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్‌లో హైస్పీడ్ రైళ్లలో ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఎలా ఉంటుందనే అంశాలపైన కూడా పెట్‌సర్వే నివేదికలో పొందుపరచనున్నారు. దీని ఆధారంగా చేపట్టబోయే డీపీఆర్ సర్వేకు 6 నుంచి 8 నెలలకు పైగా సమయం పడుతుందని అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

శంషాబాద్-విశాఖకు తక్కువ సమయంలో

హైస్పీడ్ రైలు అందుబాటులోకి వస్తే.. శంషాబాద్ నుంచి నాలుగున్నర గంటల్లోనే విశాఖకు చేరుకోవచ్చు. ప్రస్తుతం జంటనగరాల నుంచి రైలులో విశాఖకు వెళ్లేందుకు 12 నుంచి 13 గంటల సమయం పడుతోంది. వందేభారత్ మాత్రం 9 గంటల్లో చేరుకుంటోంది. హైదరాబాద్ నుంచి విశాఖకు నిత్యం 10 రెగ్యులర్ రైళ్లు, మరో 12 వీక్లీ రైళ్లు అందుబాటులో ఉన్నాయి. రోజుకు 25 వేల మందికిపైగా రాకపోకలు సాగిస్తుండగా మరో 30 వేల మంది వీక్లీ ట్రైన్‌లలో రాకపోకలు

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రెండు గ్యారంటీలపై రేపు నిర్ణయం!



రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం సచివాలయంలో జరగనుంది. ఈ సమావేశంలో ప్రధానంగా ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా అమలుకు సంబంధించి కూలంకషంగా చర్చించనున్నట్లు సమాచారం.

- వివరాలు 2లో▶

ఆ కార్లు ఎక్కడివి ?



ఆ కార్లు ఎక్కడివి..ఎవరు బహుమతిగా ఇచ్చారు? ఒకవేళ మీరే కొంటే.. అందుకు సొమ్ము ఎక్కడిది? అంటూ మూడో రోజు కస్టడీలో ఏసీబీ అధికారులు హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను ప్రశ్నించినట్టు తెలిసింది.

- వివరాలు 2లో▶

రైల్వేలకు సంతృప్తికరంగా నిధులు



కేంద్ర బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు సంతృప్తికరంగా నిధులు కేటాయించారని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. తాజా బడ్జెట్‌లో రైల్వేలకు రూ.2.52 లక్షల కోట్లు కేటాయించగా అందులో దక్షిణ మధ్య రైల్వేకి రూ.14,232.84 కోట్లు కేటాయించారన్నారు.

- వివరాలు 14లో▶

రాంచీ టు శామీర్‌పేట

హైదరాబాద్ శిబిరానికి జార్ఖండ్ ఎమ్మెల్యేలు

రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటంతో ఏఐసీసీ నిర్ణయం

ప్రత్యేక విమానంలో వచ్చిన 41 మంది జేఎంఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

దీపాదాస్, పొన్నం, సంపత్‌లకు సమన్వయ బాధ్యతలు



ఎయిర్‌పోర్టు నుంచి బస్సుల్లో వెళ్తున్న ఎమ్మెల్యేలు


సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ రాజకీయం హైదరాబాద్‌కు చేరింది. మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టు తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంపయ్ సోరెన్ అసెంబ్లీలో బలనిరూపణ చేసుకోవాల్సి ఉండడంతో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్ పార్టీలకు చెందిన 41 మంది ఎమ్మెల్యేలను హైదరాబాద్ క్యాంప్‌కు తరలించారు. రాంచీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ప్రత్యేక విమానంలో బయలుదేరిన జార్ఖండ్ ఎమ్మెల్యేలు నేరుగా బేగంపేట విమానాశ్రయంలో దిగారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌లు వారికి ఆహ్వానం పలికి రెండు ప్రత్యేక బస్సుల్లో శామీర్‌పేటలోని ఓ రిసార్టుకు

మిగతా 2వ పేజీలో ▶

జార్ఖండ్ ముఖ్యమంత్రిగా చంపయ్ సోరెన్ ప్రమాణం

- మంత్రులుగా అలంగీర్ ఆలాం, సత్యానంద్ భోక్తా ప్రమాణ స్వీకారం
- 'జల్, జంగిల్, జమీన్' కోసం పోరాటం కొనసాగిస్తామన్న ముఖ్యమంత్రి

6లో



హేమంత్ అరెస్టుపై జోక్యం చేసుకోలేం

- సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం స్పష్టీకరణ
- జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించాలని సూచన

6లో



రామోజీరావుకు సుప్రీంలో ఎదురుదెబ్బ

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసుల విచారణ బదిలీ పిటిషన్ కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఏపీ హైకోర్టుకే వెళ్లాలని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో ఆ సంస్థ అధిపతి చెరుకూరి రామోజీరావుకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరుగుతున్న పిటిషన్లను తెలంగాణ హైకోర్టుకు మార్చాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏపీ హైకోర్టుకే వెళ్లాలని తేల్చిచెప్పింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఏపీలో నమోదైన ఎఫ్ఐఆర్‌లపై తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్లు వేశామన్నారు. అదే సమయంలో ఏపీలో సీఐడీ వేసిన చార్జిషీట్లను అక్కడి కింది కోర్టు

మిగతా 3వ పేజీలో ▶

కాంగ్రెస్‌వి బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు



రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి ఫైర్

- భూముల లావాదేవీల విషయంలో బిల్డర్లు, వ్యాపారులను బెదిరిస్తోంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. భూములకు సంబంధించిన లావాదేవీల విషయంలో బెదిరింపులకు పాల్పడుతోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దలకు డబ్బులు సమకూర్చడానికి బిల్డర్లు, భూ వ్యాపారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అవినీతి కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు అయ్యాయని విమర్శించారు. అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ అవినీతి మంత్రులపై చర్యలు తీసుకుంటామన్న రేవంత్‌రెడ్డి ఎందుకు పట్టించుకోవట్లేదని నిలదీశారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. రాష్ట్రపార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, జాతీయ నేతలు డీకే అరుణ, పి.మురళీధర్‌రావు, జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి,

మిగతా 3వ పేజీలో ▶

ఎంతో మందిని చూశాం.. నువ్వెంత?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

కృష్ణా జలాలపై హక్కులను రేవంత్ ఢిల్లీకి తాకట్టు పెట్టారు



- ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి..
- రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- బీజేపీని నిలువరించే సత్తా కాంగ్రెస్‌కు లేదు.. జోడో యాత్ర తర్వాత రాహుల్ గాంధీ ఒక్కరే మిగులుతారు
- మేడ్చల్ బీఆర్ఎస్ విజయోత్సవ సభలో ప్రసంగం

3లో

ఇదండీ సంగతి



పోస్లెండి సార్!
ఒక్క నిరుద్యోగులే గుర్తున్నారు వాళ్లకు!!



నీటి వాటా.. ఆపరేషనల్ ప్రొటోకాల్ తేల్చాలి

అలా అయితేనే ప్రాజెక్టులు అప్పగిస్తామన్న తెలంగాణ

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు వెల్లడి..

5లో

సమావేశ మినట్స్ విడుదల చేసిన కృష్ణా బోర్డు

ప్రాజెక్టులు అప్పగిస్తామంటూ మినట్స్‌లో తప్పుగా రికార్డు అయ్యింది : రాహుల్ బొజ్జా

కాపాడలేం.. అమ్మేద్దాం!

హౌసింగ్ బోర్డు, 'దిల్' భూములపై రాష్ట్ర సర్కారు యోచన • ఈ రెండింటికీ కలిపి 2,600 ఎకరాల భూములు

- వీటిపై హక్కులు ఉన్నాయంటున్న రెండు తెలుగు రాష్ట్రాలు
- దీనితో తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చిన కేంద్రం.. కోర్టులోనూ కేసు
- కబ్జా అవుతున్నాయని కేంద్రం, కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం
- ముందు అమ్మేసి, తర్వాత హక్కులపై తేల్చుకుందామన్న ప్రతిపాదనలు?



సాక్షి, హైదరాబాద్: హౌసింగ్ బోర్డు, దానికి అనుబంధంగా ఉన్న 'డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (దిల్)' ఆధీనంలోని భూములను అమ్మేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఇతర సంక్షేమ పథకాల నిర్వహణ కోసం భారీగా నిధుల సమీకరణ చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో.. ఈ భూముల విక్రయంపై దృష్టిసారించినట్టు సమాచారం. మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గృహనిర్మాణ శాఖ సమావేశంలో దీనిపై తీవ్ర చర్చ జరిగినట్టు తెలిసింది. సదరు భూములపై ఇప్పటికే గృహ నిర్మాణ శాఖ నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించినట్టు అధికారవర్గాలు వెల్లడించాయి.

తొమ్మిదో షెడ్యూల్‌లో ఉండటంతో..

ఉమ్మడి రాష్ట్ర సమయంలో.. మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే అనువైన ఇళ్లను సమకూర్చేలా హౌసింగ్‌బోర్డు ఆధ్వర్యంలో కాలనీలు రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. బోర్డు ఏర్పడే నాటికే తెలంగాణ ప్రాంతంలో దాని ఆధీనంలో భారీగా భూములు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ పరిధిలో కూడా బోర్డు భూములను సమకూర్చుకుంది. ఇందులో భారీ వెంచర్ల కోసం ప్రత్యేకంగా 'డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (దిల్)' పేరిట అనుబంధ సంస్థను కూడా ఏర్పాటు చేసింది. ప్రస్తుతం తెలంగాణ ప్రాంతంలో దిల్ పరిధిలో 1,800 ఎకరాల భూములు, హౌసింగ్ బోర్డు ఆధీనంలో మరో 820 ఎకరాల భూములు ఉన్నాయి. అయితే ఈ భూముల అంశం రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం పరిధిలో ఉంది. హౌజింగ్‌బోర్డు, దిల్‌లకు సంబంధించి ఏ ప్రాంతంలోని భూములు ఆ రాష్ట్రానికే చెందాలని తెలంగాణ పట్టుబట్టినా.. షీలా భిడే కమిటీ భిన్న నిర్ణయాన్ని

మిగతా 10వ పేజీలో ▶

మన లక్ష్యం బీజేపీ విముక్త్ భారత్

- అందుకే ఇండియా కూటమిలో చేరి ఉద్యమిస్తున్నాం.. దేశంలో మళ్లీ మోదీ ప్రభుత్వం వస్తే విధ్వంసమే
- సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో ప్రధాన కార్యదర్శి డి.రాజా



బీజేపీ రాముడి పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తోంది. మోదీ చెప్పే రాముడు, గాంధీ చెప్పే రాముడికి తేడా ఉంది. మోదీ పాలనలో దేశాన్ని మతతత్వ రాజ్యంగా మారుస్తున్నారు. రాజ్యాంగాన్ని, అందులోని మౌలిక సిద్ధాంతాలు, ప్రజాస్వామ్యం, లౌకికవ్యవస్థను కేంద్రం కాలరాస్తోంది.

- డి. రాజా

2లో

క్లుప్తంగా...

రాష్ట్రంలో కాంగ్రెస్ మరింత బలోపేతం

దీపాదాస్ మున్షీ



పార్టీలో చేరిన విద్యాస్రవంతికి కండువా కప్పుతున్న దీపాదాస్ మున్షీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలపడుతోందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పటిష్ట పునాదులున్న కాంగ్రెస్ పార్టీకి సైనికుల్లాంటి కార్యకర్తలే బలమని, కార్యకర్తల అండతో ఐదేళ్ల పాటు ప్రజాపాలన అందిస్తామని ఆమె చెప్పారు. శుక్రవారం సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త విద్యాస్రవంతి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన అనంతరం దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ విద్యాస్రవంతి లాంటి విద్యావేత్తలు, మేధావులు పార్టీలోకి రావడం హర్షణీయమన్నారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యే వారంతా తమతో కలిసి రావాలని, తమ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెప్పారు. ఎలాంటి షరతుల్లేకుండా పార్టీలో చేరిన వారిని అన్ని స్థాయిల్లో వినియోగించుకుంటామని భరోసా ఇచ్చారు. విద్యాస్రవంతి మాట్లాడుతూ విద్యారంగంలో దీర్ఘకాలంగా సేవ చేశానని, కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజాసేవ చేస్తానని అన్నారు.

సర్పంచ్‌గా పోటీ చేయమన్నా చేస్తా: సంపత్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ సైనికుడినని, పార్టీ ఏ పనిచేయమంటే అది చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు లింగం యాదవ్, భవానీరెడ్డి, కమల్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. దురదృష్టవశాత్తు ఎమ్మెల్యేగా ఓడిపోయానని, ఇప్పుడు పార్టీ ఎక్కడ ఏ పదవికి పోటీ చేయమన్నా నేను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానానికి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని దరఖాస్తు ఇచ్చా. పార్టీ అవకాశమిస్తే ఓకే. లేదంటే ఆ తర్వాత జరిగే సర్పంచ్ ఎన్నికల్లో అవకాశమిచ్చినా పోటీ చేస్తా. ఎంపీటీసీకి పోటీ చేయమన్నా చేస్తా. పార్టీ ఏది చేయమంటే అదే చేస్తా'అని కుండబద్దలు కొట్టారు. పీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారా అని ప్రశ్నించగా, పీసీసీ అధ్యక్షుడిగా బరిలో ఉన్నానన్న సమాచారం తనకే తెలియదని వ్యాఖ్యానించారు.

మోదీని 17 కోట్ల మంది ముస్లింలు విశ్వసించడంలేదు

పార్లమెంటులో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని 17 కోట్ల మంది ముస్లింలెవరూ ప్రధాని నరేంద్ర మోదీని విశ్వసించడంలేదని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. తాజా పరిణామాలు చూస్తుంటే దేశంలో ముస్లింల పరిస్థితి హిట్లర్ పాలనలో యూదుల్లాగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పదేళ్ల మోదీ పాలనలో ముస్లింలంతా అభద్రతాభావం, ఆవేదన, ఆగ్రహంతో ఉన్నారని, ఇది దేశానికి మంచిది కాదని హెచ్చరించారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి మసీదుతోపాటు రెండు ముస్లిం యూనివర్సిటీలను లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. సీఏఏని మతంతో ముడిపెట్టడం దురుద్దేశపూరితమే అవుతుందన్నారు. గాంధీ, అంబేడ్కర్‌ల దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చేశానని చెప్పుకునేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఒవైసీ దుయ్యబట్టారు.

ఆ గర్భిణులకు మెటర్నిటీ పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలి

అసంఘటిత రంగం మహిళల కోసం రాజ్యసభలో సురేశ్‌రెడ్డి ప్రైవేట్ బిల్లు



సాక్షి, న్యూఢిల్లీ: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గర్భిణులకు ప్రసూతి సెలవులను వేతనంతో కూడిన సెలవులుగా ఇవ్వాలని బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ శుక్రవారం రాజ్యసభలో సురేశ్‌రెడ్డి ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. ప్రస్తుతం సంఘటిత రంగంలో గర్భిణులకు ఇస్తున్న మాదిరిగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గర్భిణులకు డెలివరీ ముందు 4 వారాలు, ఆ తర్వాత 8 నుంచి 12 వారాల పాటు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని బిల్లులో సూచించారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రప్రభుత్వం ఒక చట్టం తీసుకురావాలని సురేశ్‌రెడ్డి కోరారు.



శుక్రవారం ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ సభకు హాజరైన ప్రజలు

..ప్రజలు ఊరుకోరు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇంద్రవెల్లి సాక్షిగా పార్లమెంట్ ఎన్నికలకు సమరశంఖం పూరిస్తాం. గత పదేళ్ల పాలనలో ఏనాడైనా అడవి బిడ్డల గురించి, ఇంద్రవెల్లి అమరుల కుటుంబాల గురించి ఆలోచించారా? గూడేలు, తండాలకు నిజంగా నీళ్లు ఇచ్చి ఉంటే ఇప్పుడు మేం రూ.65 కోట్లతో ఇంద్రవెల్లిలో పనులు మొదలుపెట్టాల్సి వచ్చేదా? ప్రగతిభవన్ వద్ద నాడు గద్దర్‌ను నిరీక్షించేలా చేసిన కేసీఆర్‌కు ఉసురు తగిలింది.

మోదీ దగ్గర గులాంగిరీ..

దేశంలో రెండే కూటములు ఉన్నాయి. ఒకటి ఎన్డీఏ కూటమి, రెండోది ఇండియా కూటమి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తొమ్మిది ఎంపీ సీట్లను గెలిస్తే.. కేసీఆర్ వాటిని ఢిల్లీలో తాకట్టు పెట్టి మోదీ దగ్గర గులాంగిరీ చేశారు. ఇప్పుడు మోదీ, కేడీ ఒక్కటై ముందుకొస్తున్నారు. మతం పేరిట బీజేపీ, మద్యంతో కేసీఆర్ ఈ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించాలి. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలి.

నాటి ఘటనకు క్షమాపణ చెప్తున్నా..

1981 ఏప్రిల్‌లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇంద్రవెల్లి పోరాటకారులను కాల్చి చంపి, ఇప్పుడు నివాళులు అర్పిస్తున్నారంటూ కొందరు ఆరోపిస్తున్నారు. నాటి సీమాంధ్ర పాలకుల కారణంగా ఆ ఘటన జరిగింది. దానిపట్ల నేను క్షమాపణ చెప్తున్నాను. ఆదివాసీలను గుండెల్లో పెట్టి చూసుకుంటాం..'' అని రేవంత్ పేర్కొన్నారు.

నాగోబాకు పూజలు చేసి.. మహిళలతో భేటీ..

ఇంద్రవెల్లి పర్యటన సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్, మంత్రులు, నేతలు నివాళులు అర్పించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్లస్థలాల పట్టాలు అందజేశారు. ఇక్కడి కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయాన్ని సందర్శించి.. ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన మెప్మా, వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా నాగోబా దర్బార్ హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వ బడుల్లోని విద్యార్థుల స్కూల్ యూనిఫారాలు కుట్టే అవకాశాన్ని మహిళా సంఘాలకు ఇస్తామని హామీ ఇచ్చారు.

ధరణితో కోల్పోయిన భూములను అప్పగిస్తాం: భట్టి

అటవీప్రాంతాల్లోని గిరిజనులకు నీటి వనరులను అందుబాటులోకి తెస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క చెప్పారు. ధరణి ద్వారా కోల్పోయిన భూములను గోండు గిరిజనులకు తిరిగి అప్పగిస్తామని ప్రకటించారు. సీఎం కార్యక్రమాల్లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, వివేక్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, వీహెచ్, మల్లురవి, మధుయాష్కీ తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల్లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

''పదిహేను రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నాం. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకుంటాం. ఇప్పటికే 7వేల నర్సు పోస్టులను భర్తీ చేశాం. కానిస్టేబుళ్లు, ఇతర పోస్టుల భర్తీ వేగంగా చేపడతాం. త్వరలోనే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీని పిలిచి.. లక్ష మంది ఆడబిడ్డల మధ్య ఈ కార్యక్రమాన్ని మొదలుపెడతాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కూడా త్వరలోనే ప్రారంభిస్తాం. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని శాపనార్థాలు పెట్టినా మా ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసమే పాటుపడుతుంది.''

ఆ కార్లు ఎక్కడివి?

- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను ప్రశ్నించిన ఏసీబీ
- రెరా కార్యాలయానికి తీసుకెళ్లిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: ఆ కార్లు ఎక్కడివి..ఎవరు బహుమతిగా ఇచ్చారు? ఒకవేళ మీరే కొంటే..అందుకు సొమ్ము ఎక్కడిది? అంటూ మూడో రోజు కస్టడీలో ఏసీబీ అధికారులు హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను ప్రశ్నించినట్టు తెలిసింది. ఏసీబీకి పట్టుబడడానికి కొద్ది నెలల క్రితమే రెండు కొత్త కార్లు శివబాలకృష్ణకు బహుమతిగా వచ్చినట్టు ఏసీబీ అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. ఇందులో హోండాసిటీ కారును ఓ బిల్డర్, నెక్సాన్ కారు ఓ రియల్‌బ్రోకర్ నుంచి బహుమతిగా వచ్చినట్టుగా ప్రాథమిక ఆధారాల మేరకు అనుమానిస్తున్నారు. ఈ రెండు కార్ల విషయంతోపాటు కుటుంబ సభ్యులు, ఇతర బినామీల పేరిట నడుపుతున్న పలు బ్యాంకు ఖాతాలు, లాకర్ల వివరాలపైనా ఏసీబీ అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. శివబాలకృష్ణ భార్య బంధువు భరత్ పేరిట మరో మూడు లాకర్లు ఉన్నట్టు గుర్తించారు. ఎనిమిది రోజుల కస్టడీలో భాగంగా శుక్రవారం మూడో రోజు శివబాలకృష్ణను ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. తొలిరోజు విచారణలో భాగంగా బుధవారం ఏడు గంటలు, గురువారం ఆరుగంటలపాటు శివబాలకృష్ణను ఏసీబీ అధికారుల బృందం ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే, శుక్రవారం విచారణలో భాగంగా ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి శివబాలకృష్ణను తమ కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు తొలుత రెరా కార్యాలయానికి వెళ్లినట్టు సమాచారం. అక్కడ సోదాల్లో రూ.కోటి విలువైన ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఆ తర్వాత అక్కడి నుంచి నేరుగా బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి తీసుకొచ్చి ప్రశ్నించారు. అయితే తొలి రెండు రోజులు ఏసీబీ విచారణకు సహకరించకపోయినా, వరుసగా కీలక పత్రాలు ముందుంచి తమదైన శైలిలో ప్రశ్నిస్తుండడంతో శివబాలకృష్ణ కొన్ని ప్రశ్నలకు ఏసీబీ అధికారులకు సమాధానాలు ఇస్తున్నట్టు తెలిసింది.

లాకర్లలో భారీగా బంగారం?

శివబాలకృష్ణ, ఆయన కుటుంబసభ్యుల పేరిట ఉన్న బ్యాంకు లాకర్లను ఏసీబీ అధికారులు తెరిపించినట్టు సమాచారం. ఈ లాకర్లలో పెద్ద మొత్తంలో దాచిన బంగారాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అయితే ఎంతమేర బంగారం, ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నారన్న సమాచారం పూర్తిగా తెలియరాలేదు. కాగా, ఏసీబీ కేసు నమోదు చేసిన తర్వాత శివబాలకృష్ణపై మరికొందరు ఏసీబీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తుండడంతో ఏసీబీ అధికారులు ఆ అంశాలపైనా ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. శనివారం మరోమారు ఏసీబీ అధికారులు శివబాలకృష్ణను కస్టడీకి తీసుకొని ప్రశ్నించనున్నారు.

మేడిగడ్డపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుపై ప్రభుత్వ దర్యాప్తు ఎంతవరకు వచ్చింది? ఏం చర్యలు తీసుకున్నారు?.. వివరాలతో నివేదిక అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుకు కారకులెవరో తేల్చేందుకు.. పూర్తి అంశంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. 'జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సీబీఐకి బదలాయించాలి. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.86 వేల కోట్ల సేకరణ వ్యవహారంపై కూడా సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ)లతో దర్యాప్తునకు ఆదేశాలివ్వాలి. నవంబర్ 1న నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఇచ్చిన రిపోర్టును కూడా పరిగణనలోకి తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్ల భద్రతకు వీలుగా చర్యలు చేపట్టేలా నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వాలి'.. అని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ నవంబర్‌లో పిల్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం పై విధంగా ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

మన లక్ష్యం బీజేపీ విముక్త్ భారత్

అందుకే ఇండియా కూటమిలో చేరి ఉద్యమిస్తున్నాం

- దేశంలో మళ్లీ మోదీ ప్రభుత్వం వస్తే విధ్వంసమే
- సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో ప్రధాన కార్యదర్శి డి.రాజా



సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

సాక్షి, హైదరాబాద్: 'పదేళ్ల బీజేపీ పాలనలో అన్ని వ్యవస్థలు విచ్ఛిన్నమయ్యాయి..మరోసారి కేంద్రంలో మోదీకి అధికారం ఇస్తే దేశం విధ్వంసమవుతుంది. బీజేపీ విముక్త్ భారత్ మన లక్ష్యం. ఆ దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలి'అని సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించడానికే ఇండియా కూటమిలో చేరి ఉద్యమిస్తున్నట్టు ఆయన వివరించారు. మూడు రోజులపాటు హైదరాబాద్‌లో జరగనున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో భాగంగా శుక్రవారం తొలిరోజు సమావేశంలో డి.రాజా ప్రారంభోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యదేశంలో అధ్యక్ష తరహా పాలన సాగించేందుకు మోదీ ఒకే దేశం.ఒకే ఎన్నిక అనే నినాదం తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేలా ప్రజలను చైతన్యపరచాలని చెప్పారు. మరోసారి మోదీకి అధికారం కట్టబెడితే దేశ భవిష్యత్ ఆందోళనకరంగా మారుతుందని వ్యాఖ్యానించారు. దేశాన్ని రక్షించేందుకు 'దేశ్ బచావో.. బీజేపీ హఠావో'అని ఇండియా కూటమి నినాదం ఇచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగానికి అనుగుణంగా లౌకిక, ప్రజాస్వామ్య విలువలతో పనిచేసే పార్టీలు గెలవాలని ఆకాంక్షించారు. భారత్ ప్రజాస్వామిక దేశంగా ఉంటుందా..లౌకిక గణతంత్రంగా కొనసాగుతుందా? లేదా ఫాసిస్టు, నియంతృత్వ దేశంగా ఉండబోతుందా? అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. బీజేపీని ఎలా గద్దె దించాలో లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు, శక్తులు వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని చెప్పారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతమొందించి, ఏకస్వామ్య ఫాసిస్టు, నియంతృత్వ వ్యవస్థ తీసుకొస్తోందన్నారు.

కార్పొరేట్ కంపెనీల కోసమే మోదీ సర్కారు

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పేదల కోసం ఎలాంటి ప్రకటనలు చేయలేదని, కార్పొరేట్ సంస్థలకు విధించే పన్నులను 32 శాతం నుంచి 27 శాతానికి తగ్గించారని డి.రాజా అన్నారు. తద్వారా మోదీ ప్రభుత్వం ఎవరి పక్షపాతి అనేది స్పష్టమైందని..

మోదీ, గాంధీల రాముడు వేర్వేరు

బీజేపీ రాముడి పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తోందని, మోదీ చెప్పే రాముడు, గాంధీ చెప్పే రాముడికి తేడా ఉందన్నారు. మోదీ హయాంలో మతతత్వ రాజ్యంగా మారుస్తున్నారని, రాజ్యాంగాన్ని, అందులోని మౌలిక సిద్ధాంతాలు, ప్రజాస్వామ్యం, లౌకికవ్యవస్థను కాలరాస్తోందని విమర్శించారు. గత పార్లమెంట్ సమావేశాలలో ఎంతమంది ఎంపీలను సస్పెండ్ చేశారో అందరికీ తెలుసున్నారు. ప్రజాస్వామ్యం ఉన్నతమైనదని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పార్లమెంటు కళ్లలాంటివని, అలాంటి ప్రతిపక్ష సభ్యులను గత పార్లమెంట్ సమావేశంలో సస్పెండ్ చేశారని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఉంటుందని, పార్లమెంట్ పని చేయకపోతే ప్రజాస్వామ్యం మరణిస్తుందని అంబేడ్కర్ ఆనాడే చెప్పాడన్నారు. సమావేశాలకు రామకృష్ణ పాండా, కూనంనేని సాంబశివరావు, నిషా సిద్ధూలు అధ్యక్ష వర్గంగా వ్యవహరిస్తున్నారు.

సబ్‌కాసాత్ సబ్‌కా వికాస్ అన్నా, వాస్తవ పరిస్థితుల్లో ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. మోదీ పాలనలో యువత భవిష్యత్ అంధకారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ చెబుతున్నారని, అంతర్జాతీయ ఆకలి సూచీలో 125 దేశాల మధ్య భారతదేశం 111వ స్థానంలో ఉండడం ఏమిటని ప్రశ్నించారు.



నాగోబా ఆలయం వద్ద సీఎం రేవంత్, భట్టి, కోమటిరెడ్డి, సీతక్క, కొండా సురేఖ తదితరులు

రెండు గ్యారంటీలపై రేపు నిర్ణయం!

4వ తేదీన రాష్ట్ర కేబినెట్ భేటీ

- రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై చర్చించే అవకాశం
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపైనా చర్చ.. 8 నుంచి ప్రారంభం!
- 9న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం సచివాలయంలో జరగనుంది. కేబినెట్ భేటీలో ప్రధానంగా రెండు గ్యారంటీల అమలుకు సంబంధించి చర్చించనున్నట్లు సమాచారం. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించి కూలంకషంగా చర్చించి, అమలు చేసే తేదీని కూడా నిర్ణయించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ రెండింటితో పాటు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వ్యయం ఎంత అవుతుంది.? ఎంతమందికి లబ్ధి చేకూరుతుందన్న అంశాలపై నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా 4వ తేదీన జరిగే సమావేశంలో ఏ రెండింటిని అమలు చేయాలనే దానిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అలాగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఎప్పటి నుంచి, ఎప్పటివరకు నిర్వహించాలో కూడా నిర్ణయిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ మేరకు కేబినెట్ భేటీలో ఆమోదం తీసుకునే అవకాశాలున్నాయి. ఈనెల 8న బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై ఆరు రోజులు జరిగే అవకాశం ఉందని, 9న బడ్జెట్ ప్రవేశపెట్టవచ్చని తెలుస్తోంది.

ఒక్కరోజే వంద దరఖాస్తులు

- కాంగ్రెస్ లోక్‌సభ టికెట్ల కోసం ఇప్పటివరకు 141 దరఖాస్తులు
- ఆశావహుల్లో బండ్ల గణేశ్, ఎ.చంద్రశేఖర్, ఆయన కుమార్తె
- 3 రిజర్వుడ్ సహా 4 స్థానాలకు సర్వే సత్యనారాయణ దరఖాస్తు



కుమార్‌రావుకు దరఖాస్తు ఇస్తున్న బండ్ల గణేశ్

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ మేరకు పార్టీకి శుక్రవారం ఒక్కరోజే వంద దరఖాస్తులు అందాయి. శుక్రవారం గాంధీభవన్‌కు వచ్చిన పలువురు నేతలు తమ దరఖాస్తులను అందజేశారు. మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వరంగల్, పెద్దపల్లి నియోజకవర్గాలకు ఎక్కువ దరఖాస్తులు రాగా, హైదరాబాద్‌లో తక్కువగా వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో సినీ నిర్మాత బండ్ల గణేశ్ (మల్కాజిగిరి), మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఆయన కుమార్తె చంద్రప్రియ (నాగర్‌కర్నూల్), ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, విద్యా స్రవంతి (సికింద్రాబాద్) పెరిక శ్యామ్ (పెద్దపల్లి) తదితరులున్నారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ఎస్సీ రిజర్వుడు నియోజక వర్గాలైన వరంగల్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్‌తో పాటు జనరల్ స్థానమైన మల్కాజిగిరి కోసం 4 దరఖాస్తులు అందజేశారు. కాంగ్రెస్ ఎంపీ టికెట్ల కోసం ఇప్పటివరకు 141 దరఖాస్తులు రాగా, శనివారం సాయంత్రంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది.

ఖమ్మం బరిలో గడల, వంకాయలపాటి

హాట్‌సీట్‌గా మారిన ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి టికెట్ కోసం శుక్రవారం ప్రజారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్త, వీవీసీ గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వంకాయల పాటి రాజేంద్రప్రసాద్‌లు దరఖాస్తు చేసుకున్నారు. గడల సికింద్రాబాద్ స్థానానికి కూడా దరఖాస్తు చేశారు. ప్రభుత్వ అధికారిగా ఉండి, అప్పటి సీఎం కేసీఆర్ కాళ్లు మొక్కి వార్తల్లోకెక్కిన గడల.. అప్పట్లో కొత్తగూడెం అసెంబ్లీ టికెట్ ఆశించారు. కానీ కేసీఆర్ టికెట్ ఇవ్వలేదు. ఇటీవలే రేవంత్ ప్రభుత్వం గడలను ఆ పోస్టు నుంచి బదిలీ చేసింది. ప్రస్తుతం లాంగ్‌లీవ్‌లో ఉన్న ఆయన ఉన్నట్టుండి గాంధీభవన్‌లో దరఖాస్తులివ్వడం గమనార్హం.

మెజార్టీ స్థానాలు గెలుస్తాం: బండ్ల గణేశ్

మల్కాజిగిరి స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పించాలని కోరుతూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావుకు దరఖాస్తు ఇచ్చిన సినీ నిర్మాత బండ్ల గణేశ్ ..విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మెజార్టీ సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందన్నారు.

రాంచీ టు శామీర్‌పేట

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకెళ్లారు. ఎమ్మెల్యేలు ఇక్కడి నుంచి వెళ్లే వరకు ఈముగ్గురు నేతలు ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.

బలపరీక్ష జరిగేవరకు ఇక్కడే..

జార్ఖండ్‌లో పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ నేతలు బుధవారమే సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర టీపీసీసీ ముఖ్యులతో టచ్‌లోకి వచ్చారు. ఎమ్మెల్యేలను క్యాంపు కోసం హైదరాబాద్‌కు తీసుకువస్తామనే సమాచారం అందించారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నమే వీరు హైదరాబాద్‌కు రావాల్సి ఉన్నప్పటికీ చివరి నిమిషంలో శుక్రవారానికి వాయిదా పడింది. కాగా ఏఐసీసీ నేతలు ఆదేశాల మేరకు టీపీసీసీ వీరి క్యాంపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మాజీ జెడ్పీటీసీ నక్కా ప్రభాకర్‌గౌడ్ పేరిట శామీర్‌పేట రిసార్ట్స్‌లో 38 రూంలు వీరి కోసం బుక్ చేసినట్టు సమాచారం. ఎమ్మెల్యేలంతా మరో రెండు రోజుల పాటు ఇక్కడే ఉండనున్నారు. ఈనెల ఐదో తేదీన జార్ఖండ్ అసెంబ్లీలో చంపయ్ సోరేన్ బలనిరూపణ జరగనున్న నేపథ్యంలో అదేరోజు ఉదయం లేదంటే ముందు రోజు అర్ధరాత్రి వారు ప్రత్యేక విమానంలో రాంచీ వెళ్లనున్నట్టు తెలుస్తోంది.

శిబిరానికి సీఎం రేవంత్!

శుక్రవారం ఇంద్రవెల్లి పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఈ ముగ్గురు నేతలతో సంప్రదింపులు జరిపారని, ఆయన కూడా క్యాంపునకు వెళ్లి జార్ఖండ్ ఎమ్మెల్యేలను కలుస్తారని గాంధీ భవన్ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో ఎమ్మెల్యేలు సురక్షితంగా ఉంటారన్న ఆలోచనతో వారిని హైదరాబాద్‌కు తరలించాలని ఏఐసీసీ నిర్ణయించిన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా క్యాంపు నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను టీపీసీసీ పూర్తి చేసింది. శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హనుమంతరావుతో పాటు పలువురు నాయకులు రిసార్టుకు వెళ్లారు.

4:30 గంటల్లో విశాఖకు..

▶ మొదటి పేజీ తరువాయి

సాగిస్తున్నారు. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ప్రతి రోజు సుమారు 55,000 మంది జాతీయ ప్రయాణికులు ఉండగా మరో 10 వేల మందికిపైగా అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అమెరికా, దుబాయ్, యూరోప్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హైస్పీడ్ రైలులో నేరుగా విజయవాడ, విశాఖ, తదితర నగరాలకు చేరుకొనే వెసులుబాటు ఉంటుంది. ఇటు రైలు ప్రయాణికులు, అటు విమాన ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజధానులను అనుసంధానం చేసే విధంగా హైస్పీడ్ కారిడార్ మార్గాలను ఎంపిక చేసినట్టు దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సకాలంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడితే రానున్న ఐదారేళ్లలో తెలుగు రాష్ట్రాలకు హైస్పీడ్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

ఎలివేటెడ్ కారిడార్ అయితే ఎలా ఉంటుంది...

హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్రాథమిక సర్వే చేపట్టినా, కారిడార్ నిర్మాణానికి ఏ రకమైన సాంకేతిక వ్యవస్థ ఎంపిక చేసుకోవాలనే అంశంపైన కూడా అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం అన్ని రైళ్లు నేల మీద నిర్మించిన పటిష్టమైన ట్రాక్‌లపైనే నడుస్తున్నాయి. ప్రధాననగరాల్లో మెట్రోలకు మాత్రం ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మించారు. ఈ క్రమంలో పటిష్టమైన ట్రాక్ వ్యవస్థ, అత్యధిక వేగం, ప్రయాణికుల భద్రత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని హైస్పీడ్ రైల్‌కు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తేనే బాగుంటుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అయితే 922 కి.మీల వరకు ఎలివేటెడ్ నిర్మాణానికి భారీ వ్యయం కావొచ్చు. ఇప్పుడున్న అంచనాలకు రెట్టింపు ఖర్చు చేయాల్సి రావొచ్చు. నేలపైనే హైస్పీడ్ కారిడార్ నిర్మిస్తే నిర్మాణ వ్యయం తగ్గే అవకాశముంది. ఈ రెండింటిలో ఏ పద్ధతిని ఎంపిక చేసుకోవాలనే అంశంపైనే డీపీఆర్ తర్వాతే ఓ అంచనాకు వస్తామని అధికారులు చెబుతున్నారు.

చర్లపల్లికి సోలార్ ప్రాజెక్టు..

గ్రేటర్ హైదరాబాద్‌లో నాలుగో టర్మినల్‌గా అందుబాటులోకి రానున్న చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో విద్యుత్ సరఫరాకు చేపట్టిన సోలార్ ప్రాజెక్టుకు కేంద్రం తాజా బడ్జెట్‌లో రూ.93.75 కోట్లు కేటాయించింది. స్టేషన్ అవసరాలకు కావాల్సినంత విద్యుత్ ఈ ప్రాజెక్టు నుంచి తీసుకుంటామని అధికారులు తెలిపారు. మార్చి నెలాఖరులో చర్లపల్లి నుంచి రైల్వేసేవలు ప్రారంభించనున్నట్టు జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. సౌరశక్తి ప్రాజెక్టుతో పాటు తుదిదశలో ఉన్న చర్లపల్లి టర్మినల్ నిర్మాణ పనులకు మరో రూ.46 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించారు.

ఎంతో మందిని చూశాం.. నువ్వెంత?

రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

- కృష్ణా జలాలపై హక్కులను రేవంత్ ఢిల్లీకి తాకట్టు పెట్టారు
- జోడో యాత్ర తర్వాత రాహుల్ గాంధీ ఒక్కరే మిగులుతారు
- ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని లేఖ

ఘట్‌కేసర్/సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తల వెన్నంటే ఉంటామని, రాష్ట్రంలో ఎవరికి అన్యాయం జరిగినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలం అండగా నిలుస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల్‌లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ విజయోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయలేమని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి చేతులెత్తేశారని అన్నారు. రుణమాఫీ కోసం రైతులు, ప్రత్యేక బస్సుల కోసం పురుషులు ఎదురు చూస్తున్నారని, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. 'మూడు ఫీట్లు లేనోడు కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను వంద ఫీట్ల లోతులో బొందపెడతాడట, ఇటువంటి తీస్‌మార్ ఖాన్‌లను ఎంతో మందిని చూశాం, ఈయన ఎంత' అని అన్నారు.

ఇండియా కూటమి ఖాళీ..

ఇండియా కూటమిలో ప్రస్తుతం ఎవరూ లేరని మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్, కేజ్రీవాల్, కేరళలో సీపీఎం వాళ్లు వెళ్లిపోయారని, అఖిలేశ్‌యాదవ్ తన దారి తాను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. భారత్ జోడో యాత్ర తర్వాత ఆ కూటమిలో చివరికి రాహుల్ గాంధీ ఒక్కరే మిగులుతారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వచ్చేది లేదు, సచ్చేది లేదని, ఇప్పుడు ఆ పార్టీ ఉన్న పరిస్థితిలో గతంలో ఉన్న 50, 55 ఎంపీ సీట్లు కూడా గెలుచుకోలేదని ఆయన అభిప్రాయపడ్డారు.



మేడ్చల్ బీఆర్ఎస్ విజయోత్సవ సభలో మాట్లాడుతున్న కేటీఆర్

బీజేపీని ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదు

కేంద్రంలోని బీజేపీ సర్కారును ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు జీవనాధారమైన కృష్ణా, గోదావరి జలాల వాటాలు తేల్చే సమయం ప్రధాని మోదీకి లేదని, మరో పక్క సీఎం రేవంత్‌రెడ్డి కృష్ణా జలాలపై బోర్డుకు హక్కులు కల్పిస్తూ తెలంగాణను ఢిల్లీలో తాకట్టుపెట్టారని ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ఏ ప్రాజెక్టు నిర్మించాలన్నా, చుక్క నీరు తీసుకోవాలన్నా ఢిల్లీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత భద్రారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 6956 స్టాఫ్ నర్సు పోస్టులు, 15,750 పోలీసు కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు మండిపడ్డారు. ఉద్యోగాల భర్తీ ఘనత తమదేనని చెప్పుకుంటూ ప్రజలను పిచ్చోళ్లను చేస్తోందని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాల భర్తీతో కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఈ పోస్టులను మంజూరు చేసి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఫలితాలు ప్రకటించి, ఉద్యోగ నియామకాలు చేపట్టే సమయంలో దురదృష్టవశాత్తు ఎన్నికల నియమావళి రావడంతో ప్రక్రియ ఆగిపోయిందని 'ఎక్స్'వేదికగా వెల్లడించారు. అసత్యాలు చెప్పడం కాంగ్రెస్‌కు ఇదే తొలిసారి కాదు.. చివరిసారి కూడా కాదని తారక రామారావు అన్నారు.

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి

➤ రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు డిమాండ్ చేశారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు మీ వల్ల ఇవాళ రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలకు గిరాకీ లేక కుటుంబాల పోషణ భారంకావడంతో 15 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారంటే.. పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం ఓ గిరిజన ఆటో డ్రైవర్ బేగంపేటలోని ప్రజాభవన్ వద్ద ఆటోను తగలబెట్టుకున్న సంఘటనతో ప్రతి ఒక్కరి గుండె బరువెక్కిందని విచారం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని, కానీ ఇప్పటి వరకు స్పందన లేదని ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు ప్రతినెలా రూ.10 వేల లెక్కన ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లతో కలసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రభుత్వం మెడలు వంచి ఆటోడ్రైవర్లకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

అవగాహనతోనే సైబర్‌నేరాలకు అడ్డుకట్ట

విద్యావంతులు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారు
సైబర్ సెక్యూరిటీ బ్యూరో వర్క్‌షాప్‌లో డీజీపీ రవిగుప్తా



సాక్షి, హైదరాబాద్: ప్రజల్లో అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలుగుతామని డీజీపీ రవి గుప్తా అన్నారు. ఈ నేరాల కట్టడికి దేశంలోనే తొలిసారిగా రాష్ట్రస్థాయిలో తెలంగాణ స్టేట్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ (టీ4సీ)ని, జిల్లాల స్థాయిలో డిస్ట్రిక్ట్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైబర్ నేరాలపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వర్క్ షాప్‌లో డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ తనకు సైతం సైబర్ నేరగాళ్ల నుంచి ఎస్ఎంఎస్‌లు వచ్చాయని వెల్లడించారు. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచితే దాదాపు 60 శాతం సైబర్ నేరాలు తగ్గే అవకాశం ఉందన్నారు. సైబర్‌నేరగాళ్ల మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ మీడియాను కోరారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీలు విశ్వజిత్, దేవేందర్ సింగ్, ఏసీబీ నుంచి కేవీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు

▶ మొదటి పేజీ తరువాయి

పైడి రాకేశ్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నా రు. అయోధ్య రామ మందిర నిర్మాణం పూర్తి చేసినందుకు, వికసిత భారత్ సాకారం చేయడానికి వీలుగా బడ్జెట్ ప్రవేశ పెట్టినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు చెబుతూ తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

హామీల అమలుపై క్లారిటీ లేదు

'తెలంగాణ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది. ఒక రోడ్‌మ్యాప్ లేదు. ఇచ్చిన హామీల అ మలుపై క్లారిటీ ఇవ్వడం లేదు. పార్లమెంట్ ఎన్నికల వరకు కాలయాపన చేసే ప్రయత్నం చేస్తోంది' అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ బూత్ స్థాయిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన లోపాలను సరి చేసుకోవాలి. గ్రామ స్థాయిలో నిత్యం కొత్తగా చేరికలు ప్రోత్సహించాలి. ఫిబ్రవరి మొత్తం చేరికల కోసం కేటాయించాలి..' అని కిషన్‌రెడ్డి సూచించారు.

17 సీట్లు గెలిస్తే రాహుల్ ప్రధాని అవుతారా?

తెలంగాణలో 17 ఎంపీ సీట్లు గెలిస్తే రాహుల్ ప్రధాని అవుతారని కాంగ్రెస్ నేతలు మాయ మాటలు చెబుతున్నారని డీకే అరుణ మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పదాధికారుల భేటీ తర్వాత నేతలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు , ఇతరనాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్ని కింది స్థాయి వరకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై భేటీలో చర్చించామని అరుణ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో 10 నుండి 12 స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

నో మొబైల్స్!

పార్టీ అంతర్గత సమావేశాల్లో ముఖ్యనేతలు చెబుతున్న విషయాలపై దృష్టి పెట్టకుండా నేతలు సెల్‌ఫోన్లు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారంటూ.. శుక్రవారం నాటి పదాధికారుల భేటీకి మొబైళ్లను అనుమతించలేదని తెలిసింది. సెల్‌ఫోన్లు అన్నీ ఒకచోట డిపాజిట్ చేశాకే నేతలను సమావేశ మందిరంలోకి అనుమతించినట్లు పార్టీవర్గాలు వెల్లడించాయి.

ఇక బిజీబిజీ

పదాధికారుల సమావేశంలో నిర్ణయించిన మేరకు రాష్ట్ర పార్టీ నాయకులు లోక్‌సభ ఎన్నికల సన్నాహాల్లో బిజీబిజీ కానున్నారు. ఈ నెలలో 17 ఎంపీ సీట్ల పరిధిలో బీజేపీ 'విజయ సంకల్ప రథ యాత్రలు'నిర్వహించనున్నారు. 5 నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లు నడుపుతారు. 5 నుండి 8 వరకు పల్లెకు పోదాం కార్యక్రమంలో బాగంగా కార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామంలో 24 గంటల పాటు ఉంటారు. అక్కడ ప్రజలతో మమేకం అవుతారు. 4 ,5, 6 తేదీల్లో పార్లమెంట్ ప్రవాసీ యోజన ఉంటుంది. 18 నుండి 24 వరకు నారీ శక్తి వందన్ కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమ్మేళనాలు, ప్రతి పార్లమెంట్, అసెంబ్లీలో ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు ఉంటాయి.

కాంగ్రెస్, బీఆర్ఎస్ దోపిడీ చేశాయి

- కాంగ్రెస్ పాలనలో సమస్యలు పరిష్కారమవుతాయనే విశ్వాసం ప్రజలకు లేదు
- కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్ : కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాష్ట్రాన్ని, దేశాన్ని దోపిడీ చేశాయని కేంద్రమంత్రి బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్‌ది అవినీతి, అక్రమాల చరిత్ర అని..అందుకే దేశ ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని బహిష్కరించేందుకు సిద్ధమయ్యారన్నా రు. కాంగ్రెస్ పాలనలో సమస్యలు పరిష్కారమవుతాయనే విశ్వాసం ప్రజలకు లేదన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి సమక్షంలో ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి, బొల్లపు సురేందర్‌రెడ్డి బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర శాఖ డైరీని కూడా కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఫిబ్రవరి 1 ఉద్యోగ నోటిఫికేషన్ ఏదీ?

ఫిబ్రవరి 1న తెలంగాణ నిరుద్యోగ యువత కోసం గ్రూప్–1 నోటిఫికేషన్ ప్రకటిస్తామన్న హామీ ఏమైందని జి.కిషన్‌రెడి ఓ ప్రకటనల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విధంగా కాంగ్రెస్ మరోసారి తన నిజస్వరూపం బయటపెట్టుకుందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

కాంగ్రెస్‌కు ఓటెందుకు వేయాలి

- ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవడంపై బండి ధ్వజం

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా ఆ హామీల ఊసేలేదని ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మాట తప్పుతున్నారని చెప్పడానికి కాంగ్రెస్ మేనిఫెస్టోనే నిదర్శనమన్నారు. ఎన్నికల షెడ్యూల్ వస్తే ఏప్రిల్ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండే అవకాశముందని కాబట్టి ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ఫిబ్రవరి 1న గ్రూప్ –1 ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని ఆ తేదీ గడిచినా కనీసం నోటిఫికేషన్ కూడా వేయలేదని మండిపడ్డారు. గ్రూప్ 1 ఉద్యోగాలతోపాటు గ్రూప్ 2 నియామకాలకు కూడా వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం మంచి పథకమే అయినప్పటికీ దానివల్ల ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని వెంటనే వారికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రామోజీరావుకు సుప్రీంలో ఎదురుదెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

తిరస్కరించిందన్నారు. దీన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఏపీ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. ఓ పక్క ఏపీ హైకోర్టు, మరోపక్క తెలంగాణ హైకోర్టు వేర్వేరుగా విచారణ జరిపి భిన్నమైన తీర్పులు ఇస్తే ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. సంస్థ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉన్నందున సొమ్ములన్నీ తెలంగాణకే చేరతాయన్నారు. తెలంగాణ హైకోర్టులో అనుకూలంగా తీర్పు వస్తే ఎఫ్ఐఆర్‌లు నిరర్థకం అవుతాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం ఏపీ హైకోర్టుకే వెళ్లి తేల్చుకోవాలని పిటిషనర్‌కు తేల్చి చెప్పింది. 'ఏపీ హైకోర్టులో విచారణ జరుగుతున్న పిటిషన్లు తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయడం కుదరదు. కాబట్టి తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్లపై విచారణ పూర్తయ్యే వరకు ఏపీ హైకోర్టులో పిటిషన్లపై స్టే విధించాలని ఏపీ హైకోర్టులోనే ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్ వేసుకోండి''అని ధర్మాసనం ఆదేశించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్‌ను కొట్టివేసింది.

గత ప్రభుత్వ తప్పిదాలు చేయబోం: పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను చేయబోమని, క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గ్రామస్థాయి లో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని శుక్రవారం తన నివాసంలో ఆయన ఆవిష్కరించారు.

గ్రామాలవారీగా ఫిర్యాదుల పెట్టెలు

ఏర్పాటు చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే



కామారెడ్డి జిల్లా గర్గుల్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె

కామారెడ్డి టౌన్: ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తున్నారు. సమస్యలను విన్నవించుకునేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రజలు తరలివస్తుండడంతో వారికి దూరభారాన్ని తగ్గించేందుకు గ్రామాలవారీగా ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయించారు. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ ప్రధాన చౌరస్తాలలో పెట్టెలను ఉంచారు. సమస్యలపై ప్రజలు పెట్టెలో వేసిన ఫిర్యాదు లను ఎమ్మెల్యేకు అందజేస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఎమ్మెల్యే నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్‌ను తిరస్కరిస్తున్నారు

- ఇక్కడ కూడా ఆ పార్టీకి అదే గతి
- ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగిస్తే నల్లగొండకు నీళ్లు రావు: హరీశ్‌రావు

సాక్షి, యాదాద్రి: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తున్నారని, అక్కడి 25 ఎంపీ సీట్లలో 4,5 మాత్రమే వస్తాయని సర్వేలు చెబుతున్నాయని, ఇక్కడ కూడా కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు వాటి స్వార్థం కోసమే పనిచేస్తాయని, తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్షని చెప్పా రు. భువనగిరిలో శుక్రవారం అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డుకు(కేఆర్ఎంబీకి) అప్పగించ డం వల్ల నల్లగొండ జిల్లాకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఈనెల 1న గ్రూప్–1 నోటిఫికేషన్ ఎందుకివ్వలేదో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మేమే పూర్తిచేశాం

నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు మాత్రమే ఇచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. రైతుబంధు డబ్బులు పడటం లేదని ప్రశ్నిస్తే రైతులను చెప్పుతో కొట్టాలనడం ఏం సంస్కారం అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య సంబంధం ఉందని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసిందని మండిపడ్డారు. రైతుబంధు, పింఛన్, రుణమాఫీ, కరెంట్, ఉద్యోగాలు, వడ్లకు బోనస్ వంటి హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. ఈ అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్‌ను ముట్టుకుంటే ఏం జరుగుతుందో చూడాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. సమావేశంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. పక్కన జగదీశ్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై నెగ్గిన అవిశ్వాసం

నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ చైర్‌పర్సన్ రుబీనా బేగం, వైస్ చైర్మన్ అహీర్ పరశురాంలపై శుక్రవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో 8 మంది కాంగ్రెస్, ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌కు ఆధిక్యత ఉన్నా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీ బీబీ పాటిల్, అప్పటి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, ఫారూక్ హుస్సేన్‌ల ఓట్లతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బీఆర్ఎస్ దక్కించుకుంది. అనంతరం కొన్ని రోజులకే కాంగ్రెస్ కౌన్సిలర్ నర్సింహులు బీఆర్ఎస్‌లో చేరారు. అయితే 20 రోజుల క్రితం బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంధ్యారాణి, మాజీద్ కాంగ్రెస్‌లో చేరగా నర్సింహులు సైతం సొంత గూటికి వచ్చారు. దీంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం 10కి పెరిగింది. బీఆర్ఎస్‌కు ఐదుగురు కౌన్సిలర్లే ఉన్నారు. 10 మంది అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారు. ఉదయమే బీఆర్ఎస్‌కు చెందిన మరో కౌన్సిలర్ కవిత కాంగ్రెస్‌లో చేరారు. మున్సిపాలిటీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ కోసం జరిగిన సమావేశానికి కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లతోపాటు బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలిపి మొత్తం 13 మంది హాజరయ్యారు. వీరంతా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, నారాయణఖేడ్ ఆర్డీవో వెంకటేశ్ ప్రకటించారు.

వెంకయ్యనాయుడికి వీహెచ్‌పీ సన్మానం

సాక్షి, హైదరాబాద్: పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపికైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని శుక్రవారం హైదరాబాద్‌లో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ లక్ష యువగళ గీతార్చన, భగవద్గీత, విశ్వహిందూ పరిషత్ స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక, జాగృతి పత్రిక అయోధ్య రామ జన్మభూమి ప్రత్యేక సంచికలను ఆయనకు బహూకరించింది. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్వర్, డాక్టర్ రాంసింగ్, రాష్ట్ర సహ కార్యదర్శి భాను ప్రసాద్ పాల్గొన్నారు.

> మేము ఆకాశం నుండి నీటిని కురిపించినపుడు, దానిని భూమిలోని చెట్లూ చేమలు పీల్చుకొని (పచ్చగా పెరుగుతాయి). అవి ఎండి పొట్టుగా మారిపోయినపుడు, గాలి వాటిని చెల్లాచెదురు చేస్తుంది. అల్లాహ్‌యే ప్రతిదీ చేయగల సమర్థుడు.
> – ఇస్లాం ధర్మం

సాక్షి
శనివారం, 3 ఫిబ్రవరి 2024

ఇంత నాటకీయత దేనికి?!

జార్ఖండ్ చుట్టూ ఈ వారమంతా చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజానీకాన్ని నివ్వెరపరిచాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధినేత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జాడ తెలియడం లేదనీ, ఆయన గురించి జనవరి 27 నుంచి వెదుకుతున్నామనీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గత నెల 28న చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత 30 గంటల పాటు ఆయన ఆచూకీ లేదు. ఢిల్లీ వెళ్లారన్న సమాచారం ఉన్నా అక్కడి నివాసంలో ఆయన అధికారులకు చిక్కలేదు. అన్ని మార్గాలనూ దిగ్బంధించి వెతుకులాడిన దర్యాప్తు అధికారులకు చివరకు నిరాశే మిగిలింది. జనవరి 31న ఆయన తనంత తానే రాంచీ నివాసంలో ప్రత్యక్షం కావటం, గవర్నర్‌ను కలిసి రాజీనామా సమర్పించటం, అటుపై ఆయన్ను రాత్రి 9.30కి ఈడీ అరెస్టు చేయటం చకచకా జరిగిపోయాయి. హేమంత్ స్థానంలో కొత్త సీఎంగా 'జార్ఖండ్ టైగర్'గా పేరున్న చంపయ్ సోరెన్ శుక్రవారం ప్రమాణస్వీకారం కూడా చేశారు. ఈ నెల 5 లోపు బలపరీక్ష నిరూపించుకోవాల్సిన నేపథ్యంలో జేఎంఎం ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌కు తరలివచ్చారు. రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు పిలుస్తారో లేదోనన్న ఆందోళన సమసిపోయాక, తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవటం ఎలా అన్నది జేఎంఎంకు సమస్యగా మారినట్టుంది. కూటమి సర్కారులో భాగస్వామి అయిన కాంగ్రెస్ మిత్రధర్మంగా తెలంగాణలో తలదాచుకోవటానికి చోటిచ్చింది.

ఈ వ్యవహారంలో ఈడీ పట్టుదల... ఏదేమైనా దానికి చిక్కరాదన్న హేమంత్ తీరు... మీడియాకు కావలసినంత మేతనిచ్చాయి. ముఖ్యమంత్రి హోదాలో వున్న నాయకుణ్ణి, అందులోనూ ఒక ఆదివాసీ నేతనూ వెంటాడటం అంత అత్యవసరం ఎందుకైందో బోధపడదు. ఆయనపై వున్న కేసులు తీవ్రమైనవే కావొచ్చు, వాటి విషయమై ప్రశ్నించాలని ఈడీ అధికారులు భావించివుండొచ్చు... దాన్ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ఫోర్జరీ పత్రాలతో ఆయన రాంచీలోనూ, వేరేచోట్లా భూములు కాజేశారని ఆ సంస్థ ఆరోపణ. కానీ ఆయన చట్టానికి దొరక్కుండా తప్పించుకుపోయే సాధారణ వ్యక్తేమీ కాదు. అలాగని బ్యాంకులకు వేలకోట్లు ఎగనామంపెట్టి విదేశాలకు పోయిన కొందరిలా వ్యాపారో, పారిశ్రామికవేత్తో కాదు. ఆయన ఒక రాజకీయ పార్టీకి నేతృత్వం వహిస్తున్న నాయకుడు. జార్ఖండ్ సీఎం. జనం మధ్యనే ఉండి, వారి మద్దతుతో రాజకీయాల్లో కొనసాగదల్చుకున్నవారు. హేమంత్ సోరెన్ ఉద్దేశపూర్వకంగా ఈడీ సమన్లను బేఖాతరు చేయటం వల్ల వారంలో పూర్తయ్యే దర్యాప్తు నెలరోజులు పట్టొచ్చు. లేదా మరికొన్ని నెలలు కొనసాగొచ్చు. ఈలోగా మిన్ను విరిగి మీద పడుతుందా? ఇప్పటికే 41 చోట్ల సోదాలు చేసి, అయిదు సర్వేలు నిర్వహించామని ఈడీ చెబుతోంది. హేమంత్ ఢిల్లీ నివాసంలో నిర్వహించిన దాడిలో భారీగా నగదు, కీలకమైన పత్రాలు లభించాయన్నది ఈడీ ప్రకటన సారాంశం. ఈ విషయంలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని హేమంత్ సోరెన్ ఆరోపిస్తూ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఈడీ సిబ్బందిపై కేసు కూడా పెట్టారు. దేనికైనా సమయం, సందర్భం ఉండాలంటారు. మరో మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ ఏడాది ఆఖరుకు జార్ఖండ్ అసెంబ్లీ గడువు కూడా ముగుస్తుంది. ఇప్పటికిప్పుడు ఈ కేసుల్లో ఇరికించి అరెస్టు చేయాలనుకోవటం అప్రదిష్ట పాలు చేయటానికేననీ, తనను రాజకీయంగా దెబ్బతీసే కుట్రనీ హేమంత్ చేస్తున్న ఆరోపణ జనం విశ్వసించే అవకాశం లేదా? హేమంత్ కూడా ఇంత నాటకీయతకు తావివ్వకుండా ఉండాల్సింది. రాజకీయంగా ఆయన ఇబ్బందులు ఆయనకుండొచ్చు. తన అరెస్టు ఖాయమని తెలిశాక తదుపరి సీఎం ఎవరన్న అంశంలో గృహచ్ఛిద్రాలు కమ్ముకున్నాయి. సతీమణి కల్పనా సోరెన్ వైపు ఆయన మొగ్గుచూపగా, హేమంత్ దివంగత సోదరుడి సతీమణి, ఎమ్మెల్యే సీతా సోరెన్ పేచీకి దిగటం సమస్య అయిందంటున్నారు. సంక్షేమ పథకాల అమలులో, మెరుగైన పాలన అందించటంలో హేమంత్ సర్కారుకు మంచిపేరే ఉంది.

జార్ఖండ్ ఏర్పడి 24 ఏళ్లు కావస్తుండగా 2014–19 మధ్య అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు మినహా ఏ ప్రభుత్వమూ పూర్తిగా అయిదేళ్లూ పాలించలేకపోయింది. అస్థిరత్వమే రాజ్యమేలిన ఆ రాష్ట్రంలో తొలిసారి 2019 ఆఖరులో జరిగిన ఎన్నికల్లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాల కూటమికి 47 స్థానాలు లభించాయి. 81 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో అధికార కూటమికి ఇంత మెజారిటీ ఉండటం అదే మొదటిసారి. చిత్రమేమంటే అంతకు ఆర్నెల్ల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలకు బీజేపీ–ఏజేఎస్‌యూ కూటమి 12 గెల్చుకుంది. జార్ఖండ్‌లో గతంలో బీజేపీతో జేఎంఎం కూటమి కట్టిన సందర్భాలు లేకపోలేదు. కానీ మౌలికంగా రాష్ట్రంలో తనకు బీజేపీయే ప్రధాన ప్రత్యర్థి అని గ్రహించాక గత దశాబ్ద కాలంగా బీజేపీతో పొత్తుకు జేఎంఎం సుముఖత చూపటం లేదు. పైగా ఆదివాసీలను హిందువులుగా చూపాలన్న సంఘ్ పరివార్ వైఖరికి భిన్నంగా వారిని ప్రత్యేక మతస్థులుగా గుర్తించాలని హేమంత్ డిమాండ్ చేస్తున్నారు. ఈ కారణాల వల్లే ఈడీ ఆయన్ను వేధిస్తున్నదని ఆదివాసీలు నమ్మితే అది రాజకీయంగా బీజేపీకి నష్టంగా పరిణమిస్తుంది. ఏదేమైనా ఈ వ్యవహారంలో ఈడీ అత్యుత్సాహం ప్రదర్శించిందన్న అప్రదిష్టను మూటకట్టుకుంది. ఇప్పటికే ఆ సంస్థ తీరును విపక్షాలు తూర్పారబడుతున్నాయి. అటు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కూడా హేమంత్ సోరెన్ మాదిరే ఈడీ సమన్లను ధిక్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈడీ సంయమనంతో వ్యవహరించి నిందకు తావులేకుండా చూసుకోవాలి. అలాగే జార్ఖండ్‌లో ఎలాంటి రాజకీయ అస్థిరతకూ బీజేపీ తావీయరాదు.

ఇతర రాష్ట్రాలకు నమూనాగా ఏపీ విద్య

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొన్న జనవరి 30న ఒకటవ తరగతి నుంచే ఐబీ సిలబస్‌తో పాఠశాల విద్యను ప్రారంభించడానికి ఒక అంతర్జాతీయ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇంగ్లిష్ మీడియంలో ప్రభుత్వ పాఠశాల విద్యను ప్రపంచ ప్రమాణాలకు అనుసంధానం చేయడంలో ఇది మరో ప్రధాన అడుగు. విద్యార్థులు దీంతో ఉమ్మడి సర్టిఫికెట్ పొందుతారు. విజ్ఞాన భారత్‌ను నిర్మించడంలో భాగంగా, ఏపీ ప్రభుత్వం అసాధారణ రీతిలో పాఠశాల విద్యపై దృష్టి సారించిందన్న విషయం, గణతంత్ర దినోత్సవం నాడు ప్రదర్శించిన రాష్ట్ర శకటంలో ప్రతిఫలించింది. గ్రామీణ పాఠశాల విద్య నుండి ప్రపంచ స్థాయి తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యులను సృష్టిస్తుందని ప్రపంచానికి చాటడానికి ప్రదర్శించిన అత్యంత గొప్ప భవిష్యత్ శకటం ఇది.

న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన 2024 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో, 'పాఠశాల విద్య పరివర్తన' థీమ్‌తో ఒక శకటాన్ని ప్రపంచ, జాతీయ నాయకత్వం ముందు ప్రదర్శించడం ద్వారా భవిష్యత్తుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ కొత్త దృక్పథాన్ని చూపించింది.

విద్యార్థులు, ఉపాధ్యాయులు పాడుతూ, నృత్యాలు చేస్తూ శకటం వెంట కదిలారు. అధికారులు సృజనాత్మకంగా నిర్మించిన ఆ శకటాన్ని పరేడ్‌లో ఉంచడానికి ఏపీ ముఖ్యమంత్రికి ధైర్యం, విశ్వాసం అవసరం. దాన్ని వీక్షించిన అంతర్జాతీయ, జాతీయ వీక్షకులు చాలా ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. ఎందుకంటే ఇది ఇతర రాష్ట్ర శకటాల కంటే ఒక ప్రధాన వ్యత్యాసాన్ని కనబర్చింది.

'సకల విద్యలకు మేమే సాటి / విశ్వ విద్యకు మేమే పోటీ' అంటూ పిల్లలు పాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లల కోసం అందిస్తున్న ఇంగ్లిష్ మీడియం విద్యా నాణ్యత గురించి ఈ పాట చెబుతుంది. తమ పాఠశాల యూనిఫారంలో నిలబడి ఉన్న విద్యార్థులు వారి టాబ్లెట్‌లు, ద్విభాషా పుస్తకాలను చూపుతున్నారు. ఉపాధ్యాయులు నైపుణ్యాలను, జ్ఞానాన్ని నేర్చుకోవడంలో వారికి సహాయం చేస్తున్నారు. భారతదేశం తన గ్రామీణ పాఠశాల విద్య నుండి ప్రపంచ స్థాయి తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యులను సృష్టిస్తుందని ప్రపంచానికి చాటడానికి ప్రదర్శించిన అత్యంత గొప్ప భవిష్యత్ శకటం ఇది. గణతంత్ర దినోత్సవ అతిథిగా వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ దానిని ఆసక్తితో చూశారు. పాఠశాల విద్యకు సంబంధించిన పరివర్తన సందేశం గురించి ఒక అనువాదకుడు ఆయనకు వివరించడం కనిపించింది.

గత 74 సంవత్సరాల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా రిపబ్లిక్ డే పరేడ్‌లలో ఇలాంటి వినూత్న పాఠశాల విద్యా నమూనాను ప్రదర్శించలేదు. నాణ్యమైన విద్య కాకపోయినా, అక్షరాస్యత రేటును చూపించడానికి ధైర్యం చేయగల ఏకైక రాష్ట్రం కేరళ కూడా ఇన్నేళ్లుగా తమ పాఠశాల విద్యా విజయాన్ని ఏపీ ప్రభుత్వం రీతిలో జరుపుకోవాలని అనుకోలేదు.

వాస్తవానికి, ప్రతి అధికార రాజకీయ పార్టీ తన పనితీరు, విధాన కార్యక్రమం ఆధారంగా ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తుంది. కానీ పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన కొత్త ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్య, గ్లోబల్ పవర్ హౌజ్‌గా మారాలని భావిస్తున్న ప్రజాస్వామ్యంలో హృదయాన్ని కదిలించే విషయం. నాణ్యమైన పాఠశాల విద్య అనే ఆలోచనను జగన్ ప్రైవేట్ నుంచి పబ్లిక్‌గా మార్చారు. మారుమూల గ్రామాల్లోని పేద పిల్లలు తమ సొంత గ్రామంలోని పాఠశాలల్లో ఆధునిక ప్రపంచ నైపుణ్యాలను నేర్చుకుంటూ ఆత్మవిశ్వాసంతో, గౌరవంగా జాతీయ, ప్రపంచ మార్కెట్లలోకి రావాలని ఆశపడుతున్నారు. జగన్ తన ముందున్న అభివృద్ధి నమూనాకు విరుద్ధంగా ఈ అభివృద్ధి నమూనాను ఎంచుకున్నట్లు కనిపిస్తుంది. చంద్రబాబు నాయుడు సింగపూర్ వంటి రాజధాని నగరం నిర్మించడానికి 30,000 ఎకరాల భూమిని సమీకరించడంలో రాష్ట్ర వనరులను పెట్టుబడిగా పెట్టారు. ప్రభుత్వ రంగాన్ని ఏమాత్రం పట్టించుకోని ప్రైవేట్ రంగ పెట్టుబడి నమూనాయే ఆయన నమూనా. విద్యా రంగంలో కూడా ప్రైవేట్ పెట్టుబడిదారులను ఆయన ప్రోత్సహించారు.



గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రదర్శించిన 'పాఠశాల విద్య పరివర్తన' శకటం

ఏపీ శకటం ఇతర రాష్ట్ర శకటాలతో పోలిస్తే భిన్నంగా ఉంది. గత వైభవం, స్వాతంత్ర్య పోరాట చిహ్నాలు, మతపరమైన చిహ్నాలు లేదా వారి గిరిజన, సాదాసీదా జీవన స్త్రీలను మిగతా రాష్ట్రాలు ప్రదర్శించాయి. ఈ ఏడాది రిపబ్లిక్ పరేడ్ కవాతును దేశంలో మహిళా సాధికారతను ప్రత్యేకంగా ప్రదర్శించడానికి ఉద్దేశించారు. సైన్యంలోని అన్ని విభాగాల్లో, ఇస్రో వంటి వైజ్ఞానిక కార్యకలాపాలలో, ప్రతి రంగంలో దేశం మహిళలను ఎలా ప్రోత్సహిస్తోందో ప్రపంచానికి చూపించడానికి దీన్ని రూపొందించారు. అంతరిక్ష శాస్త్రంలో తన సొంత మహిళా శక్తిని 'ఇస్రో' తన శకటంలో ఉంచింది. ఆ రకంగా అది దాని సొంత భవిష్యత్తు యోగ్యతను కలిగి ఉంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ (రామ్ లల్లాపై తన శకటాన్ని రూపొందించింది) వంటివి తమ సాంప్రదాయ నృత్యం చేసే మహిళలతో తమ శకటాలను రూపొందించాయి. కానీ ప్రపంచీకరణ యుగంలో ఆధునికమైన, చక్కగా అమర్చిన ఇంగ్లిష్ మీడియం విద్యతో, పాఠశాల విద్యను ఈ దేశ భవిష్యత్తుగా చూపిన ఏకైక రాష్ట్రం ఏపీయే.

ఇప్పటికీ అర్ధ–మధ్యయుగ జీవన వ్యవస్థలతో వేలాడుతున్న గిరిజన (ఈశాన్య రాష్ట్రాలు, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ మొదలైనవి) లేదా గిరిజనేతర మహిళల భవిష్యత్తు సవాళ్లు ఏమిటో ఆ యా రాష్ట్రాలు చూపలేదు. ముస్లిం మహిళల స్థితిగతులు ఏమిటో ఏ శకటమూ చెప్పలేదు. కశ్మీర్ నుంచి కనీసం అలాంటి ఒక్క శకటాన్నయినా తేవాల్సింది.

రాష్ట్ర చరిత్రను చూపించడం ఒక విషయం; పిల్లలకు చక్కగా, ప్రణాళికాబద్ధమైన విద్యను అందించడం ద్వారా దేశ భవిష్యత్తును చూపించడం మరొక విషయం. ఆంధ్రప్రదేశ్ దీనిని స్పష్టమైన విజన్ తో చేసింది. ఏపీ శకటం కదులుతుండగా ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని జాగ్రత్తగా గమనించారు. ఆయన సొంత గుజరాత్ మోడల్ కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను అంత బాగా అందించలేకపోయింది. గుజరాత్ కూడా ఇప్పుడు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య కోసం ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడుతోంది. అది కూడా ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉంది.

భారతదేశం పాశ్చాత్య దేశాలతో, చైనాతో పోటీ పడాలని ఆకాంక్షిస్తున్నప్పుడు, తమ సొంత ప్రాంతీయ భాషలో చక్కటి పునాది కలిగివుండి, ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందించడమే ఏకైక మార్గం. జగన్ మోహన్ రెడ్డి చైతన్యపూర్వకమైన ప్రయత్నంతో నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యపై ఆంధ్రా విద్యార్థులకు విశ్వాసం ఏర్పడింది. ఇప్పుడు దాన్నే వైఎస్ జగన్ తన ఎన్నికల ఆయుధంగా మలుచుకున్నారు. ఆ ఆలోచనతోనే ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాఠశాల విద్యా శకటాన్ని ప్రదర్శింపజేశారు.

పాఠశాల విద్యలో కేంద్రం లేదా రాష్ట్రం ఏదైనా పెద్ద సానుకూల అడుగు వేసిందంటే తప్పనిసరిగా అభినందించాలి. దేశ భవిష్యత్తు అక్కడే ఉంది. సైద్ధాంతిక విభేదాలు ఏ విషయంలోనైనా ఉండవచ్చు, కానీ ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా నాణ్యమైన పాఠశాల విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడంలో కచ్చితంగా విభేదాలు ఉండకూడదు. అప్పుడు మాత్రమే పిల్లల భవిష్యత్తుకు ఎదురుదెబ్బ తగలదు. ఏ పిల్లవాడు అయినా రెండు భాషలను చాలా సులభంగా నేర్చుకోగలడు. మన విషయంలో అది ఇంగ్లిష్, పిల్లల ప్రాంతీయ భాష అయి ఉండాలి. కేంద్ర ప్రభుత్వం కూడా ఆంధ్రా విద్యా నమూనాను అర్థం చేసుకుంటుందని, అభినందిస్తుందని ఎవరైనా ఆశిస్తారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చివరి శిఖరం



నా భర్త గత రాత్రి (ఫిబ్రవరి 1) ప్రశాంతంగా వెళ్లిపోయారు. ఒక పర్వతారోహకుడిగా అత్యంత ఎత్తయిన శిఖరానికి ఆయన చేసిన చివరి ప్రయాణం ఇది. ముందుకు సాగిపో, తర్వాత వచ్చి కలుస్తానని చెప్పాను. పూర్తి జీవితం ఇతరుల సేవలో గడిపిన మంచి మనిషి ఆయన!

– మేరీ జోల్స్, నాచురలిస్ట్

బరువు కాకూడదు!



ఇప్పుడే లెక్క గట్టాను: మొత్తం జీఎస్సీ వరకు ఇండియాలో నా చదువుకు అయిన ఖర్చు కేవలం 15,000 రూపాయలు. ఇది 1978–1994 వరకు. చదువు అందుబాటులో ఉండటం వల్ల మాత్రమే నేను ఈరోజు ఇక్కడ (ఛైర్, మిషిగన్ పబ్లిక్ హెల్త్, యూఎస్‌ఏ) ఉండగలిగాను. అందరికీ ఉచిత విద్య అనేది నా కల!

– భ్రమర్ ముఖర్జీ, పరిశోధకురాలు

సున్నితత్వం లేదా?



మొన్న కోల్‌కతా విమానాశ్రయంలో సెక్యూరిటీ క్లియరెన్స్ కోసం వెళ్లినప్పుడు అక్కడి అధికారి నన్ను లేచి నిలబడమన్నారు. వీల్‌ఛైర్‌లో ఉన్నానని తెలిసీ, ఒకసారి కాదు, మూడుసార్లు అన్నారు. ఆమె నన్ను లేచి కనీసం రెండు అడుగులైనా వేయమన్నారు. నేను పుట్టుకతో నడవలేనని వివరించాల్సి వచ్చింది.

– ఆరుషి సింగ్, న్యాయవాది

వాగ్దానం నెరవేరేనా?



ఇండియాలోని పన్ను చెల్లింపుదారులు, ముఖ్యంగా క్రమంగా ఆదాయ పన్ను చెల్లించే ఉద్యోగులందరికీ కొంత శాతం నల్లధనాన్ని బహుమతిగా ఇస్తానని ప్రధాని కావడానికి ముందు మోదీ వాగ్దానం చేశారు. ఆయన అధికారంలోకి వచ్చి దాదాపు పదేళ్లు అవుతోంది.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

పెరిగిన వయసు



పూర్తిగా పని చేయడం మానేసే దాకా నా ఫోన్ మార్చని వయసుకు నేను అధికారికంగా వచ్చేశాను.

– జెన్ని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్ బాక్స్

ఈ ఆహారంతో ఎంతో మేలు

సంపూర్ణ ఆరోగ్యానికీ, క్యాన్సర్ నివారణకూ క్షారదేహతత్వ ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆల్కలైన్ (క్షారతత్వ) ఆహారాలు, సమతుల తత్వ ఆహారాలు, ఎసిడిక్ (ఆమ్ల తత్వ) ఆహారాలు అని ఆహారాలను విభజించవచ్చు. వీటిలో సమతులతత్వ ఆహారం తీసుకుంటే కేన్సర్ తదితర అనారోగ్య సమస్యలు దరికి చేరవు. శరీరంలోని అంతర్గత వాతావరణంలోని పీహెచ్ (పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్) బ్యాలెన్స్ క్షారతత్వంగా ఉండాలి. రోజువారి జీవితంలోని శారీరక జీవ ప్రక్రియలు (మెటబాలిజం) సక్రమంగా కొనసాగడంలో శరీరంలోని ఈ 'పీహెచ్ బ్యాలెన్స్' కీలక పాత్ర పోషిస్తుంది.

అమ్లతత్వాలు, క్షార తత్వాలు సాధారణంగా 0 నుండి 14 వరకు ఉంటాయి. పీహెచ్ 7ను 'న్యూట్రల్'గా... అంటే 'సమతుల దేహతత్వం'గా భావించాలి. అంతకన్నా తగ్గితే 'ఆమ్ల దేహతత్వం' గాను, పెరిగితే 'క్షార దేహతత్వం'గాను పరిగణించాలి. పీహెచ్ బ్యాలెన్స్ స్థిరంగా ఉంచే ఆహారాన్ని ఆల్కలైన్ ఆహారం అంటారు. టమోట, బొప్పాయి, సిస్ పండ్లు, దబ్బకాయ, నారింజ, బెర్రీస్, బ్రకోలి, కాలిఫ్లవర్, బుడమదోస కాయ, సొరకాయ, దోసకాయ, బూడిద గుమ్మడి, నేతి బీర, కొబ్బరి, కొబ్బరి నూనె, తులసి, మంచి పసుపు, గోధుమనారు గడ్డి వంటివి క్షారతత్వ గుణాన్ని పెంచుతాయి. పారిజాతం ఆకులు, మారేడు ఆకులు, తమలపాకుల కషాయాలు; కెమోమెల్ల, పెప్పరమెంట్ లాంటి హెర్బల్ టీలు కూడా ఉపయోగపడతాయి.

ఎండు మిరపకాయలు, ఎండు కారం, చింతపండు, మితిమించిన ఉప్పు, అధిక వేపుళ్ళు, బాండీ వంటకాలు, కలుషిత వంట నూనెలు; పాలు, పెరుగు, జున్ను మొదలైన పాల ఉత్పత్తి ఆహారాలు 'ఎసిడిక్ (ఆమ్ల) గుణాన్ని పెంచుతాయి. వీటికి బదులుగా కొబ్బరి పాలు, నువ్వుల పాలు, వేరుశెనగ పప్పుల పాలు, ఈ పాల పెరుగునూ వాడవచ్చు.

ముఖ్యంగా 'చిరుధాన్యాల అంబలి' వంటివి ప్రత్యామ్నాయాలుగా ఎంచుకోవాలి. ఎక్కువగా ప్రాసెస్ చేసిన రిఫైండ్ వంట నూనెలు, పంచదార, తీపి ఉత్పత్తులు; ఇవి గాక తెల్లని పంచదార, తెల్లని పాలు, తెల్లని ఉప్పు, తెల్లని బియ్యం, తెల్లని ఇడ్లీలు, కాఫీ, టీ, శీతల పానీయాలు ఆమ్ల తత్వాన్ని పెంచుతాయి. పౌష్టిక ఆహారమైన మాంసం, గుడ్లు, చేపలు, మొదలైనవి కూడా ఈ తత్వాన్ని పెంచుతాయి. అయితే ... అలాగని 'ఆమ్ల తత్వ ఆహార' పదార్థాలకు పూర్తిగా దూరమైతే పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉంది. ఈ లోపం తలెత్తకుండా వాటిలోని ఆరోగ్యకరమైన ఆహార పదార్థములను ఎంచుకొని పరిమితంగా తీసుకుంటూ ఉండాలి.

అలాగే ఈ ఆహార నియమాలతో పాటు... వేళకు తగినంత నిద్ర పోవడం, వేళకు ఆహారం తీసుకోవడం, వ్యాయామం, యోగా, ధ్యానం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం లాంటి ప్రకృతి వైద్య విధానాలు కూడా పాటించాలి. 'ప్రపంచ క్యాన్సర్ డే' సందర్భముగా ఈ నియమాలు తెలుసుకుని, పాటిస్తూ ప్రజలందరు ఆయురారోగ్యంగా ఉండాలి. ఈ ప్రకృతి జీవన విధానం ద్వారా క్యాన్సర్ రహిత ప్రపంచాన్ని సృష్టించవచ్చు.

– డా॥ ఎస్. శ్రీనివాస్, బాపట్ల; డా॥ కోట్నీస్ శత జయంతి పురస్కార గ్రహీత
(రేపు వరల్డ్ క్యాన్సర్ డే)

శాస్త్రీయ వ్యవసాయ ప్రణాళిక ఏది?

అభిప్రాయం



సారంపల్లి మల్లారెడ్డి

గత ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళికలను తయారు చేయకుండా రైతుల ఇష్టానిష్టాలపై వ్యవసాయ ఉత్పత్తులను సాగించింది. అంతకుముందు ఉన్న వ్యవసాయ ప్రణాళికలను 2021 –22 నుండి పూర్తిగా ఎత్తి వేసింది. మార్కెట్ ధరలను బట్టి రైతులు పంటలు పండించడమే తప్ప ప్రణాళికాబద్ధంగా వ్యవసాయ ఉత్పత్తి జరగలేదు. వ్యవసాయ ప్రణాళిక ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు చేయాలని జరిపిన ఆందోళనలు ప్రభుత్వం పట్టించుకోలేదు. వరి, పత్తి పంటలకు ఇచ్చిన ప్రాధాన్యం ఇతర పంటలకు ఇవ్వలేదు. రాష్ట్రంలో సాగుభూమి 163 లక్షల ఎకరాలు కాగా, వాస్తవంగా సాగుచేసింది 123 లక్షల ఎకరాలు మాత్రమే. అందులో యాసంగి 70 లక్షల ఎకరాలు మాత్రమే సాగయింది. అనగా వానాకాలం, యాసంగి కలిసి 200 లక్షల ఎకరాలు మాత్రమే సాగయింది.

చాలామంది రైతులు చవిటి భూములలో కూడా పత్తి లాంటి పంటలు వేసి నష్టపోతున్నారు. ఏ భూమిలో ఏ పంటలు వేయాలన్నది భూసార పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలి. భూసార పరీక్షలు జరిపి రైతులకు 'సాయిల్ హెల్త్ కార్డు' ఇవ్వాలి. భూసార పరీక్షలు జరపడం గత పదేళ్లుగా అమలు చేయనందున రైతులు తమకు తోచిన పంటలు పండిస్తున్నారు. పప్పులు, నూనెలు, ముతకధాన్యాల ఉత్పత్తులు హెచ్చుతగ్గులకు గురవుతున్నాయి. ముతక ధాన్యాల ఉప ఉత్పత్తులు (రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు) దిగుమతులు చేసుకుంటున్నాము.

ఒకవైపున జనాభా 1.9 శాతం పెరుగుతుండగా వ్యవసాయ భూమి విస్తీర్ణం తగ్గుతున్నది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలు నిరంతరం పెరగాలి. ఇందుకు పంటల పరిశోధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. 2014 తర్వాత నుంచి వ్యవసాయ పరిశోధనా ఫలితాలను కూడా దిగుమతి చేసుకున్నాము. మోన్‌శాంటో, డ్యూపాంట్, కార్గిల్, సింజెంటా, బేయర్ లాంటి సంస్థలు వ్యవసాయ పరిశోధనలు చేసి లాభాలు సంపాదిస్తున్నాయి. రాష్ట్ర వాతావారణానికి అనుకూలంగా ప్రాంతీయంగా వ్యవసాయ పరిశోధనలు జరగాలి. ఇతర దేశాలలోని పరిశోధనా ఫలితాలను వినియోగించడం ద్వారా పంటల ఉత్పత్తులు దెబ్బతిని రైతులు నష్ట పోతున్నారు.

ప్రతి మూడువేల ఎకరాలకు ఒక ఏఈఓను (వ్యవసాయ విస్తరణాధికారి) నియమించాలని రైతులు ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ నేటికీ తగినంతమంది వ్యవసాయ అధికారులను గత ప్రభుత్వం నియమించలేదు. హార్టికల్చర్ శాఖలో 2179 పోస్టులకు గాను 901 ఖాళీగా ఉన్నాయి. వ్యవసాయ శాఖలో 2,800 పోస్టులు ఖాళీలున్నాయి. రాష్ట్రంలో 1,167 గోదాముల ద్వారా 24.74 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 2014 వరకు 710 గోదాములలో 7.39 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఉంది. ఆ తర్వాత ప్రకటించిన 457 గోదాముల నిర్మాణం నేటికీ పూర్తికాలేదు. వ్యవసాయ ఉత్పత్తులను గ్రేడింగ్ చేసి బాక్సులు లేదా సంచులలో నింపి గోదాములలో నిల్వ చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేసి అదనపు ఆదాయం వచ్చేవిధంగా ప్రణాళికను రూపొందించి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి.



వ్యవసాయ ప్రణాళికలో పంట రుణాలు అత్యంత కీలకమైనవి. రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం బ్యాంకుల వాణిజ్య వ్యాపారంలో 40 శాతం వ్యవసాయ రంగానికి రుణాలివ్వాలి. అందులో 18 శాతం పంటరుణాలు ఇవ్వాలి. అందుకు తగిన విధంగా ప్రతి ఏటా మే నెలలో వ్యవసాయ రుణ ప్రణాళికను తయారుచేయాలి. కానీ వ్యవసాయ శాఖ ఆగస్టులో రుణప్రణాళికను విడుదల చేస్తున్నది. వ్యవసాయ బడ్జెట్ తగినంత కేటాయించకపోవడం వల్ల వ్యవసాయాభివృద్ధికి, నూతన టెక్నాలజీని వినియోగించడానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. 2023–24లో రూ. 18,370 కోట్లు కేటాయింపులు చూపారు. కానీ ఇందులో రైతుబంధు రూ. 11,704 కోట్లు, రైతు బీమా రూ. 1,167 కోట్లు, వ్యవసాయ రుణమాఫీ రూ. 4,692 కోట్లు, మొత్తం రూ. 17,565 కోట్లు కేటాయించారు. ఈ పథకాలను మినహాయిస్తే వ్యవసాయానికి కేటాయించింది రూ. 807 కోట్లు మాత్రమే.

వ్యవసాయ ప్రణాళికను శాస్త్రీయంగా రూపొందించడం వలన వ్యవసాయ ఉత్పత్తులు పెరగడానికి రాష్ట్రంలో వాతావరణ అనుకూలత ఉంది. సమశీతోష్ణ వాతావరణం వలన రాష్ట్రంలో విత్తనోత్పత్తితో పాటు వాణిజ్య పంటలకు, హార్టికల్చర్ పంటలకు అవకాశాలున్నాయి. వాతావరణాన్ని బట్టి పంటలు పండించేందుకు తగిన శిక్షణనివ్వాలి. ప్రభుత్వ రంగంలోని పరిశోధనా కేంద్రాలకు శాస్త్రవేత్తలను, నిధులను కేటాయించి అధికోత్పత్తికి దోహదం చేయాలి.

వ్యాసకర్త రైతుసంఘం తెలంగాణ ఉపాధ్యక్షులు

పేరు మార్చాలి కానీ...

గద్దర్ జయంతి సమావేశాలలో ముఖ్యమంత్రి తనకు గద్దర్‌తో ఉన్న ఎమోషనల్ బాండింగ్ వల్ల లేదా గద్దర్ స్ఫూర్తికి నిదర్శనంగా, గద్దర్‌ను గౌరవించే క్రమంలో 'నంది' అవార్డులకు 'గద్దర్' అవార్డులుగా నామకరణం చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని పునస్సమీక్షించాలి.

గద్దర్ అద్భుతమైన పాటగాడు. సరళమైన పదాలతో, జానపద బాణీలతో, జనం కోసం, జనాల్లోకి చొచ్చుకుపోయిన భావ తరంగం. కాబట్టి జన చైతన్యానికి ప్రేరేపించే పాటల రచయితకు, గాయకుడికి గద్దర్ అవార్డు ప్రకటిస్తే, గద్దర్ ఖ్యాతికి, ఆ అవార్డు తీసుకున్న వారికి, ఆ అవార్డు ఇచ్చిన ప్రభుత్వానికి సముచితంగా ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే నేషనల్ అవార్డుల్లాగా తెలంగాణ రాష్ట్ర అవార్డు ప్రకటిస్తే బాగుంటుంది. తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచిన గోల్కొండ లేదా కాకతీయ పేరు మీద అవార్డులు ప్రకటిస్తే మన చరిత్రను మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉంటుంది. అందులో ఒక వ్యక్తి పేరుపై ప్రత్యేక అవార్డు ప్రకటించుకోవచ్చు. ఆ వ్యక్తి ఏ శాఖలో దిట్టో, ఏ రంగానికి మార్గదర్శకుడో, ఆ రంగానికీ, ఆ శాఖకూ చెందిన వ్యక్తికి ఆ అవార్డు ఇస్తే సముచితంగా ఉంటుంది. ఉదాహరణకు, నేషనల్ ఫిల్మ్ అవార్డుల్లో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు 'దాదా సాహెబ్ ఫాల్కే' పేరున ఇస్తారు. అలాగే తెలుగు సినిమా రంగంలో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును 'రఘుపతి వెంకయ్య నాయుడు' అవార్డు పేరున ఇస్తున్నారు.

అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాలకు వివిధ పేర్లతో అవార్డులు ప్రకటించుకోవచ్చు. సినిమా రంగానికి చెందిన వారికి గోల్కొండ అవార్డులు లేదా దక్కన్ అవార్డులు... అలాగే నాటక రంగానికి కాకతీయ అవార్డులు లేదా ఎలిగందల అవార్డులు, తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకలైన జింక, పాలపిట్ట, తంగేడు, చార్మినార్, ఓరుగల్లు ఇలా వివిధ రంగాలకు వివిధ పేర్లు పెట్టుకొని అవార్డులు ప్రకటించుకోవడం సబబుగా ఉంటుంది.

– సయ్యద్ రఫీ, చిత్ర దర్శకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.అష్టమి ప.12.25 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ రా.3.07 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.7.51 నుండి 9.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.33 నుండి 8.05 వరకు, **అమృతఘడియలు:** సా.5.44 నుండి 6.34 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.52.

క్లుప్తంగా...

చిరుతను బంధించండి

చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎం.సి.పర్గెయిన్

సాక్షి, హైదరాబాద్: నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్న చిరుతను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎం.సి.పర్గెయిన్ ఆదేశించారు. ఈ జిల్లాల పరిధిలో గత కొంత కాలంగా తిరుగుతున్న చిరుత పలుమార్లు రైతుల కంట పడటంతో పాటు పెంపుడు జంతువులపై దాడులకు పాల్పడుతోంది. దీంతో పొలాల్లోకి వెళ్లేందుకు భయపడుతున్న రైతులు శుక్రవారం అటవీ అధికారులను కలిసి సమస్యను వెల్లడించగా చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వెంటనే స్థానిక అటవీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చిరుతను బంధించి అమ్రాబాద్ అడవుల్లో విడిచిపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కోటి విలువైన గంజాయి స్వాధీనం?

కొత్తగూడెం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రమైన కొత్తగూడెం పాతబస్ డిపో సెంటర్‌లో దాదాపు రూ.కోటి విలువైన గంజాయిని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో గంజాయి పట్టుబడిందని సమాచారం. ఒడిశా నుంచి గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే, ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. కాగా, గురువారం కూడా కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను విచారిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శుక్రవారం కూడా రూ.కోటి విలువైన గంజాయి పట్టుబడటం విశేషం.

పెన్షనర్లకు ఆరోగ్యపథకం అమలు చేయాలి

సాక్షి, హైదరాబాద్: పెన్షనర్లు ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన సమస్య ఉద్యోగ పెన్షనర్ల ఆరోగ్య పథకం వర్తింపచేయకపోవడమని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఆర్‌జీఓఏ) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.మోహన్‌నారాయణ, ఎస్.నర్సరాజు అన్నారు. శుక్రవారం టీఆర్‌జీవోఏ కార్యాలయంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పెన్షనర్లకు ఆరోగ్య పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్సీ–23ని త్వరగా అమలు చేయాలని విన్నవించారు.


ఘనంగా మండలి చైర్మన్ గుత్తా జన్మదిన వేడుకలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మంత్రి శ్రీధర్‌బాబు, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి ఫోన్ ద్వారా ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. అలాగే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, లేజిస్లేచర్ సెక్రెటరీ నరసింహాచార్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నదీజలాలపై హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



సాక్షి, హైదరాబాద్: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ)లో రాష్ట్ర ప్రాజెక్టులను చేర్చారని, నదీ జలాలపై హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుభవరాహిత్యంతో తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తున్నాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రికి ప్రాజెక్టుల మీద అవగాహన ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్న తొమ్మిదిన్నరేళ్లలో కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా కేఆర్‌ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులను చేర్చలేదని గుర్తుచేశారు. కేఆర్‌ఎంబీపై పోరాటం చేస్తామని, కేంద్రం దృష్టికి తమ ఎంపీలు తీసుకెళ్లారని వివరించారు. కాంగ్రెస్ వచ్చిన 50 రోజుల్లో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయని, ప్రభుత్వం వెంటనే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని వివేకానంద డిమాండ్ చేశారు.

చేనేత, జౌళిశాఖ అభివృద్ధికి మరింత కృషి చేయాలి

చేనేత ఫోరం అధ్యక్షుడు కేటీ చారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేనేత, జౌళిశాఖ అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని చేనేత, జౌళిశాఖ ఫోరం అధ్యక్షుడు కేటీ చారి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ శాఖలో ఉన్న ఉద్యోగుల సమస్యలు, ఇతర అంశాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజిత్, రాష్ట్ర సాధారణ కార్యదర్శి గోవిందయ్య, మహిళా అధ్యక్షురాలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నీటి వాటా.. ఆపరేషనల్ ప్రొటోకాల్ తేల్చాలి

- అలా అయితేనే ప్రాజెక్టులు అప్పగిస్తామన్న తెలంగాణ
- కేఆర్‌ఎంబీ వెల్లడి..
- సమావేశ మినట్స్ విడుదల చేసిన కృష్ణా బోర్డు
- ప్రాజెక్టులు అప్పగిస్తామంటూ మినట్స్‌లో తప్పుగా రికార్డు అయ్యింది : రాహుల్ బొజ్జా



సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల వాటా తేలేదాకా...50:50 నిష్పత్తితో నీటిని పంచాలని, నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల ఆపరేషనల్ ప్రొటోకాల్ ఖరారు అయితేనే ప్రాజెక్టులు అప్పగిస్తామని తెలంగాణ స్పష్టం చేసినట్టు కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) వెల్లడించింది. ఈనెల 1వ తేదీన ప్రాజెక్టుల అప్పగింతపై కృష్ణా బోర్డు చైర్మన్ శివనందన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సంబంధించిన మినట్స్‌ను బోర్డు శుక్రవారం విడుదల చేసింది.

మినట్స్‌లో ఏముందంటే...

- రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిస్తేనే జలవిద్యుత్ కేంద్రాలు అప్పగించగలమని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ తెలిపినట్టు బోర్డు పేర్కొంది.
- జనవరి 27న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా రాసిన ఓ లేఖను ఈఎన్‌సీ మురళీధర్ బోర్డు చైర్మన్ అందజేశారు. ఆ లేఖను మినట్స్‌లో బోర్డు జతచేసింది.
- నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులతోపాటు వాటి పరిధిలోని 15 కాంపోనెంట్లు అప్పగించాలని కృష్ణా నదీ యాజమాన్యబోర్డు(కేఆర్‌ఎంబీ) కోరింది. వీటి నిర్వహణకు భారీగా నిధులు అవసరం. ఆ నిధులను నిరంతరం రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయాలి. నాగార్జునసాగర్ డ్యామ్‌పై మోహరించిన సీఆర్ పీఎఫ్ బలగాలు ఇరు రాష్ట్రాల అధికారులను ప్రాజెక్టుపై అనుమతిస్తాయి. ప్రాజెక్టుపై ఏ పనులు చేయాలన్నా... ఉద్యోగులను నియమించుకోవాలన్నా బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ● త్రీమెంబర్ కమిటీ(కృష్ణాబోర్డు సభ్యకార్యదర్శి, తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు సభ్యులుగా ఉండే) తీసుకునే నిర్ణయాలు/ వాటర్ రిలీజ్ ఆర్డర్ కచ్చితంగా ఆయా కాంపోనెంట్లను అమలు చేయాలి. కమిటీ నిర్ణయాలు అమలు చేయాలి.
- ఒకవేళ ప్రాజెక్టులను తెలుగు రాష్ట్రాలు బోర్డుకు అప్పగిస్తే... ఆ ప్రాజెక్టులపై ఆయా రాష్ట్రాల నుంచి సమాన స్థాయిలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారు. వేతనాలతో పాటు ఇతర ప్రయోజనాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుంది. ఏ మేరకు ఉద్యోగులు కావాలో, ఆ వివరాలన్నీ వారం రోజుల్లోపు బోర్డుకు అందించాలి. ప్రాజెక్టులన్నీ బోర్డు నియంత్రణలో ఉంటాయి. అయితే నిరంతర, అత్యవసర నిర్వహణ పనులను సంబంధిత రాష్ట్రాలు, ఇదివరకు ఉన్న పద్ధతిని (శ్రీశైలం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్, నాగార్జునసాగర్‌ను తెలంగాణ) పాటించాల్సి ఉంటుంది. సాగర్, శ్రీశైలం పరిధిలో ఉన్న కాంపోనెంట్లను కృష్ణా బోర్డుకు అప్పగించడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని ఏపీ ఈఎన్‌సీ తెలిపారు. అయితే తెలంగాణ ప్రాజెక్టులతో పాటే మా ప్రాజెక్టులు తీసుకోవాలన్నారు.

రాహుల్‌బొజ్జా లేఖలోని ముఖ్యాంశాలు

జనవరి 17వ తేదీన ప్రాజెక్టుల అప్పగింతపై కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశం తాలూకు మినట్స్‌కు సవరణలు చేయాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి లేఖ రాశారు. అందులో ఏముందంటే....'నీటి వాటాలు తేలేదాకా ప్రాజెక్టులను అప్పగించలేం. ట్రిబ్యునల్ కృష్ణా జలాలను పంచేదాకా 50:50 నిష్పత్తితో నీటిని పంచాలి. శ్రీశైలం జలాశయం కట్టిందే జలవిద్యుత్ ఉత్పాదన కోసం...నాగార్జునసాగర్ కింద ఉన్న నీటి అవసరాలు తీర్చడానికి వీలుగా దీనిని కట్టారు. శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం 830 అడుగులుగా ఉండాలి. ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రొటోకాల్ తేలేదాకా వాటిని అప్పగించలేం. ఇక జలవిద్యుత్ కేంద్రాలతో పాటు ప్రాజెక్టులను అప్పగించాలంటే తెలంగాణ ప్రభుత్వమే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రాజెక్టులు బోర్డుకు ఇవ్వలేం.

ప్రాజెక్టులను అప్పగిస్తామని చెప్పకపోయినా, మినట్స్‌లో రికార్డు అయ్యింది: రాహుల్ బొజ్జా



''జనవరి 17వ తేదీన కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కృష్ణా ప్రాజెక్టులను అప్పగిస్తామని చెప్పినట్టు మినట్స్‌లో రికార్డు అయ్యింది. అయితే తాము చెప్పిన అంశాలేవీ ఇందులో నమోదు కాలేదు. ఆ మినట్స్‌లో సవరణలు చేయాలని కోరుతూ జనవరి 27వ తేదీన కేంద్రానికి లేఖ రాశాం'అని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా చెప్పారు. శుక్రవారం ఆయన ఈఎన్‌సీ మురళీధర్‌తో కలిసి శుక్రవారం జలసౌధలో విలేకరులతో మాట్లాడారు. బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత నిర్ణయం గతంలోనే తీసుకున్నారని తెలిపారు. 2023–24 బడ్జెట్‌లో ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించనున్నామని, ఇందు కోసం సీడ్ మనీ కింద రూ.200 కోట్లు ఇవ్వనున్నామని ప్రతిపాదించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు చూపించారు.

ప్రాజెక్టులపై కృష్ణా బోర్డుది ప్రేక్షకపాత్ర: ఈఎన్‌సీ సి.మురళీధర్



సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులపై కృష్ణాబోర్డుది ప్రేక్షకపాత్ర మాత్రమేనని ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలంటే నీటిని ఏ ప్రాతిపదికన పంచుకోవాలి అనే అంశాలతో ముడిపడిన ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై తెలుగు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సి ఉందని గుర్తు చేశారు. త్రీమెంబర్ కమిటీ (కృష్ణాబోర్డు మెంబర్ సెక్రటరీ/ కన్వీనర్, తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు) నిర్ణయం ఆధారంగానే నీటి విడుదల, పంపిణీ, పర్యవేక్షణ ఉంటుందన్నారు. జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఆయా రాష్ట్రాల భూభాగంలో ఉన్నాయన్నారు. సాగర్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలను వెనక్కి తీసుకోవాలని, గత నవంబర్ 28వ తేదీకి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని కేంద్ర జలశక్తి శాఖను కూడా కోరామని, కేంద్రం ఆదేశించినా పోలీసు బలగాలను వెనక్కితీసుకోవడం లేదన్నారు.



దొడ్లగడ్డతండాలోని ఫాంహౌస్ గేటు ముందు నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

మరో వివాదంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

- 'దళితబంధు'పేరిట డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు
- తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ బాధితుల ఆందోళన
- ముత్తిరెడ్డి ఫాంహౌస్ ముట్టడికి యత్నం

నర్మెట/జనగామ: జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మరో వివాదంలో చిక్కుకున్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 'దళితబంధు' మంజూరు చేయిస్తానని 62 మంది నుంచి రూ.లక్ష చొప్పున తీసుకున్నారని ఆరోపిస్తూ పలువురు బాధితులు ఆందోళనకు దిగారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలానికి చెందిన బాధితులు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జనగామ జిల్లా నర్మెట మండలం దొడ్లగడ్డతండాలోని ఆయన ఫాంహౌస్ ముట్టడికి యత్నించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చూస్తామని ఆయన చెప్పడంతో వారు శాంతించారు. అనంతరం ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'దళితబంధు'మంజూరు కోసం రెండేళ్ల క్రితం ముత్తిరెడ్డికి డబ్బులు ఇచ్చామని, ప్రస్తుతం ప్రభుత్వం మారిందని, ఆ పథకం వస్తుందో, రాదో తెలియదని అన్నారు. నిరుపేదలైన దళితుల నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు అడిగినా ఫలితం లేదన్నారు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తే చాలని, లేదంటే ఆయనను వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దూరు పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇ.రాజిరెడ్డి, ఎంపీటీసీలు గుజ్జుల సమ్మయ్య, ఆనందం, నర్సింహులు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దూరు ఎంపీపీపై విచారణ చేపట్టాలి: ముత్తిరెడ్డి

'దళితబంధు'మంజూరుకు లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేసిన మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ పథకం మంజూరు కాకపోవటంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేస్తుండటంతో వారిని తప్పుదోవ పట్టించేందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడని కృష్ణారెడ్డిపై గతంలో మద్దూరు పీఎస్‌లో అనేక కేసులు నమోదయ్యాయని తెలిపారు. దళితబంధు పేరిట ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన కృష్ణారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావును కోరినట్లు చెప్పారు.

కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులు అప్పగిస్తే రాష్ట్రానికి నష్టం

కేంద్ర మంత్రి ముందు బీఆర్‌ఎస్ ఎంపీల అభ్యంతరం




కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు అప్పగించడం వల్ల తెలంగాణకు తీరని నష్టం వాటిల్లుతుందని బీఆర్‌ఎస్ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం పార్లమెంటులో కేంద్ర జలవ వనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను బీఆర్‌ఎస్ ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు, రంజిత్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత కలిశారు. కేఆర్‌ఎంబీ తీసుకునే నిర్ణయాల వల్ల కలిగే నష్టాలను షెకావత్‌కు వివరించారు. ప్రాజెక్టుల అప్పగింత విషయంలో అభ్యంతరాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ పూర్తయ్యేవరకు ఇరు రాష్ట్రాలకు 50:50 పద్ధతిలో నీటి కేటాయింపులు ఉండేలా చూడాలని కోరారు. అయితే కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతకు తెలంగాణ ప్రభుత్వమే ఒప్పుకుందని కేంద్రమంత్రి ఎంపీలకు వివరించారు. అనంతరం నామా నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. కేఆర్‌ఎంబీ తీసుకునే నిర్ణయాల వల్ల రాష్ట్రానికి వాటిల్లే నష్టాలను కేంద్ర మంత్రికి వివరించామన్నారు. అయితే ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పుకున్న తర్వాత ఇదేమిటి? అని కేంద్ర మంత్రి తమను ప్రశ్నించారన్నారు. ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని, భవిష్యత్తులో దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని నామా వెల్లడించారు.

రామగుండంలో కొత్త విద్యుత్ ప్లాంట్!

- అందుబాటులోని ప్రభుత్వ స్థలాల వివరాలు కోరిన సర్కారు... 'బీ–థర్మల్ కేంద్రం' జీవితకాలం ముగియడంతో నిర్ణయం
- 800 మెగావాట్లతో కొత్త యూనిట్ స్థాపనకు ప్రతిపాదనలు!... జెన్‌కోకు కొత్త డైరెక్టర్ల నియామకం అయ్యాక స్పష్టత



బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండంలో 800 మెగావాట్ల సామర్థ్యంతో కొత్త విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే అందుబాటులో ఉన్న సర్కారీ భూములు, ఇతర వనరుల వివరాల సేకరణ మొదలుపెట్టింది. సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

ఒక యూనిట్ గడువు ముగియడంతో..

రామగుండంలో ప్రస్తుతమున్న 62.5 మెగావాట్ల బీ–థర్మల్ కేంద్రం జీవితకాలం ముగిసిన నేపథ్యంలో కొత్త ప్లాంట్ ఏర్పాటుకు సర్కారు నిర్ణయం తీసుకుంది. ఇదే స్థలంలో స్థానిక వనరుల వినియోగంతో 800 మెగావాట్ల సామర్థ్యమున్న కొత్త ప్లాంట్ నిర్మించేందుకు వీలుగా భూములు, అందుబాటులో ఉన్న ఇతర వనరుల వివరాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. వెంటనే కసరత్తు ప్రారంభించిన అధికారులు.. నాలుగు చోట్ల భూముల వివరాలు సేకరించి సర్కారుకు అందించారు. ఇక్కడి మల్యాలపల్లి శివారులో 169.25 ఎకరాలు (బీపీఎల్ అధీనంలో ఉన్నాయి), రామగుండం శివారులో 14.01 ఎకరాలు (ఇందులో 7.31 ఎకరాలు బీపీఎల్ అధీనంలో ఉన్నాయి), మల్యాలపల్లి మరోవైపు శివారులో 87.08 ఎకరాలు (26 ఎకరాలు బీపీఎల్ అధీనంలో ఉన్నాయి), రామగుండం మరోవైపు శివారులో 174.27 ఎకరాలు (59.21 ఎకరాలు బీపీఎల్ అధీనంలో ఉన్నాయి) ఉన్నట్టు తెలిపారు.

కొత్త డైరెక్టర్లు వచ్చాక..

మార్చి నెలాఖరు నాటికి బీ–థర్మల్ కేంద్రం విద్యుత్ పీపీఏ గడువు ముగియనుంది. అప్పటికల్లా ప్లాంట్ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక జెన్‌కో డైరెక్టర్లను తొలగించింది. కొత్త డైరెక్టర్ల నియామకం చేపట్టింది. కొత్త డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించి బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలి. వివిధ విద్యుత్ కేంద్రాలతో చేసుకున్న పీపీఏలను పరిశీలించి తుది నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

59 ఏళ్లుగా సేవలందిస్తూ..: రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్‌టీపీపీ)కు 1965 జూలై 19న అప్పటి సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.14.8 కోట్లతో దానిని నిర్మించారు. దశలవారీగా ఆధునిక విద్యుత్ కేంద్రంగా మారుస్తూ.. జవహర్‌లాల్ నెహ్రూ థర్మల్ విద్యుత్ కేంద్రంగా పేరుపెట్టారు. అయితే 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమం నేపథ్యంలో.. విజయవాడలో కొత్త విద్యుత్ కేంద్రాన్ని నిర్మించారు. ఫలితంగా రామగుండంలోని బీ–థర్మల్ కేంద్రం విస్తరణ నిలిచిపోయింది. ఈ బీ–థర్మల్ కేంద్రం నుంచి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) విద్యుత్ కొనుగోలు చేసే పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ) మార్చి చివరికి ముగియనుంది. ప్లాంట్ జీవితకాలం ముగిసిపోతున్న నేపథ్యంలో.. ఆధునిక టెక్నాలజీతో కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి.

ప్రాజెక్టు విషయంలో ఎలాంటి ఆదేశాలు రాలేదు



మార్చి చివరి నాటికి పీపీఏ గడువు ముగుస్తుంది. ప్రాజెక్టు భవిష్యత్‌పై నిర్ణయం గురించి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. పీపీఏ, ఇతర అంశాలపై డైరెక్టర్ల స్థాయిలో చర్చలు జరుగుతాయి. ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది. కొత్త ప్లాంట్‌కు అవసరమైన భూముల సేకరణపై మాకు సమాచారమేదీ లేదు.

– పి.విజేందర్, ఎస్ఈ, బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం, రామగుండం

భూముల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం



వారం రోజుల క్రితం ప్రభుత్వం విద్యుత్ కేంద్రంతోపాటు దాని చుట్టుపక్కల ఉన్న భూముల వివరాలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మూడు రోజుల క్రితమే పూర్తి వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపించాం. అందులో ప్రభుత్వ భూమి, బీపీఎల్, పరంపోగు, ఇతర భూములు కూడా ఉన్నాయి.

– గెరివెన కుమారస్వామి, తహసీల్దార్, రామగుండం

గవర్నర్‌తో పొంగులేటి దంపతుల భేటీ



గవర్నర్‌కు శుభలేఖ అందజేస్తున్న పొంగులేటి దంపతులు

ఖమ్మం మయూరిసెంటర్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను హైదరాబాద్‌లో శుక్రవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి సోదరుడి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహానికి హాజరుకావాలని వారు గవర్నర్‌కు శుభలేఖ అందజేసి ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

- అదుపు తప్పిన బైక్..ఎగిరి పడిన విద్యార్థులు
- డివైడర్‌కు ఢీకొని తీవ్రగాయాలు..చికిత్స పొందుతూ మృతి
- హనుమకొండలోని కాకతీయ వర్సిటీ పరిధిలో ఘటన



విశ్వతేజ (ఫైల్)



సూర్యతేజ (ఫైల్)

హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పంప్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని హనుమాన్‌నగర్ డబ్బాల ప్రాంతానికి చెందిన బొజ్జ విశ్వతేజ(21), తిప్పని సూర్యతేజ (21) స్నేహితులు. విశ్వతేజ నగరంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో, సూర్యతేజ హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ అభ్యసిస్తున్నారు. గురువారం రాత్రి విశ్వతేజ, సూర్యతేజలు మరో స్నేహితుడితో కలిసి ఒకే బైక్‌పై హసన్‌పర్తి సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమ ఏర్పాట్లకు వెళ్లారు. ఏర్పాట్లు ముగిసిన తర్వాత ముగ్గురు కలిసి బైక్‌పై ఇంటికి బయల్దేరారు. సరిగ్గా కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ పెట్రోల్‌బంక్ వద్దకు చేరుకునే సరికి వారి బైక్ అదుపు తప్పింది. దీంతో వెనుక కూర్చున్న విశ్వతేజ, సూర్యతేజ ఎగిరి డివైడర్‌పై పడ్డారు. ఇద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక మరో బైక్‌పై వస్తున్న మిత్రులు గమనించి ఇద్దరిని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ విశ్వతేజ మృతి చెందాడు. సూర్యతేజను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా...చికిత్స పొందుతూ చనిపోయాడు. విశ్వతేజ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



రాజకీయాల్లోకి 'దళపతి' విజయ్

తమిళగ వెట్రి కళగం పేరిట పార్టీ ప్రకటన

సాక్షి, చెన్నై: తమిళ రాజకీయ ముఖచిత్రంపై మరో అగ్రతార మెరిసింది. క్రియాశీలక రాజకీయాల్లో అడుగుపెడుతున్నట్లు తమిళ అభిమానుల 'దళపతి', ప్రముఖ నటుడు విజయ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రకటన విడుదలచేశారు. ''తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నాం. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘం వద్ద దరఖాస్తు చేశాం. 2026లో తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయకేతనం ఎగరేయడమే మా లక్ష్యం. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరికీ మద్దతివ్వబోం. అవినీతి, అధ్వాన్న పరిపాలన, విభజన రాజకీయాలతో పాలిటిక్స్‌ను భ్రష్టుపట్టించారు. నిస్వార్థంగా, పారదర్శకంగా, మార్గదర్శకంగా, అద్భుతమైన పరిపాలనకు బాటలు పరిచే రాజకీయ ఉద్యమం కోసం తమిళ ప్రజలు ఎదురుచూస్తున్నారు. కుల, మత విభేదాలకు అతీతంగా పాలించే అవినీతిరహిత ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు '' అని విజయ్ వ్యాఖ్యానించారు. పార్టీ అధ్యక్షుడు విజయ్, సీనియర్ నేతలు గత నెల 25వ తేదీన పార్టీ సర్వసభ్య మండలి, కార్యనిర్వాహణ మండలి సమావేశంలో పాల్గొని పార్టీ నియమావళి, నిబంధనలకు ఆమోద ముద్ర వేశారని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నాళ్లనుంచో సేవ చేద్దామనుకుంటున్నా

''రాజకీయాల్లో మార్పులు తేగల సత్తా ప్రజా ఉద్యమానికే ఉంది. అది మాత్రమే తమిళనాడు పౌరుల హక్కులను కాపాడగలదు. కన్న తల్లిదండ్రులతో పాటు నాకు పేరు ప్రతిష్టలు తెచ్చిన రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలని ఎన్నాళ్ల నుంచో అనుకుంటున్నా. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, విజయం సాధించి ప్రజలు కలలుగన్న రాజకీయ మార్పుకు బాటలు వేయడమే మా లక్ష్యం. ఈసీ నుంచి అనుమతులు వచ్చాక పార్టీ కార్యక్రమాలు మొదలుపెడతాం. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాక పార్టీ కార్యకర్తలను సంఘటితం చేసి పార్టీ విధానాలు, పార్టీ జెండా, పార్టీ గుర్తు, ఇతర కార్యాచరణకు తుదిరూపునిస్తాం'' అని విజయ్ స్పష్టంచేశారు. '' రాజకీయాలంటే సినిమా ప్రపంచం నుంచి నాకు ఒక విరామం కాదు. తపనతో రాజకీయాల్లోకి వస్తున్నా. రాజనీతి అంటే ప్రజలకు గొప్పగా సేవ చేయడం. ఇప్పటికే ఒప్పుకున్న సినిమాలు పూర్తిచేసి రాజకీయాలకు అంకితమవుతా'' అని అన్నారు.

సైన్యం పడగ నీడన... పాక్‌లో ఎన్నికలకు వేళాయె


సైన్యం దన్ను నవాజ్ షరీఫ్‌కే • నాలుగోసారి గద్దెనెక్కడం ఖాయమే! • జైల్లో ఇమ్రాన్, డీలాపడ్డ పీటీఐ • ప్రభావం చూపేలా లేని పీపీపీ

అది 2018. పాకిస్తాన్లో సాధారణ ఎన్నికల సమయం. సైన్యం ఆగ్రహానికి గురై అవినీతి కేసుల్లో దోషిగా తేలడంతో నవాజ్ షరీఫ్ అప్పటికి ఏడాది క్రితమే ప్రధాని పదవి పోగొట్టుకున్నారు. జైల్లో మగ్గుతున్నందున ఎన్నికల్లో పోటీకీ దూరమయ్యారు. క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్‌ఖాన్ సైన్యం ఆశీస్సులతో ఎన్నికల్లో నెగ్గి ఏకంగా ప్రధాని పీఠమెక్కారు. ఆరేళ్లు గడిచి పాక్ మళ్లీ సాధారణ ఎన్నికల ముంగిట నిలిచేనాటికి ఈ ఇద్దరు మాజీ ప్రధానుల విషయంలో ఓడలు బళ్లు, బళ్లు ఓడలూ అయ్యాయి. సైన్యం కన్నెర్రతో ఇమ్రాన్ పదవి పోగొట్టుకోవడమే గాక అవినీతి కేసుల్లో జైలుపాలయ్యారు. శిక్షల మీద శిక్షలు అనుభవిస్తూ ఎన్నికలకు దూరమయ్యారు. పార్టీకి కనీసం ఎన్నికల గుర్తు కూడా దక్కని దుస్థితి నెలకొంది! చికిత్స పేరుతో ఆరేళ్ల కిందట లండన్ చేరి బతుకు జీవుడా అంటూ ప్రవాసంలో కాలం వెళ్లదీసిన నవాజ్ మళ్లీ సైన్యం దన్నుతో దర్జాగా స్వదేశాగమనం చేశారు. సైన్యం స్క్రిప్టులో భాగంగా అవినీతి కేసులన్నీ కొట్టుకుపోయి నాలుగోసారి ప్రధాని అయ్యేందుకు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. ఇలా దశాబ్దాలుగా పాక్‌లో నేతల భాగ్యరేఖలను ఇష్టానికి నిర్దేశిస్తూ వస్తున్న సైన్యం కనుసన్నల్లో ఎప్పట్లాగే మరో ఎన్నికల తంతుకు సర్వం సిద్ధమవుతోంది...

సాక్షి, నేషనల్ డెస్క్

ఏ పౌర ప్రభుత్వమూ పూర్తి పదవీకాలం మనుగడ సాగించని చరిత్ర పాక్ సొంతం. చాలాకాలం పాటు ప్రత్యక్షంగా, మిగతా సమయంలో పరోక్షంగా సైనిక నియంతృత్వపు పడగ నీడలోనే ఆ దేశంలో పాలన సాగుతూ వస్తోంది. అలాంటి దేశంలో సైనిక పాలన ఊసు లేకుండా వరుసగా మూడోసారి సాధారణ ఎన్నికలు జరగబోతుండటం విశేషం! ఇలా జరగడం ఆ దేశ చరిత్రలో ఇదే తొలిసారి. 342 మంది సభ్యుల జాతీయ అసెంబ్లీకి ఫిబ్రవరి 8న పోలింగ్‌కు సర్వం సిద్ధమవుతోంది. ఎప్పటి మాదిరే ఈసారి కూడా ఏయే పార్టీలు పోటీ చేయాలో, వాటి తరఫున ఎక్కణ్నుంచి ఎవరు బరిలో ఉండాలో కూడా సైన్యమే నిర్దేశిస్తూ వస్తోంది. దేశ ఆర్థికంగా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలి, నిత్యావసరాలతో పాటు అన్ని ధరలూ ఆకాశాన్నంటుతూ ప్రజల బతుకే దుర్భరంగా మారిన వేళ జరుగుతున్న ఎన్నికలివి. అక్కడ ఏ ఎన్నికలూ వివాదరహితంగా జరగలేదు. కానీ ఈసారి మాత్రం అవి పరాకాష్టకు చేరాయి. నిజానికి గత నవంబర్‌లోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాల్సింది. జనగణనను కారణంగా చూపి ఫిబ్రవరి దాకా వాయిదా వేశారు. నవాజ్ స్వీయ ప్రవాసం నుంచి తిరిగొచ్చి కాలూ చేయీ కూడదీసుకుని బరిలో దిగేందుకు వీలుగానే ఇలా చేశారన్న ఆరోపణలున్నాయి. ఏదేలా ఉన్నా కనీసం ఈసారన్న కాస్త సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నది సగటు పాక్ పౌరుల ఆశ. అమెరికాతో పాటు అంతర్జాతీయ సంస్థల నుంచి అవసమైన ఆర్థిక సాయం రాబట్టి అవ్యవస్థను చక్కదిద్దడంతో పాటు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న భారత్‌తో సంబంధాలను మెరుగు పరుచుకోవాలన్నది వారి ఆకాంక్ష. కానీ సర్వం సైన్యం కనుసన్నల్లో సాగుతున్న తీరును బట్టి చూస్తే ఈసారీ అది అత్యాశే అయ్యేలా కనిపిస్తోంది.

నవాజ్ షరీఫ్



పాక్ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన రికార్డు 74 ఏళ్ల నవాజ్ సొంతం. భారత్‌తో సత్సంబంధాలకు ప్రాధాన్యమిచ్చే నేతగానూ పేరుంది. దేశంలోకెల్లా అత్యంత ధనవంతుడని కూడా చెబుతారు. పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) సారథిగా మూడోసారి ప్రధానిగా ఉండగా 2017లో పనామా పేపర్స్, లండన్ అపార్ట్‌మెంట్స్ వంటి నానారకాల కేసుల్లో ఇరుక్కున్నారు. పదవి పోగొట్టుకుని జైలుపాలై ప్రాణ భయంతో లండన్ పారిపోయారు. అనంతరం పగ్గాలు చేపట్టిన ఇమ్రాన్‌కూ నాలుగేళ్లలోపే అదే గతి పట్టింది. 2022లో నవాజ్ సోదరుడు షహబాజ్ షరీఫ్ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవడంతో నవాజ్‌కు మంచి రోజులు తిరిగొచ్చాయి. గత అక్టోబర్లో ఆయన తిరిగొచ్చి పీఎంఎల్ (ఎన్) పగ్గాలు చేపట్టడం, సైన్యంతో పాటు న్యాయ వ్యవస్థ దన్నూ తోడై ఆయనపై అవినీతి కేసులు, శిక్షలూ ఒక్కొక్కటిగా రద్దవడం చకచకా జరిగిపోయాయి. అడ్డంకులన్నీ తొలిగి ఎన్నికల బరిలో నిలిచిన నవాజ్ నాలుగోసారి ప్రధాని కావడం ఖాయమేనంటున్నారు.

ఇమ్రాన్‌ఖాన్



అనితరసాధ్యమైన క్రికెట్ నైపుణ్యంతో పాక్ ప్రజలను ఉర్రూతలూగించి నేషనల్ హీరోగా వెలుగు వెలిగిన 71 ఇమ్రాన్ రాజకీయ పిచ్‌పై మాత్రం నిలదొక్కుకోలేక చతికిలపడ్డారు. అవినీతిని రూపుమాపి, కుటుంబ రాజకీయాలకు చెక్ పెట్టి సర్వం చక్కదిద్దుతానంటూ మార్పు నినాదంతో 2018లో ప్రధాని అయ్యారాయన. కానీ ఇమ్రాన్ హయాంలో ఆర్థికంగానే గాక అన్ని రంగాల్లోనూ దేశం కుప్పకూలింది. హింసతో, అశాంతితో పాక్ అట్టుడికిపోయింది. ఆయనకు ఆదరణా అడుగంటింది. నిజానికి సైన్యం చేతిలో పావుగానే ఇమ్రాన్ రాజకీయ ప్రవేశం జరిగిందంటారు. అలాంటి సైన్యానికే ఎదురు తిరగడంతో ఇమ్రాన్ పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. ఎంత ప్రయత్నించినా పదవిని కాపాడుకోలేకపోయారు. పైగా జైలు శిక్ష వల్ల తాను పోటీ చేసే అవకాశం లేదు. ఆయన పార్టీ తరఫున కొందరు ధైర్యం చేసి ఇండిపెండెంట్లుగా బరిలో దిగుతున్నా చాలా మంది జైలుపాలయ్యారు. పలువురు ఫిరాయించగా మిగిలిన వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ సమస్యలు చాలవన్నట్టు పీటీఐ ఎన్నికల గుర్తు బ్యాట్‌పైనా ఎన్నికల సంఘం వేటు వేసింది. దాంతో లక్షలాది మంది నిరక్షరాస్య ఓటర్లు బ్యాలెట్ పత్రాలపై ఇమ్రాన్ పార్టీని గుర్తించను కూడా లేరంటున్నారు.

బిలావల్ భుట్టో



35 ఏళ్ల బిలావల్ భుట్టో జర్దారీ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చైర్మన్. దారుణ హత్యకు గురైన మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో, పాక్ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ కుమారుడు. షహబాజ్ షరీఫ్ సర్కారులో విదేశాంగ మంత్రిగా తన పనితీరుతో స్వదేశంలో విమర్శల పాలు, భారత్‌తో నవ్వుల పాలయ్యారు. గత ఎన్నికల్లో పీపీపీ మూడో స్థానంలో నిలిచింది. ఈసారి అన్నీ కలిసొస్తే బహుశా కింగ్‌మేకర్ అవ్వొచ్చంటున్నారు.

పాక్ జాతీయ అసెంబ్లీలో 342 మంది సభ్యులుంటారు. 266 మందిని నేరుగా ఉన్నుకుంటారు. 70 సీట్లను మహిళలు, మతపరమైన మైనారిటీలకు; ఆరింటిని గిరిజన ప్రాంతాల వారికి రిజర్వు చేశారు. ఈ స్థానాలను పార్టీలకు గెలుచుకున్న స్థానాలను బట్టి నైష్పత్తిక ప్రాతిపదికన కేటాయిస్తారు.

సీఎంగా చంపయ్ ప్రమాణం

రాంచీ: జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) శాసనసభాపక్ష నేత చంపయ్ సోరెన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ఆయనతో సీఎంగా ప్రమాణం చేయించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అలంగీర్ అలాం, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) నేత సత్యానంద్ భోక్తా రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 67 ఏళ్ల గిరిజన నాయకుడు చంపయ్ సోరెన్ జార్ఖండ్‌కు 12వ ముఖ్యమంత్రిగా రికార్డుకెక్కారు. మనీ లాండరింగ్ కేసులో ఈడీ విచారణను ఎదుర్కొంటున్న జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో పార్టీ శాసనసభాపక్ష నేతగా చంపయ్ సోరెన్‌ను ఎన్నుకున్న సంగతి తెలిసిందే. సీఎంగా ప్రమాణం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హేమంత్ సోరెన్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని చెప్పారు.

హైదరాబాద్ చేరుకున్న జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలు

జార్ఖండ్ సీఎంగా చంపయ్ సోరెన్ ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పాలిత తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తరలించారు. తమ ఎమ్మెల్యేలపై విపక్ష బీజేపీ వల విసిరే అవకాశం ఉండడంతో ముందుజాగ్రత్తగా వారిని బయటకు తరలించినట్లు కూటమి నేతలు చెప్పారు.



ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్‌తో చంపయ్ సోరెన్

సోరెన్ అరెస్టుపై జోక్యం చేసుకోలేం

సుప్రీం స్పష్టీకరణ.. పీఎంఎల్‌ఏ కోర్టులో 5 రోజుల రిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ/రాంచీ: జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అరెస్టుపై జోక్యం చేసుకొనేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేయడం తెలిసిందే. ఇది అక్రమమంటూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఒక సీఎంనేఉ అరెస్టు చేయడం సరైంది కాదని సోరెన్ తరఫున సీనియర్ లాయర్లు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ వాదించారు. ఆధారాలు పరిశీలించాలని, ఇలాంటి కేసుల్లో తగిన సందేశమివ్వాలని కోరారు. హైకోర్టూ రాజ్యాంగబద్ధమైన న్యాయ స్థానమేనని, అరెస్టుపై ఉపశమనం కావాలంటే అక్కడికి వెళ్లొచ్చని ధర్మాసనం పేర్కొంది. మరోవైపు ఈడీ కోరిక మేరకు హేమంత్‌కు పీఎంఎల్‌ఏ కోర్టు 5 రోజుల రిమాండ్‌కు అప్పగించింది. భద్రతా కారణాల రీత్యా రాత్రిళ్లు సోరెన్ జైల్లోనే ఉండేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తిపై కోర్టు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

పార్లమెంట్‌లో మాటల యుద్ధం

జార్ఖండ్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటులో జేఎంఎం కూటమికి ఎదురైన అడ్డంకులు, హేమంత్ అరెస్ట్ వ్యవహారంలో ఈడీ తీరుపై పార్లమెంట్‌లో శుక్రవారం వాడివేడిగా చర్చ జరిగింది. లోక్‌సభలో ఇండియా కూటమి ఎంపీలు వాకౌట్ చేయగా, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వాగ్వాదానికి దిగారు. బిహార్‌లో నితీశ్ కుమార్ ఇలా రాజీనామా చేసి గంటల వ్యవధిలోనే మళ్లీ సీఎంగా ప్రమాణం చేశారని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని లెక్కచేయకపోవడం సిగ్గుచేటన్నారు. జార్ఖండ్‌లో ఉన్నది అవినీతి ప్రభుత్వమంటూ గోయల్ కౌంటర్ ఇచ్చారు.

ఢిల్లీలో ఆప్, బీజేపీ పోటాపోటీ నిరసనలు

న్యూఢిల్లీ: బీజేపీ, ఆప్ చేపట్టిన పోటీపోటీ నిరసనలతో శుక్రవారం సెంట్రల్ ఢిల్లీ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. రెండు పార్టీల శ్రేణులు నేరుగా తలపడే పరిస్థితిని నివారించేందుకు పోలీసులు పలు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. దేశ రాజధాని వ్యాప్తంగా పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించారు. పండిట్ దీన్ దయాళ్ మార్గ్(డీడీయూ)వైపు వచ్చే వాహనాలను దారి మళ్లించారు. భారీ ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ మోసానికి పాల్పడిందని ఆరోపిస్తూ ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) శుక్రవారం బీజేపీ ప్రధాన కార్యాలయం ఎదురుగా నిరసన తెలపాలని నిర్ణయించింది. అదేసమయంలో, ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా ఆప్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టాలని కాషాయ పార్టీ తీర్మానించుకుంది. ఆ మేరకు రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు బయలుదేరగా పోలీసులు వారిని 800 మీటర్ల దూరంలో ఆపేశారు. రోడ్డుపై పలు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి, పెద్ద సంఖ్యలో బలగాలను మోహరించి పరస్పరం తలపడే పరిస్థితిని నివారించారు. రెండు పార్టీల నాయకులు అక్కడే ధర్నా చేపట్టారు.

ఈడీ సమన్లకు అయిదోసారీ డుమ్మా

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ప్రశ్నించేందుకు ఈడీ బుధవారం ఐదోసారి పంపిన సమన్లనూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పట్టించుకోలేదు. శుక్రవారం విచారణకు డుమ్మా కొట్టారు.

ఉత్తరాఖండ్‌లో బహుభార్యత్వం రద్దు!

- సహజీవన డిక్లరేషన్ తప్పనిసరి
- ప్రభుత్వానికి అందిన ఉమ్మడి పౌర స్మృతి ముసాయిదా
- త్వరలో చట్టం తెస్తామన్న సీఎం

డెహ్రాడూన్: బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో బహుభార్యత్వంపై నిషేధంతో పాటు సహజీవనాన్ని ధ్రువీకరిస్తూ డిక్లరేషన్‌నూ తప్పనిసరి చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అమలుకు సంబంధించిన ముసాయిదాను జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ కమిటీ శుక్రవారం సీఎం పుష్కర్ సింగ్ ధామికి సమర్పించింది. అందులో కీలక ప్రతిపాదనలు చేసింది. ''రాష్ట్రంలో జరిగే ప్రతి పెళ్లినీ విధిగా రిజిస్టర్ చేయించాల్సిందే. విడాకులు కోరే హక్కులు భార్యభర్తలకు సమానంగా ఉంటాయి. భార్య జీవించి ఉండగా భర్త మరో పెళ్లి చేసుకోవడం చట్టప్రకారం నేరం. బహు భార్యత్వంపై నిషేధం అమలు చేయాలి. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకూ వారసత్వ హక్కులుంటాయి. సహజీవనం చేస్తుంటే దానిని అధికారికంగా ధ్రువీకరిస్తూ స్త్రీ, పురుషులిద్దరూ డిక్లరేషన్‌ను సమర్పించాలి'' అని పేర్కొంది. ఈ నిబంధనల నుంచి షెడ్యూల్ తెగలకు మినహాయింపు ఇవ్వనున్నారు. యూసీసీ ముసాయిదా రూపకల్పన కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం 202లో ఈ కమిటీని వేసింది. 2022 అసెంబ్లీ ఎన్నికల హామీ అమలు దిశగా ఇదో కీలక అడుగని ధామీ అభివర్ణించారు. ముసాయిదాను క్షుణ్నంగా పరిశీలించాక అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు. ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో యూసీసీ బిల్లును తెచ్చి ఆమోదించి చట్టం చేస్తామన్నారు. యూసీసీ అమలైతే వివాహం, విడాకులు, ఆస్తి, వారసత్వం వంటి అంశాల్లో పౌరులందరికీ మతంతో సంబంధం లేకుండా సమాన చట్టాలు అమలవుతాయి.

మేమూ అదే బాటలో: అసోం సీఎం

బహుభార్యత్వం విధానాన్ని రద్దుచేయనున్నట్లు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా ప్రకటించారు. ''అసోంలో యూసీసీ అమలుపై గతేడాదే మాకు నివేదిక అందింది. దానిని న్యాయశాఖ పరిశీలిస్తోంది. కుదిరితే ఫిబ్రవరి ఐదున మొదలయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లుగా ప్రవేశపెట్టి చట్టంగా తెస్తాం'' అని హిమంత అన్నారు.

సీబీఎస్‌ఈ 9వ తరగతి పుస్తకాల్లో...

డేటింగ్, రిలేషన్‌షిప్ పాఠాలు

న్యూఢిల్లీ: టీనేజీ విద్యార్థులకు ఏదైనా ఒక విషయాన్ని సమాజం.. తప్పుడు కోణంలో చెప్పేలోపే దానిని స్పష్టమైన భావనతో, సహేతుకమైన విధానంలో పాఠంగా చెప్పడం మంచిదని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) సీబీఎస్‌ఈ నిర్ణయించుకుంది. పిల్లలతో తల్లిదండ్రులు చర్చించడానికి విముఖత చూపే డేటింగ్, రిలేషన్‌షిప్ వంటి సున్నితమైన అంశాలపై టీనేజీ విద్యార్థుల్లో సుస్పష్టమైన ఆలోచనను పాదుకొల్పే సదుద్దేశంతో సీబీఎస్‌ఈ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా డేటింగ్, రిలేషన్‌షిప్ వంటి ఛాప్టర్లను తమ 9వ తరగతి 'వాల్యూ ఎడిషన్' పాఠ్యపుస్తకాల్లో చేర్చింది. టీనేజీ విద్యార్థుల్లో హార్మోన్ల ప్రభావంతో తోటి వయసు వారిపై ఇష్టం, కలిసి మెలసి ఉండటం వంటి సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో సవివరంగా చెబుతూ ప్రత్యేకంగా పాఠాలను జతచేశారు. 'డేటింగ్ అండ్ రిలేషన్‌షిప్స్: అండర్‌స్టాండింగ్ యువర్‌సెల్ఫ్ అండ్ ది అదర్ పర్సన్' పేరుతో ఉన్న ఒక పాఠం, కొన్ని పదాలకు అర్థాలు, ఇంకొన్ని భావనలపై మీ అభిప్రాయాలేంటి? అనే ఎక్సర్‌సైజ్ సంబంధ పేజీలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. ఫొటోల వంటి ఇతరుల సమాచారాన్ని దొంగతనంగా సేకరించి వాటితో ఇంకొకరిని ఆకర్షించే 'క్యాట్‌ఫిషింగ్', సంజాయిషీ లేకుండా బంధాన్ని హఠాత్తుగా తెగతెంపులు చేసుకునే 'ఘోస్టింగ్', 'సైబర్ బులీయింగ్' పదాలకు అర్థాలను వివరిస్తూ చాప్టర్లను పొందుపరిచారు. 'క్రష్', 'స్పెషల్' ఫ్రెండ్ భావనలను చిన్న చిన్న కథలతో వివరించారు.

'ప్రత్యేక దేశం' వ్యాఖ్యలపై

పార్లమెంట్‌లో రగడ

కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి: బీజేపీ

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని, వాటన్నింటినీ కలిపి ప్రత్యేక దేశం చేయాలంటూ కర్ణాటక కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభల్లో శుక్రవారం తీవ్ర రగడ చోటుచేసుకుంది. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ తక్షణమే క్షమాపణ చెప్పాలని రాజ్యసభలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ డిమాండ్ చేశారు. దేశాన్ని ముక్కలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. కాంగ్రెస్ ఎంపీ ప్రకటనను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదని, ఇది భారత రాజ్యాంగంపై దాడేనని స్పష్టం చేశారు. రాజ్యాంగానికి విధేయులుగా ఉంటామని ఎన్నికల్లో గెలవగానే ఎంపీలతో ప్రమాణం చేయించాలని అభిప్రాయపడ్డారు. దేశ విభజనను కాంగ్రెస్ కోరుతోందా అని ప్రశ్నించారు. రాజ్యసభ సభ్యుడు కాని వ్యక్తి వ్యాఖ్యలపై సభలో చర్చ ఎందుకని కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. విభజన ఆలోచనను తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని అన్నారు. డీకే అనుచితంగా మాట్లాడినట్లు తేలితే సభా హక్కుల కమిటీ చర్యలు తీసుకోవచ్చన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తనకు చాలా ఆదరణ ఉందంటూ ఎన్నికలను శాశ్వతంగా రద్దు చేయడం ఖాయమంటూ దుయ్యబట్టారు. లోక్‌సభ సభ్యుల వ్యాఖ్యలపై రాజ్యసభలో చర్చించవచ్చని గతంలోనే ఆదేశాలిచ్చానని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గుర్తుచేశారు.

హైవేలపై డ్రైవర్లకు భవనాలు: మోదీ

న్యూఢిల్లీ: ట్రక్కులు, ట్యాక్సీ డ్రైవర్లకు జాతీయ రహదారులపై తగినంత విశ్రాంతి తదితర సౌకర్యాల నిమిత్తం కొత్త పథకం తేనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ''ఇందులో భాగంగా తొలి దశలో అన్ని సదుపాయాలతో కూడిన 1,000 అధునాతన భవనాలు నిర్మిస్తాం. వాటిలో ఫుడ్ స్టాళ్లు, స్వచ్ఛమైన తాగునీరు, టాయ్‌లెట్లు, పార్కింగ్, విశ్రాంతి స్థలాల వంటివన్నీ ఉంటాయి'' అని వెల్లడించారు. శుక్రవారం భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో–2024లో పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా పరుగులు తీస్తోందని మోదీ అన్నారు. తాము వరుసగా మూడోసారి గెలిచి కేంద్రంలో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేశాక ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని పునరుద్ఘాటించారు. ఆటో, ఆటోమోటివ్ పరిశ్రమది ఇందులో కీలక పాత్ర కానుందన్నారు. దేశ మొబైల్ పరిశ్రమకు ఇది స్వర్ణయుగమన్నారు.

ఆరు హైకోర్టులకు సీజేల నియామకం

న్యూఢిల్లీ: ఆరు హైకోర్టులకు నూతన ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇన్నాళ్లూ రాజస్తాన్ హైకోర్టుకు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా ఉన్న మనీంద్ర మోహన్ శ్రీవాస్తవను అదే కోర్టులో చీఫ్ జస్టిస్(సీజే)గా నియమించారు. పంజాబ్, హరియాణా హైకోర్టు యాక్టింగ్ సీజే జస్టిస్ రీతూ బహ్రీని ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా నియమించారు. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్‌ను ఒడిశా హైకోర్టు సీజేగా నియమించారు. రాజస్తాన్ హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ను గౌహతీ హైకోర్టు సీజేగా నియమించారు. రాజస్తాన్ హైకోర్టులో జడ్జి జస్టిస్ అరుణ్ భన్సాలీని అలహాబాద్ హైకోర్టు సీజేగా నియమించారు. మద్రాస్ హైకోర్టులో జడ్జి జస్టిస్ ఎస్. వైద్యనాథన్‌ను మేఘాలయ హైకోర్టుకు సీజేగా నియమించారు.

అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

నెల రోజుల వ్యవధిలో మరణించిన నాలుగో భారత విద్యార్థి

న్యూయార్క్: అమెరికాలో మరో భారతీయ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. నెల రోజుల వ్యవధిలో అమెరికాలో చోటుచేసుకున్న నాలుగో ఘటన ఇది. ఓహియో రాష్ట్రం సిన్సినాటిలో లిండ్నెర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుకుంటున్న శ్రేయస్ రెడ్డి బెనిగెరి అనే తెలుగు విద్యార్థి చనిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారని, అతడి మరణం వెనక ఎటువంటి కుట్ర లేదని భావిస్తున్నట్లు న్యూయార్క్‌లోని భారత దౌత్య కార్యాలయం గురువారం తెలిపింది. శ్రేయస్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నామని, సాధ్యమైనంత మేర వారికి సాయం అందజేస్తామని పేర్కొంది. శ్రేయస్ రెడ్డి తండ్రి త్వరలోనే అమెరికా రానున్నారని తెలిపింది.

భారత్‌లో 9 లక్షల క్యాన్సర్ మరణాలు

2022లో 14 లక్షలకుపైగా కేసులు: డబ్ల్యూహెచ్‌వో

న్యూఢిల్లీ: భారత్‌ను క్యాన్సర్ మహమ్మారి కబళిస్తున్న తీరును ప్రపంచ ఆరోగ్య సంస్థ తన తాజా గణాంకాల్లో వెల్లడించింది. ది ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ గణాంకాల ప్రకారం 2022లో భారత్‌లో 14.1 లక్షల క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. క్యాన్సర్ కారణంగా 9.1 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. పురుషుల్లో పెదవులు, నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు సర్వసాధారణమయ్యాయి. రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లు మహిళల్లో ఎక్కువయ్యాయి. మొత్తం కొత్త కేసుల్లో 27 శాతం బ్రెస్ట్, 18 శాతం సెర్విక్స్ యుటెరీ క్యాన్సర్లు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ సోకి ఐదేళ్లుగా బాధపడుతున్న వారి సంఖ్య 5.3 కోట్లకు చేరిందని నివేదికలో పేర్కొన్నారు.

జార్ఖండ్ సర్కార్‌ను కూల్చే కుట్ర: రాహుల్

పాకూర్(జార్ఖండ్): హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుకు పంపి జార్ఖండ్‌లో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోయాలని బీజేపీ కుట్ర పన్నిందని, ప్రజాతీర్పుకు భంగం కల్గకుండా తాము అడ్డుకున్నామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. శుక్రవారం జార్ఖండ్‌లోకి భారత్ జోడో న్యాయ్ యాత్ర అడుగుపెట్టిన సందర్భంగా పాకూర్ జిల్లాలో కార్యకర్తలనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. '' ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజాతీర్పును బీజేపీ పరిహసించాలని చూసింది. మేం దానిని అడ్డుకున్నాం. ధనం, దర్యాప్తు సంస్థల అండతో బీజేపీ చెలరేగుతోంది'' అని రాహుల్ ఆరోపించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు తాను కట్టుబడిఉంటానన్నారు. '' అస్సాంలో యాత్రకు అడ్డుపడిన సీఎం హిమంత బిశ్వ శర్మ, మహారాష్ట్రలో పార్టీ మారిన మిలింద్ దేవ్‌రా వంటి నేతలతో పార్టీకి పనిలేదు'' అని రాహుల్ అన్నారు.

నకిలీ రాహుల్ ఆచూకీ దొరికింది: హిమంత

మరోవైపు, అస్సాంలో న్యాయ్‌యాత్ర వేళ బస్సులో రాహుల్ స్థానంలో కూర్చుని అభివాదం చేస్తున్న నకిలీ రాహుల్ ఆచూకీ తాము గుర్తించామని హిమంత చెప్పారు. '' అస్సాంలో మోదీ పర్యటన ముగిశాక పత్రికా సమావేశం ఏర్పాటుచేసి మరో రాహుల్ వివరాలు బహిర్గతం చేస్తా. జనానికి చేతులు ఊపుతూ, యాత్ర బస్సులో ఉన్నది రాహుల్ కాదు'' అని హిమంత అన్నారు.

మద్రాస్ ఐఐటీలో స్పోర్ట్స్ కోటా

ప్రతి యూజీ కోర్సులో అదనంగా రెండేసి సీట్లు

న్యూఢిల్లీ: అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు తొలిసారిగా స్పోర్ట్స్ కోటాను ప్రవేశపెట్టిన ఐఐటీగా మద్రాస్ ఐఐటీ నిలిచింది. 2024–25 అకడమిక్ సెషన్ నుంచి ప్రతి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో అదనంగా రెండు సీట్లను ఇందుకోసం సృష్టించాలని నిర్ణయించినట్లు ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి తెలిపారు. స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్(ఎస్‌ఈఏ) ప్రోగ్రాం కింద సృష్టించిన ఈ రెండు సీట్లలో భారతీయ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని చెప్పారు. ఇందులో ఒకటి విద్యార్థినులకు రిజర్వు చేస్తామన్నారు. ఐఐటీల్లో ప్రస్తుతం స్పోర్ట్స్ కోటా లేదు.

కాంగ్రెస్‌కు 40 సీట్లూ కష్టమే: మమత

కోల్‌కతా: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 40 సీట్లు దక్కేది కూడా కష్టమేనని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. 'బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా దేశవ్యాప్తంగా ఉన్న 300 సీట్లలో పోటీ చేయాలని కాంగ్రెస్‌కు చెప్పాను. కానీ వాళ్లు పట్టించుకోలేదు. ముస్లిం ఓటర్లను రెచ్చగొట్టేందుకు మా రాష్ట్రానికి వచ్చారు. వాళ్లు 300 స్థానాల్లో పోటీ చేస్తే 40 సీట్లయినా వచ్చేది డౌటే' అన్నారు. చేతనైతే హిందీ ప్రాబల్య రాష్ట్రాల్లో బీజేపీని ఢీకొట్టాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు.

రేప్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఫ్రెండ్స్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో 18 ఏళ్ల యువతి దారుణ అత్యాచారానికి గురైంది. ఇన్‌స్టాగ్రాంలో స్నేహితులుగా మారిన ఇద్దరు యువకులు ఢిల్లీలో ఆమెపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. ఆహారంలో మత్తుమందు కలిపి ఈ దారుణానికి పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు.

'జ్ఞానవాపి' పిటిషన్‌పై 6న విచారణ

ప్రయాగ్‌రాజ్: జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లో హిందువుల పూజలకు అనుమతిస్తూ వారణాసి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మసీదు కమిటీ వేసిన పిటిషన్‌పై ఈ నెల 6న అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టనుంది. శుక్రవారం వాదనల అనంతరం న్యాయమూర్తి జస్టిస్ అగర్వాల్ ఈ మేరకు వెల్లడించారు.

కెన్యాలో ట్యాంకర్ పేలి ముగ్గురు మృతి

నైరోబీ: కెన్యా రాజధాని నైరోబీలో గురువారం అర్ధ రాత్రి సమయంలో గ్యాస్ ట్యాంకర్ పేలి బీభత్సం సృష్టించింది. ఘటన లో ముగ్గురు చనిపోగా 270 మందికి పైగా గాయాల పాలయ్యారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకా శం ఉందని సమాచారం.

నల్లా పన్ను కోసం సర్వే



కరీంనగర్ కార్పొరేషన్: ఆదాయ మార్గాలు పెంచుకొనే క్రమంలో నగరపాలక సంస్థ పన్నుల వసూళ్లపై దృష్టిసారించింది. నీటి విభాగం సిబ్బంది శుక్రవారం ఇంటింటి సర్వే ప్రారంభించారు. నల్లా పన్ను చెల్లించారా అని ఆరా తీస్తున్నారు.



పత్తి ధర రూ.6,600

జమ్మికుంట: వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.6,600, మోడల్ రూ.6,500, కనిష్టంగా రూ.6,000 పలికింది. మార్కెట్‌కు శని, ఆది వారాల్లో సాధారణ సెలవులని కార్యదర్శి రెడ్డినాయక్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/20.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బీజేపీ నేత ఇంటికి త్రిపుర గవర్నర్



కరీంనగర్‌టౌన్: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి శుక్రవారం జగిత్యాలలో ఓ కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యలో కరీంనగర్ చైతన్యపురిలోని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత గుజ్జుల రామకృష్ణారెడ్డికి ఇంటికి వచ్చారు. వీరిద్దరూ బంధువులు. ఈ సందర్భంగా ఆయనను రామకృష్ణారెడ్డి సన్మానించారు. విశ్వహిందూ పరిషత్ గోరక్షక్ ప్రముఖ్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, నగర కార్యదర్శి మనోజ్ లాహోటి శాలువాతో సత్కరించారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి




చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిది, పదకొండవ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 10న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. పరిమిత సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానించగా, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 1,745 మంది, పదకొండవ తరగతిలో ప్రవేశానికి 1,144 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవోదయ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇబ్బందులు తలెత్తితే 94903 95216 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలు




కరీంనగర్ అర్బన్: గ్రామీణ నిరుద్యోగ యువతకు అపోలో ఫార్మసీ రిటైల్ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలున్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5న స్వశక్తి కళాశాలలో గల ఈజీఎంఎం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఫార్మసిస్టు, ఫార్మసీ అసిస్టెంట్, ట్రైనీ ఫార్మసిస్టు, ప్రొడక్ట్ అడ్వైజర్, వేర్ హౌస్ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ విభాగాల్లో మొత్తం 125 ఉద్యోగాలున్నాయని పేర్కొన్నారు. ఎంపికైనవారికి రూ.10,600 నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. పదోతరగతి నుంచి బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ వరకు విద్యార్హత గలవారు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

5న టామ్‌కామ్ జాబ్ మేళా



కరీంనగర్: ఈ నెల 5న టామ్‌కామ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా లేదా డిగ్రీ కలిగి ఉండాలని, హోటల్ పరిశ్రమలో ఎఫ్‌అండ్‌బీ, కిచెన్‌లో అనుభవం ఉండాలన్నారు. 22 నుంచి 27 ఏళ్ల వయసున్న వారు ఉదయం 10 గంటలకు కరీంనగర్‌లోని ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌కు రావాలని పేర్కొన్నారు. ఎంపికైనవారికి జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, జపాన్‌లో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తిపర నైపుణ్యాలపై శిక్షణనిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు టామ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్‌ను 81252 51408 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్ గడువు పెంపు



కరీంనగర్: 2023–24 విద్యాసంవత్సరానికి గాను పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ, మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మార్చి 31వరకు గడువు పెంచినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీడీ నేతానియల్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



మెడికల్ హబ్‌కు సహకరించాలి

కరీంనగర్‌టౌన్: రాష్ట్రాన్ని మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు వైద్యులు సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కోరారు. శుక్రవారం కరీంనగర్‌లోని వి-కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన 9వ రాష్ట్ర ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సుకు హాజరై, మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. మాజీ సీఎం దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి పేదల కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. దీని కింద అందించే వైద్యసాయాన్ని రూ.10 లక్షలకు పెంచామన్నారు. గత ప్రభుత్వం ఆస్పత్రులకు దాదాపు రూ.50 వేల కోట్ల అప్పులు పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. 50 కిలోమీటర్లకో ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, కరీంనగర్ అధ్యక్షుడు మోతీలాల్, ప్రధాన కార్యదర్శి స్వామి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, సంఘం రాష్ట్ర బాధ్యులు తిమ్మారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన వద్దు.. అండగా ఉంటాం

- మాజీ మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో పోలీసులు వరుసగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను అరెస్టు చేస్తున్న విషయంపై త్వరలోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా కరీంనగర్ వచ్చినిరసన తెలుపుతామని కేటీఆర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, పలువురు కార్పొరేటర్లు హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. కొన్నిరోజులుగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు లక్ష్యంగా పోలీసులు అక్రమ కేసులతో వేధిస్తున్నారని, 15 ఏళ్ల క్రితం కేసులను చూపి ఇబ్బందులు పెడుతున్నారని కేటీఆర్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన కేటీఆర్ అధికారులు అక్రమ కేసులు పెడితే సహించేది లేదని, అవసరమైతే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా కరీంనగర్ వచ్చి, పోలీసు కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్పొరేటర్లు ఎవరూ ఆందోళన చెందవద్దని పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. అనంతరం కరీంనగర్ బీఆర్‌ఎస్ నాయకులంతా మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను కూడా కలిసి పరిస్థితిని వివరించారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: జిల్లాలో వాణిజ్య, గృహ, నీటి పన్నులను వందశాతం వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పన్నుల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చెల్లించకుండా నిర్లక్ష్యం చేసేవారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ నెలాఖరుకు 80 శాతం, మార్చి చివరి నాటికి వందశాతం వసూలవ్వాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 30 ఏళ్లు గడిచిన వాణిజ్య దుకాణాల యాక్షన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. పన్నుల వసూలుకు వార్డుల వారీగా బృందాలను ఏర్పాటు చేయాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ప్రాంతాల వారీగా విధులు కేటాయించాలని సూచించారు. తాను కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టడం మీవల్ల కాదు

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కొత్తపల్లి(కరీంనగర్): ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీని బొందపెట్టడం రేవంత్, కోమటిరెడ్డిల గురువులు వైఎస్సార్, చంద్రబాబుల వల్లే కాలేదని.. మీతో ఏమవుతుందని ఎద్దేవా చేశారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎస్టీ సెల్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో బంజారాలది కీలక పాత్ర అన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు హయాంలోనే తండాలను పంచాయతీలుగా మార్చి, అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా 2 లక్షల ఉద్యోగ ఖాళీలపై స్పష్టతనిచ్చి, డిసెంబర్‌లోగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్ పైసా నిధులు తేలేదని, పార్లమెంట్ పరిధిలోని గ్రామాలను గాలికొదిలేసి ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, బీఆర్‌ఎస్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు జీవీ.రామకృష్ణారావు, తోట ఆగయ్య, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం మాజీ అధ్యక్షుడు రూప్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం.. కల్తీపాలు



నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు

- పాల అధిక ఉత్పత్తికి గేదెలకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు
- నిషేధించినా దొడ్డిదారిన విక్రయాలు
- పాలల్లో రసాయనాలు కలుపుతున్న అక్రమార్కులు
- అనారోగ్య సమస్యలు వస్తాయంటున్న నిపుణులు
- జిల్లాలో పరిస్థితి



కరీంనగర్ అర్బన్: రోజురోజుకూ పాల ఉత్పత్తి తగ్గిపోతుండగా కల్తీ పాలు రాజ్యమేలుతున్నాయి. నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను గేదెలకు ఇచ్చి, ఉత్పత్తి పెంచుతుండటంతో అసలు పాలు విషంగా మారుతున్నాయి. జిల్లాలో కల్తీ పాలను నియంత్రించే శాఖే లేకపోవడం గమనార్హం. గతంలో పలు డెయిరీల్లో కేంద్ర ఆరోగ్య సంస్థ తనిఖీలు నిర్వహించి, వాటిలో తయారవుతున్న పాల ప్యాకెట్లలో కల్తీ ఉన్నట్లు నిర్ధారించిన విషయం విధితమే. అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. కనీసం పాల నాణ్యతను పరీక్షించే కేంద్రాలే లేకపోవడం ప్రజారోగ్యంపై శ్రద్ధ ఏ మేరకు ఉందో చాటుతున్నాయి.

రోజుకు లక్ష లీటర్లలోపే ఉత్పత్తి

కరీంనగర్ జిల్లాలో రోజుకు లక్ష లీటర్లలోపే పాల ఉత్పత్తి జరుగుతోంది. వాస్తవానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఒక వ్యక్తికి రోజుకు 180 మి.లీ. పాలు అవసరం. ఈ మేరకు 10 లక్షల జనాభాకు 1.80 లక్షల లీటర్ల పాలు అవసరం. కానీ, అందులో మూడో వంతే ఉత్పత్తి అవుతుండటంతో అక్రమార్కులు ఈ డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు కల్తీకి పాల్పడుతున్నారు. జిల్లాలో ఏడాదిలో 6 నెలల్లో ఫిబ్రవరి నుంచి జూలై వరకు పాల కొరత తీవ్రంగా ఉండటం వీరికి కలిసి వస్తోంది. జిల్లాలో లక్ష గేదెలు, 20 వేల ఆవులు ఉండగా వీటి సంఖ్య మరింత పెరగాల్సి ఉంది.

13 ఏళ్ల క్రితమే నిషేధం..

వెటర్నరీ మందుల దుకాణాల దందా ప్రజారోగ్యం పాలిట శాపంగా మారుతోంది. పలువురు పశువైద్యులకూ షాపులున్నాయి. నిషేధిత ఆక్సిటోసిన్ అనే హార్మోన్ ఇంజెక్షన్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వీటిని మనుషులకు, పశువులకు వేర్వేరుగా వాడతారు. గర్భిణులు సుఖప్రసవం అయ్యేందుకు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే నిపుణుల సలహా మేరకు వినియోగిస్తారు. అలాగే, గేదెలకు సేపు కోసం, పాల దిగుబడి పెంచేందుకు, ఎక్కువ కాలం పాలు ఇచ్చేందుకు వేస్తున్నారు. ఇంజెక్షన్ వేసిన కొన్ని సెకన్లకే పొదుగులోని కండరాల్లో కదలిక వచ్చి గేదె పాలు విడుస్తుంది. సాధారణంగా ఈత తర్వాతే అది పాలు విడిచి, ఆరు నెలలపాటు ఇస్తుంది. ఇదే ఇంజెక్షన్ నిరంతరం వాడటంతో ఆ తర్వాత కూడా పాలు పితుక్కునే అవకాశముంది. దూడను వదిలేస్తే అది ఎక్కువగా పాలు తాగుతుందని భయపడి కొందరు రైతులు ఇంజెక్షన్లపై ఆధారపడుతున్నారు. అటు గేదెలకు, ఇటు మనుషులకు వ్యాధులు వస్తాయని భావించి కేంద్ర ప్రభుత్వం ఈ ఇంజెక్షన్‌ను 13 ఏళ్ల క్రితమే నిషేధించింది. అయినా, జిల్లాలోని పలు వెటర్నరీ మందుల దుకాణాల్లో, దాణా విక్రయ కేంద్రాల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి పెనుప్రమాదం



ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ వేసిన గేదె పాలు తాగడం ఆరోగ్యానికి పెనుప్రమాదం. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య తగ్గిపోతుంది. ఆడ పిల్లలు త్వరగా రజస్వల అవుతారు. అదే సమయంలో వారి ఎదుగుదలలో వచ్చే లక్షణాలు త్వరగా కనిపిస్తాయి. ఎముకల పటుత్వం తగ్గిపోయే ప్రమాదముంది. క్యాన్సర్ వచ్చే అవకాశముంది. – **నరేందర్, పల్మనాలజిస్టు**

ఎన్నో రకాలుగా కల్తీ

పౌష్టికాహారంగా ఉపయోగించే పాలను అక్రమార్కులు ఎన్నో రకాలుగా కల్తీ చేస్తున్నారు. కలుషిత నీళ్లతోపాటు గంజి పౌడర్, యూరియా, సోడియం బైకార్బోనేట్, సోడియం కార్బోనేట్, సోడియం హైడ్రాక్సైడ్, కాల్షియం హైడ్రోజన్, జంతువుల కొవ్వు, కొన్ని రకాల నూనెలతో కొంత పాల పొడి కలిపి, పాలను విషంగా మార్చేస్తున్నారు. కృత్రిమంగా తయారు చేసిన మిశ్రమాన్ని అసలు పాలలో కలిపేస్తున్నారు. 50 లీటర్ల మంచి పాలలో దాదాపు 20 లీటర్ల కల్తీ పాలు పోస్తున్నారు. నిల్వ, రుచి, వాసన కోసం కలిపే వివిధ రకాల రసాయనాలతో ఎన్నో అనారోగ్య, శరీరంలో హార్మోన్ల సమతుల్యం దెబ్బతిని వంధ్యత్వం వంటి సమస్యలూ వస్తాయని వైద్య నిపుణులు అంటున్నారు. చిన్న పిల్లలు కల్తీ పాలను తాగడంతో వారిలో పోషకాహార లోపం ఏర్పడి, రక్తహీనత సమస్య ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు. సాధారణంగా ఆవు, గేదె పాలల్లో ఉండే కొవ్వు, ప్రోటీన్లు, లాక్టోజ్ వంటి పోషకాలు చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతాయి. కానీ, కల్తీ పాలలో ఇవేవీ ఉండవని పేర్కొంటున్నారు. ఆక్సిటోసిన్ విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఇలా ఉంటే అనుమానించాల్సిందే..

- ఇంట్లోనే పాల కల్తీని గుర్తించి, అమ్మకందారులను నిలదీయవచ్చు. అవసరమైతే పోలీసులకు, వినియోగదారుల ఫోరాలకు ఫిర్యాదు చేయొచ్చు.
- పాలు సాధారణంగా తోడేసిన 5 గంటల తర్వాత పెరుగుగా మారతాయి. కానీ, ఒకటి, రెండు గంటల్లోనే పెరుగుగా మారినా, మారకపోయినా, పెరుగు కేకులా గట్టిగా తయారైనా అవి కల్తీ పాలే.
- పాలు తాగిన తర్వాత అజీర్తి లక్షణాలు కనిపించినా, వాంతులు, విరేచనాలైనా కల్తీ జరిగినట్లే.
- రంగు, రుచి, వాసనలో తేడా వచ్చినా, మరీ చిక్కగా కన్పించినా, ఒకటి, రెండు రోజుల కంటే ఎక్కువగా నిల్వ ఉన్నా..
- డిటర్జెంట్లు కలపడంతో పాల రంగు మారుతుంది. వాటిని వినియోగిస్తే ఉదర సంబంధ సమస్యలు తలెత్తి, చివరికి కాలేయంపైనా తీవ్ర ప్రభావం పడుతుంది.
- పాలు చిక్కగా కనిపించేందుకు కలుపుతున్న యూరియా మూత్రపిండాలను దెబ్బతీస్తుంది.
- ఎక్కువ రోజులు నిల్వ ఉండటానికి కలిపే ఫార్మలిన్ అనే రసాయనం జీర్ణకోశ వ్యవస్థను దెబ్బతీస్తుంది.
- చిక్కదనం కోసం వినియోగించే కృత్రిమ గంజి పౌడర్ అతిసారం వంటి ప్రాణాంతక సమస్యలకు కారణమవుతుంది.

రూ.2,886 కోట్ల విద్యుత్ బకాయిలు

- ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన బిల్లులు
- వసూలుకు స్పెషల్ డ్రైవ్
- విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు సన్నాహాలు
- కరీంనగర్ సర్కిల్ పరిధిలో పరిస్థితి

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ శాఖల్లో 30.11.2023 వరకు విద్యుత్ బకాయిలు రూ.2,886 కోట్లు పేరుకుపోయాయి. నెలనెలా ఏరియర్స్ పెరుగుతుండటంతో పెండింగ్ బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి. బకాయిలు గడువులోగా చెల్లించి, సహకరించాలని కోరుతూ తొలుత ఆయా శాఖలకు నోటీసులు జారీ చేస్తున్నారు. అయినా స్పందన లేకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల కరీంనగర్‌లోని ప్రభుత్వ అతిథి గృహానికి విద్యుత్ సరఫరా నిలిపివేసి, ఉన్నతాధికారుల విజ్ఞప్తి మేరకు పునరుద్ధరించినట్లు తెలిసింది.

గతంలో ఒత్తిళ్లు..

గతంలోనూ పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయగా ప్రజాప్రతినిధులు, అధికారుల ఒత్తిళ్లతో పునరుద్ధరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, విద్యుత్ సంస్థ మనుగడకు రెవెన్యూ ప్రధాన అంశం. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

బకాయిలు ఇలా..

నీటి పారుదల శాఖ రూ.286477.92, గ్రామ పంచాయతీలు రూ.1043.35, మున్సిపాలిటీలు రూ.366.41, రెవెన్యూ రూ.287.88, వైద్య రూ.233.01, పాఠశాల విద్య రూ.83.25, హోం శాఖ రూ.67.33, సాంఘిక సంక్షేమ రూ.30.03 లక్షలు, ఉన్నత విద్య రూ.29.28, రోడ్లు, భవనాల రూ.26.48, పశుసంవర్ధక, ఫిషరీష్ రూ.20.71 లక్షలు, అటవీ రూ.7.88, వ్యవసాయ రూ.4.62, న్యాయశాఖ రూ.1.09 లక్షలు, అత్యల్పంగా దేవాదాయ శాఖ రూ.54 వేలు, గిరిజన సంక్షేమ శాఖ రూ.20 వేల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

సరఫరా నిలిపివేస్తాం



విద్యుత్ సంస్థ మనుగడకు విద్యుత్ బిల్లులే ప్రధానం. కరీంనగర్ సర్కిల్ పరి ధిలోని ప్రభుత్వ శాఖల్లో కోట్లాది రూపాయల విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో పడ్డాయి. వాటిని చెల్లించి, సంస్థకు సహకరించాలి. ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. బకాయిలు చెల్లించని పక్షంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం.
– గంగాధర్, ఎస్ఈ, కరీంనగర్ సర్కిల్

ఒక ఇంటి నంబర్‌పై 100 ఓట్లున్నయ్

- 10 పోలింగ్ బూత్‌లు కేటాయించారు
- బీజేపీ నాయకుల ఆరోపణ
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు ప్రక్రియ ఇష్టానుసారంగా జరిగిందని బీజేపీ నాయకులు పొన్న వెంకటరమణ, బి.అజయ్‌కుమార్, పవన్‌కుమార్, రాజ్‌కుమార్ ఆరోపించారు. ఒక ఇంటి నంబర్‌పై 100 ఓట్లు నమోదు చేసిన అధికారులు, వాటిని 10 వేర్వేరు పోలింగ్ బూత్‌లకు కేటాయించి, ఓటింగ్ శాతం పెరగకుండా చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి, ఫిర్యాదు చేశారు. ఒక ఇంటి నంబర్‌కు ఒక ఓటు మాత్రమే ఉన్న ఇళ్లు 50 వేలు ఉన్నాయని పేర్కొన్నారు. 1.78 లక్షల ఓటర్లను వాళ్ల సమీప పోలింగ్ బూత్‌లకు కాకుండా 3 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న బూత్‌లకు కేటాయించి, ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్‌లో అత్యల్ప ఓటింగ్ నమోదవడానికి ప్రధాన కారణం ఇదేనన్నారు. చల్మెడ మెడికల్ కాలేజీ పరిసరాల్లో (124, 125, 126 పోలింగ్ బూత్‌ల పరిధిలో) భారీ ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. మెడికల్ కాలేజీల్లో చదువు పూర్తయి, సొంతూళ్లకు వెళ్లిపోయిన విద్యార్థులను ఓటర్ లిస్టు నుంచి తొలగించలేదని ఆధారాలతో వివరించామని తెలిపారు. స్పందించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వెంటనే కలెక్టర్‌తో మాట్లాడారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.



సీఈవోకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు





రోడ్డుపై మురుగు నీరు

కరీంనగర్-వేములవాడ రహదారిపై కొత్తపల్లి మండలంలోని బావుపేట పాత బస్టాండ్ సమీపంలో రోడ్డుకిరువైపులా డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేదు. దీంతో మురుగు నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

చేపల పెంపకం.. ఉపాధి నమ్మకం

- మిడ్‌మానేరు నిర్వాసిత గ్రామాల్లో కేజ్‌కల్చర్‌తో ఉపాధి బాటలు
- మత్స్యకార్మికులకు అవకాశాలు సబ్సిడీ యూనిట్లు
- ఒక్కో యూనిట్‌ విలువ రూ.3 లక్షలు
- త్వరలోనే అవగాహన సదస్సులు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లోని మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేజ్‌ కల్చర్‌ విధానంలో చేపల పెంపకంపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో మిడ్‌మానేరు నిర్వాసితుల ఉపాధి విషయాన్ని విప్‌ ఆది శ్రీనివాస్‌, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ప్రస్తావించగా.. ఈమేరకు అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లోనే అవగాహన సదస్సులు నిర్వహిస్తామని జిల్లామత్స్యశాఖాధికారి శివప్రసాద్‌ తెలిపారు.

మిడ్‌మానేరులో 12 గ్రామాలు..

మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో బోయినపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీల్లోని మత్స్యకార్మిక కుటుంబాలకు మాత్రమే కేజ్‌ కల్చర్‌ యూనిట్‌ వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టులు కలుపుకుని జిల్లాలో 440 వరకు చేపలు పెంచే చెరువులు ఉన్నాయి. 8,400 మత్స్యకార్మికులు, 135 సొసైటీలు ఉన్నాయి. ముంపు గ్రామాల్లో 1600 మంది లైసెన్స్‌ గల మత్స్యకార్మికులు ఉన్నారు.


కేజ్‌ కల్చర్‌ విధానంలో చేపల పెంపకం (ఫైల్‌)


కేజ్‌ కల్చర్‌లో పెరిగిన చేపలను బాక్స్‌ల్లో తరలింపు (ఫైల్‌)

సబ్సిడీ రుణాలు

మిడ్‌మానేరు ప్రాజెక్టు పునరావాసకాలనీల్లోని మత్స్యకార్మికులకు కేజ్‌ కల్చర్‌ విధానంలో చేపల పెంపకానికి సబ్సిడీ రుణాలు అందించనున్నారు. నీటిలో కేజ్‌ కల్చర్‌ యూనిట్‌ నెలకొల్పడానికి ఒక్కో యూనిట్‌కు రూ.3 లక్షల రుణం అందిస్తారు. ఒక్కో మత్స్యకార్మికునికి ఒక్క యూనిట్‌ చొప్పున ఇవ్వనున్నారు. రూ.3 లక్షల రుణంలో జనరల్‌, బీసీ కేటగిరీల వారికి 40 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం వర్తిస్తుందని అధికారులు వివరించారు. త్వరలోనే మత్స్యకార్మికులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మత్స్యకార్మికశాఖ అధికారులు తెలిపారు.

మత్స్యకార్మికులను ఆదుకోవాలి



ముంపు గ్రామాల్లో మత్స్యకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీల్లో ఇతరత్ర పనులు లేక చేపల పెంపకంపైనే అనేక కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం మంచి పరిణామం. ముంపు గ్రామాల మత్స్యకార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి. – మైలారం శ్రీనివాస్‌, కొదురుపాక

త్వరలో అవగాహన సదస్సు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆదేశాలతో కేజ్‌ కల్చర్‌ విధానంలో చేపల పెంపకంపై ముంపు గ్రామాల మత్స్యకార్మికులతో త్వరలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తాం. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు తీసుకుని రావాలి. కేజ్‌ కల్చర్‌ యూనిట్లు మంజూరు చేయిస్తాం.
– శివప్రసాద్‌, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల

మత్స్యకార్మికులు వినియోగించుకోవాలి



మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లోని మత్స్యకార్మికులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆదేశాలతో కేజ్‌ కల్చర్‌ విధానంలో చేపల పెంకంతో ఉపాధి కల్పించేందకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. యూనిట్‌ స్థాపనకు సబ్సిడీపై రుణం సైతం అందిస్తారు. ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీల్లోని ఆసక్తి గల మత్స్యకార్మికులు ఉపయోగించుకోవాలి.
– మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

క్లుప్తంగా

సీసీఎల్‌ శిక్షణకు రాయికల్‌ ఉపాధ్యాయులు


అభయ్‌రాజ్‌


మహేశ్‌

రాయికల్‌(జగిత్యాల): రాయికల్‌ మండలం రామారావుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్‌, భూపతిపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల మ్యాథ్స్‌ టీచర్‌ సిరిపురం మహేశ్‌ గుజరాత్‌లోని ఐఐటీ గాంధీనగర్‌లో సెంటర్‌ ఫర్‌ క్రియేటివ్‌ లర్నింగ్‌ (సీసీఎల్‌) శిక్షణకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి అప్లికేషన్‌ ఒరియంటెడ్‌ అండ్‌ కాంటెక్స్ట్‌ డ్రైవెన్‌ లర్నింగ్‌ అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

బట్టల దుకాణంలో అగ్ని ప్రమాదం



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలోని సుమంగళి క్లాత్‌స్టోర్‌లో శుక్రవారం వేకువజామున అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వేకువజామున 5 గంటలకు యజమాని సంతోష్‌గౌడ్‌ దుకాణంలో మంటలను గమనించాడు. వెంటనే షట్టర్‌ ఓపెన్‌ చేసి చుట్టుపక్కలవారి సాయంతో మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల విలువైన బట్టలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

నలుగురిపై వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో నివాసం ఉంటున్న బత్తుల జ్యోతి ఉరఫ్‌ వంగల జ్యోతిని అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఘటనలో నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్‌ వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు రాచర్ల బొప్పాపూర్‌లో నివాసం ఉంటున్నారు. జ్యోతిని పెర్కవేడుకు చెందిన వంగల సుమన్‌ 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. మూడునెలల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. తర్వాత సుమన్‌తో పాటు మామ స్వామి, అత్త సుగుణ, బావ సునీల్‌ కలిసి రూ.10 లక్షల కట్నం తేవాలని జ్యోతిని శారీరకంగా, మానసికంగా వేధించడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

‘ఉపాధి పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర’

కరీంనగర్‌: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ కూలీలకు మరణశాసనం విధించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్‌ ప్రకటనలో ఆరోపించారు. ఉపాధి పథకానికి ఏటా బడ్జెట్‌లో కోత విధించినట్టుగానే ఈసారి కూడా కేటాయింపులు తక్కువ చేశారని అన్నారు. గతేడాది కంటే తక్కువ కేటాయించి, ఎక్కువ బడ్జెట్‌ కేటాయింపులు చేశామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల ఈ ఏడాది 1/3 వంతు ఉపాధి కూలీలు పనికి దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని, ఉపాధి పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలు పెంచాలని, జాబ్‌ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్‌ చేశారు. ప్రజా పంపిణీ, విద్య, వైద్యం, ఉపాధి తదితర పథకాలకు బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకుండా కార్పొరేట్‌ పక్షపాతినని నరేంద్రమోదీ మరోసారి రుజువు చేసుకున్నారని విమర్శించారు.

కొనసాగుతున్న స్పెషల్‌ డ్రైవ్‌

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌ కమిషనరేట్‌ వ్యాప్తంగా ట్రాఫిక్‌ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా తీసుకునే చర్యల్లో భాగంగా ట్రాఫిక్‌ పోలీసులు స్పెషల్‌ డ్రైవ్‌లు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌ మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత దృష్ట్యా పిల్లలను స్కూళ్లకు చేరవేసే ప్రైవేటు బస్సులు, వ్యాన్‌లు, ఆటోలపై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు వివరించారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌తో పాటు వాహనాల ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్స్‌, ఇతర ధ్రువపత్రాలు తనిఖీ చేసి, డ్రైవర్లకు డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఇషాక్‌, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాల ఫిట్‌నెస్‌ తనిఖీ చేస్తున్న పోలీసులు

రేపు సబ్‌ జూనియర్‌ అథ్లెటిక్‌ జిల్లా జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్‌: జిల్లా అథ్లెటిక్‌ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సబ్‌ జూనియర్స్‌ బాలబాలికల అథ్లెటిక్‌ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్‌, కడారి రవి తెలిపారు. అండర్‌– 8, 10, 12, 14 విభాగాల్లోని బాలబాలికలకు రన్నింగ్‌, జంపింగ్‌, త్రో అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు క్రీడాపాఠశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

జేసీబీకి ఢీకొని వ్యక్తి దుర్మరణం


భూంరెడ్డి (ఫైల్‌)

వేములవాడరూరల్‌: వేములవాడ మున్సిపల్‌ పరిధి శాత్రాజుపల్లి గ్రామంలో రోడ్డుపై నిలిపి ఉన్న జేసీబీని బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొని మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం దుండ్రపల్లి గ్రామానికి చెందిన కందుల భూంరెడ్డి (60) తన ద్విచక్ర వాహనంపై వట్టెంల నుంచి వేములవాడకు వస్తున్నాడు. శాత్రాజుపల్లి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న జేసీబీని వెనక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్‌ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఉద్యోగంపై బెంగతో ఇంటర్‌ విద్యార్థి ఆత్మహత్య


సాగర్‌రెడ్డి (ఫైల్‌)

ముస్తాబాద్‌(సిరిసిల్ల): ఉద్యోగంపై బెంగతో ఓ ఇంటర్‌ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌ మండలం మొర్రాయిపల్లెకు చెందిన గూడ సాగర్‌రెడ్డి(18) శుక్రవారం గ్రామ శివారులోని పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు అతడి తల్లిదండ్రులు గూడ సంజీవ్‌రెడ్డి, రేణుకకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి సాగర్‌రెడ్డి విగతజీవిగా మారాడు. ముస్తాబాద్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ రెండో సంవత్సరం చదువుతున్న సాగర్‌రెడ్డి ఇటీవల ఢిల్లీకి వెళ్లి కంప్యూటర్‌ కోర్సులో చేరాడు. తిరిగి ఢిల్లీకి వెళ్లే క్రమంలో ఉద్యోగం వస్తుందో రాదోననే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: స్థానిక కశ్మీర్‌గడ్డకు చెందిన ఖాసీం (55)పై జనవరి 30న ప్రమాదవశాత్తు శానిటైజర్‌ మీదపడగా, అప్పుడే బీడీ అంటించుకునే క్రమంలో నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు షాహెబ్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్‌ పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో జేఎన్టీయూ విద్యార్థి మృతి


రవితేజ (ఫైల్‌)

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్‌ కళాశాల ఈఈఈ ఫైనల్‌ ఇయర్‌ విద్యార్థి రవితేజ గురువారం వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫస్ట్‌ సెమిస్టర్‌ పరీక్షలు రాసిన రవితేజ వారం రోజుల క్రితం వరంగల్‌ వెళ్లాడు. అక్కడ జరిగిన ప్రమాదంలో మృతిచెందడంతో కళాశాలలో విషాదఛాయలు నెలకొన్నాయి.

రైలు నుంచి పడి ఒకరు..


గోపాల్‌ఛత్రియా(ఫైల్‌)

జమ్మికుంట(హుజూరాబాద్‌): ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. రామగుండం రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ తిరుపతి వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలంగీర్‌ జిల్లా భారుపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌ ఛత్రియా (43) రాయపూర్‌ నుంచి సికింద్రాబాద్‌కు పాట్నా– సికింద్రాబాద్‌ ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్‌ కోచ్‌లో ప్రయాణిస్తుండగా జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలో రైలు నుంచి పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ పేర్కొన్నారు.

8న బహిరంగ వేలం

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): మండలకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 8న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్‌ పేర్కొన్నారు. మార్చి 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు హక్కు లైసెన్స్‌ రూ.500లతో పాటు రూ.2లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు హక్కు లైసెన్స్‌ రూ.300లతో పాటు రూ.1లక్ష చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు వాడుకలో ఉన్న బ్యాంకు చెక్కు, రూ.100 విలువ గల బాండ్‌పేపర్‌, ఆధార్‌కార్డు తీసుకు రావాలని తెలిపారు.

దాడిచేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలరూరల్‌: సారంగాపూర్‌ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన చిరంజీవిపై దాడిచేసిన మహేశ్‌, అతడి తండ్రి రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు సారంగాపూర్‌ ఎస్సై తిరుపతి తెలిపారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన మహేశ్‌ గురువారం తన భార్యను కొడుతుండగా అటుగా వెళ్తున్న చిరంజీవి చూశాడు. మహేశ్‌ భార్య రక్షించాలని అరవడంతో చిరంజీవి అడ్డుకున్నాడు. దీంతో మనసులో పెట్టుకున్న మహేశ్‌, అతని తండ్రి రాజేందర్‌ శుక్రవారం చిరంజీవిపై కర్రలతో దాడిచేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.


రాజన్నా నమో నమః

వేములవాడ: రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.




ఆకట్టుకున్న ప్రదర్శనలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. త్యాగరాజ స్వామి జీవిత చరిత్ర, కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. భక్తులు, స్థానికులు కళాప్రదర్శనలను వీక్షించారు.

హౌసింగ్‌బోర్డు సొసైటీ స్థలాల పరిశీలన


బోర్డు తొలగిస్తున్న అధికారులు

జమ్మికుంట(హుజూరాబాద్‌): పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో సొసైటీ స్థలాలను తెలంగాణ హౌసింగ్‌బోర్డు సొసైటీ వరంగల్‌ డిప్యూటీ డీఈ రవిప్రసాద్‌, ఏఈ పృథ్వీరాజ్‌ శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్‌ అధికారులు (లోకల్‌బాడీస్‌) కొంత స్థలం మున్సిపల్‌కు చెందిందని అందులో బోర్డు ఏర్పాటు చేయగా, సదరు స్థలం తెలంగాణ హౌసింగ్‌బోర్డు సొసైటీ పరిధిలోనే ఉందని గుర్తించిన మున్సిపల్‌ ఏర్పాటు చేసిన బోర్డును సొసైటీ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా సొసైటీ అధికారులు మాట్లాడుతూ, హౌసింగ్‌బోర్డు కాలనీలో 11.36 ఎకరాల స్థలంలో ఎంఐజీ–24, ఎల్‌ఐజీ–111, ఎల్‌ఐజీ2–38 ఇండ్ల నిర్మాణంతో కాలనీ రూపొందిందని వివరించారు. ఇందులో భాగంగా ఒక ఎకరం 6 గుంటల స్థలం సొసైటీ ఆధీనంలో ఉందని, హౌసింగ్‌బోర్డు కాలనీకి సంబంధించి ఇండ్లను అప్పటి గ్రామ పంచాయతీ(లోకల్‌ బాడీస్‌)కి అప్పగించినట్లు తెలిపారు. అవే కాకుండా హౌసింగ్‌బోర్డు కాలనీలో అక్కడక్కడా రోడ్డు, ఖాళీ స్థలాలు ఉన్నాయని, అవి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత లోకల్‌బాడీస్‌ అధికారులపై ఉందన్నారు. సొసైటీ ఆధీనంలో ఉన్న స్థలాల వివరాలను తమ ఉన్నతాధికారులకు అందించి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

టీఎన్జీవో నాయకుడు సుధీర్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌అర్బన్‌: ఇటీవల గుండెపోటుతో మరణించిన టీఎన్జీవో నాయకుడు నూగూరి సుధీర్‌పటేల్‌కు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం కలెక్టరేట్‌ ప్రధాన ద్వారం వద్ద సుధీర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి సుధీర్‌ అమర్‌ రహే అంటూ నినాదాలు చేశారు. పెద్దపల్లిలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, టీఎన్జీవోల సంఘంలో వివిధ హోదాల్లో, వివిధ జిల్లాల్లో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. టీఎన్జీవోల సంఘం కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, జిల్లా వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, అసోసియేట్‌ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్‌, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్‌, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మహిళా జేఏసీ చైర్మన్‌ ఇరుమల శారద, సబిత, టీజీవో నాయకులు మడిపల్లి కాళిచరణ్‌గౌడ్‌, అర్బన్‌ అధ్యక్షుడు సర్దార్‌ హర్మీందర్‌సింగ్‌, కార్యదర్శి సుమంతరావు, రూరల్‌ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌ భరద్వాజ్‌, కార్యదర్శి నేరెళ్ల కిషన్‌, తిమ్మాపూర్‌ అధ్యక్షుడు పోలు కిషన్‌, నాయకులు బిక్షపతి, కొండయ్య, భూమయ్య, సేవియా నాయక్‌, మల్కా రాజేశ్వరరావు, ఆరవెల్లి రాజేశ్వరరావు, సబిత, హరిప్రియ, శైలజ, పద్మ, కామ సతీశ్‌, లవకుమార్‌, పవన్‌కుమార్‌, సత్యనారాయణ, బైరి శ్రీనివాస్‌, షేక్‌ అంజాద్‌, మన్మీత్‌సింగ్‌, ప్రణీత్‌కుమార్‌, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, నారాయణ, అజయ్‌, కుమార్‌, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ యజమానుల ఆందోళన


స్థానిక యజమానుల ఆందోళనతో నిలిచిపోయిన ట్రాక్టర్లు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం చేగుర్తిలో శుక్రవారం కరీంనగర్‌ ట్రాక్టర్లను స్థానిక ట్రాక్టర్‌ యజమానులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. మన ఇసుక–మన వాహనంలో చేగుర్తి, దుర్శేడ్‌కు చెందిన ట్రాక్టర్లకు మాత్రమే ఆన్‌లైన్‌లో బుకింగ్‌ అవకాశం కల్పించాలని డిమాండ్‌ చేశారు. చేగుర్తి ఇసుక క్వారీలో రెండు గ్రామాలకు చెందిన సుమారు 60 ట్రాక్టర్లకు మైనింగ్‌ అధికారులు అవకాశం కల్పించారు. అయితే కొత్తగా కరీంనగర్‌కు చెందిన 18 ట్రాక్టర్లకు అవకాశమివ్వగా శుక్రవారం చేగుర్తి క్వారీకి రావడంతో స్థానిక ట్రాక్టర్‌ యజమానులు అడ్డుకున్నారు. కరీంనగర్‌ ట్రాక్టర్లు క్వారీలోకి పోకుండా ఆందోళన చేయడంతో స్థానిక నాయకుడు ఒకరు క్వారీ గేటుకు తాళం వేయడంతో వివాదమేర్పడింది. రూరల్‌ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను అడ్డుకున్న చేగుర్తికి చెందిన యజమానులను స్టేషన్‌కు తరలించారు. అయితే క్వారీ వివాదం తమకు ఎందుకన్నట్లుగా పోలీసులు ట్రాక్టర్‌ యజమానులను మైనింగ్‌ కార్యాలయానికి పంపించారు. ఈసందర్భంగా కరీంనగర్‌ ట్రాక్టర్లను తొలగించి స్థానిక ట్రాక్టర్లకు మాత్రమే ఆన్‌లైన్‌లో బుకింగ్‌ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ మైనింగ్‌ అధికారులకు యజమానులు వినతిపత్రం సమర్పించారు.

కాంగ్రెస్‌ ఎంపీ టికెట్‌కు దరఖాస్తులు


దరఖాస్తు చేస్తున్న రాజేందర్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్‌: రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ నుంచి కరీంనగర్‌ టికెట్‌ ఆశిస్తున్న నాయకులు దరఖాస్తు చేస్తున్నారు. పార్లమెంట్‌కు పోటీచేసే ఆశావహుల నుంచి కాంగ్రెస్‌ దరఖాస్తులు ఆహ్వానించడం తెలిసిందే. రూ.50 వేల రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మూడురోజుల క్రితం ప్రారంభమైనా, మొదట్లో కరీంనగర్‌కు దరఖాస్తులు రాలేదు. కానీ శుక్రవారం కరీంనగర్‌ టికెట్‌ను ఆశిస్తూ పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో సీనియర్‌ నేత, దివంగత వెలిచాల జగపతిరావు తనయుడు వెలిచాల రాజేందర్‌రావు, హుస్నాబాద్‌ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రస్తుతం యూఎస్‌ఏలో నివాసముంటున్న నగరంలోని వావిలాలపల్లికి చెందిన సింగిరెడ్డి సుమనరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

క్లుప్తంగా

టీఎల్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ: తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర సమన్వయకర్త పోకల నాగయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణరాజు, సదానందచారి, మధూకర్, వెంకటరమణ, ధాకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఈనెల 15న జరిగే దేశవ్యాప్త సమ్మెలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ పాల్గొంటున్నట్లు శుక్రవారం లేబర్ కమిషనర్ రమేశ్‌బాబుకు ఏఐటీయూసీ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు నరసయ్య, సుల్తాన్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 552 మంది గైర్హాజరు

కరీంనగర్: జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్, వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు ఉదయం 322 మంది, మధ్యాహ్నం 230 మంది మొత్తంగా 552 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5,671 మంది విద్యార్థులకు 5,119 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతర టెండర్లు పూర్తి

కరీంనగర్ కల్చరల్: చింతకుంటలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా శుక్రవారం పలు అంశాలకు టెండర్లు పూర్తయినట్లు జాతర అధికారి నాగుల అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్కింగ్, పాన్‌షాప్, హోటల్, స్వీట్‌హౌస్‌తో పాటు బెల్లం, కొబ్బరికాయలు, కోళ్ల అమ్మకాలకు టెండర్లు పూర్తయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతర ఈవో నాగుల అనిల్‌కుమార్, క్లర్క్ పాత మహేందర్, జాతర వ్యవస్థాపకులు ఎల్లమ్మ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకన్న బ్రహ్మోత్సవాలపై సమీక్ష

కరీంనగర్ కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్‌లో గల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలపై శనివారం సమీక్ష సమావేశ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఉదయం 8 గంటలకు స్వామివారిని దర్శించుకున్న అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్రహ్మోత్సవాలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు..

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నరేందర్

కరీంనగర్‌రూరల్: బీజేపీ కరీంనగర్ మండల ప్రధాన కార్యదర్శిగా బొమ్మకల్‌కు చెందిన బెల్లం నరేందర్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు ఎం.సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని నరేందర్ అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులు టి.శ్రీనివాస్‌గౌడ్, డి.శ్రీనివాస్, ఎస్.మల్లేశం, కుమార్, అశోక్, రమణారెడ్డి, సుధాకర్, తిరుపతిలకు నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జంగిలి సాగర్ పోలీస్ కస్టడీ

కరీంనగర్‌క్రైం: భూ కబ్జాల ఆరోపణల కేసులో అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను మరింత లోతుగా విచారణ చేసేందుకు గురువారం పోలీసులు కస్టడీకి తీసుకోగా శుక్రవారం ఉదయం ముగిసింది. కస్టడీలో భాగంగా సాగర్ ఇంట్లో కరీంనగర్ రూరల్ పోలీసులు సోదాలు నిర్వహించి పలు కీలక దస్త్రాలు సీజ్ చేశారు. కస్టడీ ముగియడంతో కోర్టు ఎదుట హాజరుపరిచి తిరిగి జైలు పంపించినట్లు సమాచారం.

ప్రత్యేక పాలన షురూ..

- బాధ్యతలు చేపట్టిన అధికారులు
- సన్మానించిన ప్రజాప్రతినిధులు





నగునూరు, చెర్లభూత్కూర్ ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపడుతున్న దివ్యదర్శన్‌రావు, సంపత్‌కుమార్



జగన్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ నారాయణ తదితరులు

కరీంనగర్‌రూరల్: సర్పంచుల పదవీకాలం గురువారం ముగియడంతో ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీలకు కేటాయించిన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు శుక్రవారం ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టారు. ప్రధానమైన అధికారులకు రెండు గ్రామపంచాయతీలను కేటాయించగా మిగితా అధికారులకు ఒక్క పంచాయతీ బాధ్యతనే అప్పగించారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు నగునూరు, జూబ్లీనగర్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి గోపాల్‌పూర్, చేగుర్తి, పీఆర్ ఏఈ రమణారెడ్డి చామనపల్లి, బహదూర్‌ఖాన్‌పేట, మండల వ్యవసాయాధికారి సత్యం మొగ్దుంపూర్, మందులపల్లి, మండల పశువైద్యాధికారి రామకృష్ణ దుర్శేడ్, నల్లగుంటపల్లి గ్రామాల ప్రత్యేక అధికారులుగా, తహసీల్దార్ నవీన్‌కుమార్ బొమ్మకల్, సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ చెర్లభూత్కూర్ అధికారులుగా బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక అధికారులను ఎంపీపీ టి.లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వి.నారాయణలు అభినందించారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియామకమైన అధికారులంతా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మల్కాపూర్ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవోట ఏ. శ్రీనివాస్‌రెడ్డి, ఎలగందులలో తహసీల్దార్ పి.రాజేశ్ బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఆసిఫ్‌నగర్‌లో రంజిత్‌కుమార్ (ఏఓ,కొత్తపల్లి), బద్దిపల్లిలో ఎం.అనూష (ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్), చింతకుంటలో డి.శ్రీనివాస్ (ఎంపీఓ), కమాన్‌పూర్‌లో కె.సుమలత (డిప్యూటీ తహసీల్దార్), ఖాజీపూర్–జి.కాళిదాస్ (ఏఈ నీటిపారుదల శాఖ), నాగులమల్యాల–ఎన్.నవీన్‌కుమార్(ఏఈఈ, నీటిపారుదల శాఖ)లు బాధ్యతలు చేపట్టారు. వీరికి ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికి బొకేలు అందజేసి సత్కరించారు.

12 సంవత్సరాల తర్వాత..

గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన 12 ఏళ్ల తర్వాత ప్రారంభమైంది. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక అధికారులను నియమించారు. తెలంగాణ ఉద్యమం కీలకదశలో ఉండటంతో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో 2013 డిసెంబరులో ఎన్నికలను నిర్వహించారు. అనంతరం 2018లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో ఎన్నికలు నిర్వహించింది.



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శి,ప్రజాప్రతినిధులు

కూలీలందరికీ పని కల్పించాలి



జూబ్లీనగర్‌లో కేక్ కట్ చేస్తున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ కూలీలందరికీ పనులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్ గ్రామాన్ని సందర్శించి ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఒక్కో కూలీకి కల్పించిన పనిదినాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీలత, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఏపీవో శోభ, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు, మాజీ సర్పంచ్ రుద్ర రాము, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. చామనపల్లిలో ఉపాధికూలీలకు ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. చెర్లభూత్కూర్‌లో ప్రత్యేక అధికారి సంపత్‌కుమార్ కేక్ కట్ చేయగా పంచాయతీ కార్యదర్శి వాయిజ్, ఫీల్డ్ అసిస్టెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాకు తరలిన డీటీఎఫ్ నాయకులు



ధర్నాకు వెళ్తున్న డీటీఎఫ్ నాయకులు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న జాతీయ విద్యావిధానాన్ని నిరసిస్తూ దేశరాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద అఖిల భారత విద్యా హక్కు ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లాకు చెందిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వం శుక్రవారం బయలుదేరి వెళ్లింది. 46 మంది సభ్యులతో కూడిన బృందం రామగుండం నుంచి ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో వెళ్లారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.శ్యాం, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.రఘుశంకర్‌రెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి, పూర్వ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.ఏసురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు ఆవాల నరహరి, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లు వి.రాంకిరణ్, పి.నర్సయ్య, బి.సుదర్శన్ రెడ్డి, రాంమోహన్, మండలాల బాధ్యులు బి.శ్రీనివాస్, కె.వెంకటస్వామి, కె.శ్రీనివాస్, సంపత్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

సన్మానం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం పదవీకాలం ముగిసిన సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఉప సర్పంచ్ చిట్కూరి శేఖర్‌తోపాటు వార్డుసభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యా, వైద్య, విద్యుత్ సిబ్బందికి మాజీ సర్పంచ్ రమణారెడ్డి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వాయిజ్, ఎంపీటీసీ బుర్ర తిరుపతి గౌడ్, మాజీ వార్డుసభ్యులు ఆకుల పద్మ, సుజాత, సరస్వతి, భాగ్యలక్ష్మి, ఉమ, సంధ్య, అంజయ్య, శ్రావణ్, రమేశ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌రూరల్: పల్లెకు పోదాం కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం కోరారు. శుక్రవారం కరీంనగర్ మండలం నగునూరులో జరిగిన బీజేపీ మండల పదాధికారుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని బూత్ కమిటీలను పరిశీలించడంతో పాటు ప్రముఖులను కలిసి బీజేపీ చేపడుతున్న పథకాలను వివరించి మద్దతు కూడగట్టాలన్నారు. ఇంటింటికీ బూత్‌కమిటీలు వెళ్లి ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి పనులను చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఎం.సంతోష్‌కుమార్, డి.రమణారెడ్డి, అశోక్, కుమార్, సుధాకర్, తిరుపతి, సాయికృష్ణ, నరేందర్, మహేందర్, రాఘవేంద్రరెడ్డి, రాంచంద్రం, నారాయణ, శ్రీధర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

గళమెత్తే విద్యావంతుడికే ఓటెయ్యాలి



మాట్లాడుతున్న జక్కుల నాగరాజు

కరీంనగర్: ప్రజా సమస్యలపై గళమెత్తే విద్యావంతుడికే ఓటెయ్యాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు అన్నారు. సోమవారం నగరంలోని కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు ఓటరు నమోదుతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి, బండ వేణు, సాయి ప్రదీప్, శ్రావణ్, తరుణ్, యశ్వంత్, ఓంకార్, స్వామి, పర్శరాం, సందీప్, వేణు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న హెచ్ఎం లక్ష్మారెడ్డి

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ అన్నారు. కరీంనగర్ మండలం చామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్నేహిత కార్యక్రమంపై అవగాహన సమావేశంలో మాట్లాడారు. బాలికలు సరైన పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలన్నారు. బాలికలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, ఏఎస్సై దామోదర్‌రావు, దుబ్బపల్లి పంచాయతీ కార్యదర్శి ఎం.సరిత, స్నేహిత కార్యక్రమ ఇన్‌చార్జి గాయత్రి, ఉపాధ్యాయులు అబ్దుల్ బాసిత్, వైకుంఠం, బలరాంసింగ్, ఇన్నారెడ్డి, లక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే డీఏ ప్రకటించాలి

కరీంనగర్: పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన డీఏను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాద్రి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2022 జూలై, 2023 జనవరి, జూలై నెలల డీఏ బకాయిలు ఉండగా కేంద్ర ప్రభుత్వం మరో డీఏ ప్రకటించబోతోందని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పెడచెవిన పెట్టిందనే విషయం ఈ ప్రభుత్వానికి బాగా తెలుసన్నారు. ఆ పరిస్థితులు తిరిగి పునరావృతం కాకుండా తగు నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలపై దృష్టి సారించి లాభం చేకూరేలా చూడాలని కోరారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో మాట్లాడారు. వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ నెల 5,6వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. బిల్లు ప్రవేశపెట్టకుండా కేంద్ర ప్రభుత్వం కమిటీ పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాదిగలను తొమ్మిదేళ్లుగా మభ్యపెడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు బ్యాంక్‌గా వాడుకోవాలని భావిస్తుందని అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టేలా ఒత్తిడి తీసుకువస్తామని, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గాలి రాజ్‌కుమార్, భరత్, కిశోర్, శివ, కృష్ణసాయి, రవి, అమర్, ప్రసాద్, జఫార్, గణేశ్, మోహన్, క్రాంతి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో గావ్ అభియాన్’ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్‌టౌన్: ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే చలో గావ్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. శుక్రవారం రేకుర్తిలో నిర్వహించిన పశ్చిమ జోన్ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గడపగడపకూ వెళ్తూ నరేంద్ర మోదీ పథకాల ఉద్దేశాలను వివరించాలని కోరారు. కరీంనగర్ పార్లమెంటులో పార్టీ జెండా ఎగరవేసే విధంగా కార్యకర్తలు నాయకులు పని చేయాలని సూచించారు. జోన్ ఇన్‌చార్జి ఎడమ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, కార్పొరేటర్ జితేందర్, నాయకులు శివకుమార్, బండ రమణారెడ్డి, పొన్నాల రాము, నేలకొండ ప్రసన్నరెడ్డి, చంద్రగిరి వేణు, ఎం.లక్ష్మీరాజం, పింగిలి ప్రతాపరెడ్డి, నాంపల్లి శంకర్, లాల మురళి, సిద్ది సంపత్, దయ్యాల మల్లేశం, అప్పల శ్రీనివాస్, రెడ్డెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేపూరి మొగిళి, ఉపాధ్యక్షుడిగా తిప్పని చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా సతీశ్ నియామకయ్యారు. ఈసందర్భంగా మొగిళి మాట్లాడుతూ.. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, శ్రీనివాస్, అశోక్, వెంకటేశ్, శీను, అనిల్, కొంరయ్య, శంకరయ్య, ఐలయ్య, రాజయ్య ఉన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11కేవీ కమాన్, వెంకటసాయి ఫీడర్ల పరిధిలోని పద్మశాలి వీధి, లక్ష్మీనగర్, వీఎస్ఎల్ కాంప్లెక్స్, వాసవీకాలనీ, పాతబజార్, కమాన్ నుంచి హౌసింగ్‌బోర్డు రోడ్, రాఘవేంద్రనగర్, వందన అపార్ట్‌మెంట్, స్కాలర్స్ స్కూల్, గాయత్రీనగర్, షాషామహల్, మధు గార్డెన్, పోచమ్మవాడ, కోతిరాంపూర్ ప్రాంతాలతో పాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ వావిలాలపల్లి ఫీడర్ పరిధిలోని వావిలాలపల్లి, జండాగద్దె, అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. అదేవిధంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ శివనగర్ ఫీడర్ పరిధిలోని మంకమ్మతోట, మార్కండేయనగర్, ప్రగతినగర్, సప్తగిరికాలనీ, శివనగర్, రాజీవ్‌పార్క్, హస్నాపూర్ కాలనీ, బతుకమ్మ కాలనీ, టెలిఫోన్ క్వార్టర్స్, సప్తగిరి కాలనీ బైపాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

మానకొండూర్: 33/11 కేవీ పరిధిలోని విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గన్నేరువరం, ఖాసీంపేట, పారువెల్ల, చొక్కారావుపల్లి, చాకలివానిపల్లె, మైలారం, సాంబయ్యపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కె.ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు.

తిమ్మాపూర్: మండలంలోని అల్గునూరు ట్రాన్స్‌కో పరిధిలోని మన్నెంపల్లి సబ్‌స్టేషన్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. మన్నెంపల్లి, మల్లాపూర్, పోరండ్లలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



మహిళా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నరేశ్

జమ్మికుంట: పట్టణంలోని 6వ వార్డు హౌజింగ్ బోర్డు కాలనీలో కౌన్సిలర్ శ్రీపతి నరేష్ ఆధ్వర్యంలో మహిళ సంఘాలతో ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగం, రుణాలపై మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘాల నిర్వహణ, ప్రభుత్వ అందించే సహాయ సహకారాలపై చర్చించారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎల్ఎఫ్ఆర్పీ మంజుల, టీఎల్ఎఫ్ఆర్ సరళ, వార్డు ఆఫీసర్ తరంగిణి, బీఎల్ఓ షాహీన్, ఆశాశ్రీలత, ఆర్పీ లతతోపాటు మహిళలు పాల్గొన్నారు.

నెంబర్‌ప్లేట్ లేకుంటే వాహనాలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పలోఈసులు

హుజూరాబాద్: నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని టౌన్ సీఐ బొల్లం రమేశ్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్–జమ్మికుంట ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. నెంబర్ ప్లేట్‌లేని 8 వాహనాలు, ధ్రువీకరణ పత్రాలు లేని 5 వాహనాలను పట్టుకున్నామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు.

సబ్‌జైలు సందర్శన



హుజూరాబాద్: పట్టణంలోని సబ్‌జైలును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, ఇన్‌చార్జి చైర్మన్ కె.వెంకటేశ్ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఖైదీల యోగక్షేమాలను, భోజన వసతి, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరుకులు నాణ్యమైనవిగా, కూరగాయాలు తాజాగా ఉండాలని జైలు సిబ్బందికి సూచించారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

వీణవంక: పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన విద్యావిధానం రద్దు చేయాలని, కార్పొరేట్ విద్య బలోపేతానికి కేంద్రం కుట్రలు చేస్తుందని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అద్దె భవనాలలో నడిచే పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. అదేవిధంగా సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలను పెంచాలని, పెండింగ్ మెస్ బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో వంశీ, శ్రీకాంత్, విజయ్, భాను తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామం ఎల్లమ్మ దేవాలయం వద్ద సిమెంట్ బెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిధులు మంజూరు చేయగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గౌడ కులస్తులు శుక్రవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్, మాజీ ఉపసర్పంచ్ మాడుగుల రత్నాకర్‌రెడ్డి, దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మీరాజంగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం కనకయ్య, గౌడ సంఘం నాయకులు కోయ్యడ పర్శారాం, అశోక్, పూదరి లింగయ్య, అంజయ్య, బండారి మధు, పర్శయ్య, సతీశ్, లక్ష్మీరాజం, కనకయ్య, గౌతమ్, సంజయ్ పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ ఎంట్రన్స్ నోటిఫికేషన్

ఫిబ్రవరి 21 వరకు దరఖాస్తులకు గడువు.. మార్చి 5న పరీక్ష

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ (ఓడీఎల్) అర్హత పరీక్ష 2023–24కు నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 21గా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రుసుము రూ.1000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750 అని వివరించారు. మార్చి 5వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాల్లో బీఎడ్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. విద్యార్థులు పరీక్షకు రెండు రోజుల ముందు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్ లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్‌లో సంప్రదించాలని సూచించారు.

జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాలకు దరఖాస్తులు

5న నిథిమ్‌లో ఎంపికలు

సాక్షి, హైదరాబాద్: జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాల భర్తీకి ఆసక్తి ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో డిగ్రీ/డిప్లొమా చేసిన అనుభవజ్ఞులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థుల కనీస వయసు 22 ఏళ్ల నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలని, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో డిగ్రీ లేదా డిప్లొమా చేసి అనుభవం కలిగి ఉండాలని వివరించింది. ఆసక్తి ఉన్న వారు టామ్‌కామ్ హెచ్ఆర్ మేనేజర్ ఫోన్ నంబర్ 8125251408లో సంప్రదించాలని, లేదా ఈమెయిల్ ద్వారా పంపించవచ్చని వివరించింది. ఎంపిక ప్రక్రియను ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఎంపికైన వారికి జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చి అక్కడ పనిచేసేందుకు అవసరమైన అదనపు నైపుణ్యాలను నేర్పించనున్నట్లు వెల్లడించింది.

కుప్పాన్ని ఎండబెట్టి కుప్పి గంతులు!

రాజకీయ భిక్ష పెట్టిన పురిటిగడ్డకు చంద్రబాబు నయవంచన

కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తానంటూ నమ్మక ద్రోహం

- సాగు, తాగునీరు ముసుగులో అంచనా వ్యయం భారీగా పెంపు
- సీఎం రమేష్‌ను అడ్డుపెట్టుకుని ఖజానాకు కన్నం
- కుప్పంను మున్సిపాల్టీగా చేసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసిన సీఎం జగన్
- కుప్పం బ్రాంచ్ కెనాల్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కృష్ణా జలాల తరలింపు


కుప్పం బ్రాంచ్ కెనాల్ (ఫైల్)

సాక్షి, అమరావతి: కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలించి సాగు, తాగునీరు అందిస్తానని నమ్మబలికిన స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆ ముసుగులో ఖజానాను దోచేసి పనులు చేయలేక చేతులెత్తేసి నయవంచనకు పాల్పడ్డారు! 2022 సెప్టెంబరు 23న కుప్పం నియోజకవర్గ పర్యటన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. పూర్తయిన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ఈ నెలలోనే సీఎం జగన్ ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయనున్నారు. ఇప్పటికే రామకుప్పం మండలం వరకూ కృష్ణా జలాలను తరలించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులు నింపి సమృద్ధిగా సాగు, తాగునీరు అందించనున్నారు.

పురిటిగడ్డకు ద్రోహం

సొంతూరు నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నుంచి 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చంద్రబాబు నాడు టీడీపీ అభ్యర్థి మేడసాని వెంకట్రామనాయుడి చేతిలో 17,429 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయారు. ఆ దెబ్బకు 1985 ఎన్నికల్లో పోటీ చేయడానికే జంకిన చంద్రబాబు పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్ పంచన చేరి 1989లో తమిళనాడు, కర్ణాటక, రాష్ట్ర సరిహద్దుల్లోని కుప్పం నియోజకవర్గానికి వలస వెళ్లారు. అప్పటి నుంచి గూండాయిజం, నోట్ల కట్టలు, దొంగ ఓట్లతో నెగ్గుకొస్తున్నారు. దుర్భిక్ష రాయలసీమను సుభిక్షం చేయడానికి జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ చేపట్టిన హంద్రీ–నీవా సుజల స్రవంతిలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగు, తాగునీరు అందిస్తానని చంద్రబాబు నమ్మబలికారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను 123.641 కి.మీ. పొడవున తవ్వేందుకు 98,85,140 క్యూబిక్ మీటర్ల మట్టి పని, 3,84,457 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాలి. 2015–16 ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్స్) ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మట్టి, కాంక్రీట్ పనులకు రూ.203.11 కోట్లు ఖర్చు అవుతుంది. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటార్లు, ప్రెజర్‌మైన్లు, విద్యుత్ సరఫరా ఏర్పాటుకు రూ.90 కోట్ల వ్యయం అవుతుంది. 2015–16 ధరల ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.293.11 కోట్ల వ్యయం అవుతుంది. కానీ అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడితో పనుల అంచనా వ్యయాన్ని రూ.413 కోట్లకు పెంచేశారు.

కడప టీడీపీ అధ్యక్షుడికి కానుక..

అంచనా వ్యయం పెంచేసిన పనులను కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు కట్టబెట్టి రూ.120 కోట్లు కాజేయడానికి చంద్రబాబు స్కెచ్ వేశారు. ఆ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.413 కోట్లు అంచనా విలువగా నిర్ణయించి 2015 ఆగస్టులో టెండర్లు పిలిచారు. ఆర్కే ఇన్‌ఫ్రా సంస్థకే పనులు దక్కేలా టెండర్లలో నిబంధనలు పెట్టారు. టెండర్లలో ఆ సంస్థ ఒక్కటే నాలుగు శాతం అధిక(ఎక్సెస్) ధరకు కోట్ చేస్తూ షెడ్యూలు దాఖలు చేసింది. చంద్రబాబు ఒత్తిడి మేరకు ఆర్కే ఇన్‌ఫ్రాకు నాలుగు శాతం అధిక ధరకు రూ.430.26 కోట్లకు పనులు కట్టబెట్టారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.43 కోట్లు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి వాటిని బాబు జేబులో వేసేశారు. అయితే, శ్రీనివాసరెడ్డికి భారీ ఎత్తున లబ్ధి చేకూర్చుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు కట్టబెట్టడంపై అప్పటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్ పేచీ పెట్టారు. దీంతో శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు 50% పనులు, మిగతా 50% పనులు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు సబ్ కాంట్రాక్టు కింద ఇవ్వాలని బాబు ఆదేశించారు. తనతోపాటు శ్రీనివాసరెడ్డి భారీ ఎత్తున లబ్ధి పొందుతుండటాన్ని సహించలేని సీఎం రమేష్ మొత్తం పనులను తనకే కట్టబెట్టాలని మరోసారి పేచీకి దిగారు. దీంతో పనులన్నీ రిత్విక్ ప్రాజెక్ట్స్‌కే అప్పగించేశారు.

రూ.460.88 కోట్లు నీళ్ల పాలు..

కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో సీఎం రమేష్ సంస్థకు రూ.460.88 కోట్లను 2019 ఏప్రిల్ నాటికి ప్రభుత్వం బిల్లుల రూపంలో చెల్లించింది. అంటే కాంట్రాక్టు విలువ కంటే రూ.30 కోట్లు ఎక్కువగా చెల్లించినా పనులు పూర్తి కాలేదు. రూ.99.41 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. నాసిరకమైన పైపులు వేయడం వల్ల వర్షపునీటికే పగిలిపోయాయి. దీన్ని బట్టి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లో సీఎం రమేష్‌తో కలిసి చంద్రబాబు ఏ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారో విశదం చేసుకోవచ్చు. వరుసగా ఏడుసార్లు గెలిపించిన కుప్పం ప్రజలకు సాగునీటి మాట దేవుడెరుగు గుక్కెడు తాగునీళ్లు కూడా అందించకుండా చంద్రబాబు నమ్మకద్రోహం చేశారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్..

ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టాక ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కుప్పంను మున్సిపాల్టీని చేశారు. కుప్పం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీతో పాటు గ్రామాల్లో అంతర్గత రహదారులు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి కృష్ణా జలాలను అందించి సుభిక్షం చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకుంటూ యుద్ధప్రాతిపదికన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేయించారు. ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్ 74 కి.మీ. వరకూ అంటే రామకుప్పం మండలం మనేంద్రం గ్రామం వరకూ కెనాల్ నీటిని తరలించారు. చెరువులను నింపి సాగు, తాగునీరు అందించనున్నారు.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

- ఆరో జాబితాలో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు ఎంపిక
- రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు సజ్జల వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. ప్రజాబలమే గీటురాయిగా.. సామాజిక న్యాయం పాటిస్తూ... ఆరో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సాపురం లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా... ఈ సారి బీసీ వర్గానికి చెందిన మహిళా అడ్వొకేట్ గూడూరి ఉమాబాలను ఎంపిక చేశారు. రాజమండ్రి లోక్‌సభ స్థానానికి డాక్టర్ గూడూరి శ్రీనివాస్(బీసీ)ను, గుంటూరుకు ఉమ్మారెడ్డి రమణ, చిత్తూరుకు సిటింగ్ ఎంపీ ఎన్.రెడ్డప్పను ఎంపిక చేశారు. గత ఎన్నికల్లో మైలవరం శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఈ సారి సర్నాల తిరుపతిరావు యాదవ్(బీసీ)ను నియమించారు. గత ఎన్నికల్లో ఎమ్మిగనూరు శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించారు. మార్కాపురానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరుకు ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి, గంగాధర నెల్లూరు(ఎస్సీ)కు డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి, నెల్లూరు సిటీకి ఎండీ ఖలీల్‌ను నియమించారు. ఇప్పటివరకూ 63 శాసనసభ, 16 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను కొత్తగా నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయకర్తల్లో 21 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 18 మంది బీసీలు, ఐదుగురు మైనార్టీలు, 16 మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 16 లోక్‌సభ స్థానాలకు నియమించిన సమన్వయకర్తల్లో బీసీలు తొమ్మిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు నలుగురు ఉన్నారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకానికి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ల నియామకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీసీగా నియామకమయ్యే అభ్యర్థులు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా కనీసం 10 ఏళ్ల పాటు పనిచేసి ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి 65 ఏళ్లకు మించకుండా ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో వెల్లడించారు.

కాపాడలేం.. అమ్మేద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేయటంతో ఈ అంశం అలాగే తొమ్మిదో షెడ్యూల్‌లో తెగని పంచాయితీగా ఉండిపోయింది. హైకోర్టులో కేసు కూడా కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో సదరు భూములను అమ్మేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించడం చర్చనీయాంశంగా మారుతోంది.

కాపాడలేమంటూ కేంద్రం దృష్టికి..

హౌసింగ్‌బోర్డు, దిల్ భూములు కీలక ప్రాంతాల్లో ఉండటంతో వాటిపై కబ్జారాయుళ్ల దృష్టి పడింది. ఇప్పటికే చాలా భూములపై వివాదాలు మొదలయ్యాయి. ఈ భూముల విక్రయానికి ప్రక్రియ మొదలుపెట్టగానే.. అభ్యంతరాలు వస్తాయని, కోర్టులో కేసు ఉండగా ఎలా అమ్ముతారన్న ప్రశ్న వస్తుందని సర్కారు ముందుగానే అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఇటు కోర్టుకు, అటు కేంద్ర ప్రభుత్వానికి కూడా ఈ భూముల పరిరక్షణ సవాల్‌గా మారిందన్న విషయాన్ని తెలియపర్చాలని భావిస్తోంది. ''ఇప్పటికే చాలా భూములు వివాదంలో ఉన్నాయి. వాటితోపాటు క్లియర్‌గా ఉన్న మిగతా భూములను పరిరక్షించటం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. కబ్జాలు ఇంకా పెరిగి వివాదాలు కోర్టుల్లో పెరిగేంత వరకు ఉపేక్షించటం సరికాదు. ఈ భూములకు సంబంధించి కోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా అనుసరిస్తాం. ముందు వాటిని వేలం ద్వారా విక్రయించి, వచ్చిన డబ్బును తదనుగుణంగా వినియోగించుకోవచ్చు. అందుకు వీలు కల్పించాలి''అని కోర్టును కోరాలని యోచిస్తోంది. కేంద్రానికి కూడా ఇదే వివరించాలని.. ఈ మొత్తం వ్యవహారాన్ని ఢిల్లీ స్థాయిలో పర్యవేక్షించేందుకు ఓ ప్రతినిధిని కూడా నియమించాలని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

'హస్తం' పార్టీలో జోష్

- సీఎం ఇంద్రవెల్లి సభతో కేడర్‌లో ఉత్సాహం
- ఉమ్మడి జిల్లా దత్తత ప్రకటనతో అభివృద్ధిపై ఆశలు


ఇంద్రవెల్లి సభలో మహిళా నాయకురాళ్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్ రెడ్డి తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 'తెలంగాణ పునర్నిర్మాణ సభ' పేరుతో శుక్రవారం నిర్వహించిన భారీ బహిరంగ సభ సక్సెస్ కావడం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు, ప్రజలు తరలిరావడం ఉత్సాహాన్నిచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటామని సీఎం ప్రకటించడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం ఈ ప్రాంతంపై పట్టించుకోలేదని, ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని హామీనివ్వడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ఇంద్రవెల్లి సభ వేదికగా పలు హామీలు ప్రకటించారు. గిరిజన, ఆదివాసీలను ఉత్సాహపర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన రాంజీగోండు, నిజాం సైన్యానికి వ్యతిరేకంగా కుమురంభీం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఇక్కడి గిరిజన, ఆదివాసీలను అన్నింటా ఆదుకుంటామని హామీనిచ్చారు.

దత్తత తీసుకుంటామని హామీ

ఉమ్మడి జిల్లాను విద్య, వైద్యం, ఆరోగ్యం, ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. అభివృద్ధి చేసేందుకు ఉమ్మడి జిల్లాను దత్తత తీసుకుంటామని ప్రకటించారు. నాగోబా ఆలయం, ఇంద్రవెల్లి స్మృతివనం, అభివృద్ధి కోసం నిధులు ప్రకటించారు. దీంతో ఆయా రంగాల్లో అభివృద్ధిపై ఇక్కడి ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రాంతం నుంచే అభివృద్ధి దిశగా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

సాగునీటి ప్రాజెక్టులకు భరోసా

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా సాగునీటి సమస్యతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును డిజైన్ మార్చి కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడంతో ఇక్కడి రైతులకు సాగునీటి గోస తీరలేదు. ఈ క్రమంలో సీఎం ఇంద్రవెల్లి సభ వేదికగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కడతామని స్పష్టం చేశారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు, సదర్మాట్, కుప్టి ఇతర పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని హామీనిచ్చారు. దీంతో ఇక్కడి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.

లోకసభ ఎన్నికలకు సన్నద్ధం

వచ్చే రెండు నెలల్లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు ఇంద్రవెల్లి సభ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమర శంఖారావం పూరించారు. గత ప్రభుత్వం తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపారు. ఆదివాసీ ప్రాంతంలో మొదటి సారిగా సభ నిర్వహించి మరోసారి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కేవలం ఖానాపూర్ సెగ్మెంట్ మాత్రమే కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మిగతా ఆరు స్థానాల్లో నిర్మల్, ముథోల్, ఆదిలాబాద్, సిర్పూర్ బీజేపీ గెలుచుకోగా, బోథ్, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ గెలిచాయి. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే ఇక్కడ ఓటు బ్యాంకు పెంచుకోవాలి. ఎమ్మెల్యేలు లేని ఆరు సెగ్మెంట్లలో మద్దతు కూడగట్టాలి.

కార్యకర్తల త్యాగాలతోనే జాతీయవాదం బలపడింది

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి


ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న భారత సురక్షా సమితి

జగిత్యాలటౌన్: ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషిచేసిన వారందరికీ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు లభించేందుకు కృషి చేస్తానని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌరసన్మానంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్ మాట్లాడుతూ.. 1975–77కాలంలో దేశంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించిందన్నారు. ప్రతిపక్ష నాయకులను రాత్రికిరాత్రి జైల్లో పెట్టారని తెలిపారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతో మంది యువత, విద్యార్థులు, మేధావులు ఉద్యమించారని, కొందరు పోలీసు కాల్పుల్లో మృతి చెందారని అన్నారు. అప్పటి ఉద్యమంలో పాల్గొన్నవారు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని స్వాతంత్ర్యయోధులుగా గుర్తించి అన్ని రాయితీలు కల్పించేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తాను గవర్నర్‌గా కాకుండా ఒక ఆత్మీయుడిగా సన్మాన సభకు వచ్చానని పేర్కొన్నారు. జగిత్యాల ప్రాంతంలో రామన్న, గోపన్న, జితేందర్‌రెడ్డి, మధుసూధన్‌గౌడ్ తదితరులు వామపక్ష తీవ్రవాదుల అరాచకాలను ఎదిరించి, వీరమరణం పొందారని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ తనపై నమ్మకంతో గవర్నర్‌గా అవకాశం కల్పించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తా అన్నారు. అనంతరం భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య, భారత సురక్షా సమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

- ఉమ్మడి ఆదిలాబాద్ ఓటరు జాబితా పరిశీలకులు భారతీలక్‌పతినాయక్
- నిర్మల్‌లో సమీక్షా సమావేశం
- నాలుగు జిల్లాల కలెక్టర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న భారతి లక్పతినాయక్, వేదికపై జిల్లాల కలెక్టర్లు


సమావేశానికి హాజరైన నాలుగు జిల్లాల అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా రూపొందించాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు బీ భారతీలక్‌పతినాయక్ సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 ఫొటో ఓటరు జాబితా రూపకల్పనపై సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 ఫొటో ఓటరు జాబితా వివరాలు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అర్హులందరినీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత నెల 22వరకు ముసాయిదా జాబితా స్వీకరించిన అభ్యంతరాలు, ఫిర్యాదులను ఫిబ్రవరి 2న పరిశీలించి, 8వ తేదీన తుది జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 1,500 మంది ఓటర్లు ఉండేలా జాబితా రూపొందించటంలో బూత్ స్థాయి ఏజెంట్లు పరిశీలించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఓటరు నమోదు, జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలని సూచించారు. ఓటు హక్కుపై కళాజాత ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కలెక్టర్లు ఆశిష్ సంగ్వాన్, హేమంత్ బోర్కడే, బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, శ్యామలాదేవి, నాలుగు జిల్లాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మహాభాగ్యం.. లక్ష్మీనృసింహుని దర్శనం

- వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహ


ధర్మపురి ఆలయంలో ప్రత్యేక పూజల్లో మంత్రి

ధర్మపురి: ప్రాచీన పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ధర్మపురి లక్ష్మీనృసింహుడిని దర్శించుకోవడం మహా భాగ్యమని వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానాన్ని శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి కుటుంబానికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలోని హోమం, స్వామివార్ల నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకోగా.. ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ యాస్మిన్‌భాషా, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించారు. ధర్మపురిలోని 30 పడకల కమ్యూనిటీ ఆస్పత్రిని 100 పడకలకు మార్చేందుకు, మార్చురీ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి వివరించారు. ధర్మపురి ఎంసీహెచ్‌లో వసతులు ఉన్నప్పటికీ సిబ్బంది లేరని, ఆయా ఖాళీల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉన్నారు.

నేటి నుంచి ఇండో నేపాల్ కరాటే టోర్నమెంట్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డీవైఎస్‌వో తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఇండో నేపాల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సురభి వేణుగోపాల్, సురభి అన్వేశ్ తెలిపారు. పోటీల్లో ఝార్ఖండ్, కోల్‌కతా, త్రిపుర, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు నేపాల్ దేశం నుంచి సుమారు 20 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. పోటీలకు చీఫ్ జ్యూరీగా నేపాల్ కరాటే ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ బీర్‌మిత్రా, గోజుర్యూ కరాటే డో ఫెడరేషన్ ఇండియా చీఫ్ నాగేశ్వర్‌రావు వ్యవహరిస్తారని, పోటీలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కాగా పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెటా సంఘం కార్యదర్శి ఎండీ యూనిష్‌పాష తదితరులు పాల్గొన్నారు.

జెఎల్‌ఎఫ్ 2024

'మన దేశంలో అన్నింటికీ కోర్సులు ఉన్నాయి... పేరెంటింగ్‌కి తప్ప. పిల్లల మానసిక సమస్యల గురించి చాలా తక్కువ పట్టింపు ఉన్న దేశం. పిల్లల్లో మానసిక సమస్యలు అధికంగా ఉన్న దేశం మనదే. పిల్లల గురించిన ఆలోచనే అందరికీ ప్రధానం కావాలి' అన్నారు జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో పాల్గొన్న చైల్డ్ సైకియాట్రిస్ట్‌లు డాక్టర్ శేఖర్ శేషాద్రి, డాక్టర్ అమిత్ సేన్, పిల్లల మానసిక చికిత్సా కేంద్రం నిర్వాహకురాలు నేహా కిర్‌పాల్. ఇంకా వారేమన్నారు?

చిల్డ్రన్ ఫస్ట్



'మన దేశంలో పదికోట్ల మంది బాల బాలికలు మానసిక సమస్యలతో బాధ పడుతున్నారు. వారిలో కేవలం ఒక్కశాతం మందికి మాత్రమే నాణ్యమైన మానసిక చికిత్స, థెరపీ అందుతున్నాయి. తల్లిదండ్రుల ప్రపంచం, పిల్లల ప్రపంచం వేరు వేరుగా ఉంది. చాలా కుటుంబాలలో సభ్యుల మధ్య కనెక్టివిటీ లేదు. దానివల్ల అనేక సమస్యలు వస్తున్నాయి' అని తెలిపారు పిల్లల మానసిక ఆరోగ్యరంగంలో పని చేస్తున్న నేహా కిర్‌పాల్, శేఖర్ శేషాద్రి, అమిత్ సేన్.జైపూర్‌లో జరుగుతున్న జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో 'రీక్లయిమింగ్ హోప్' అనే సెషన్‌లో వీరు పాల్గొన్నారు.

చదువుల ఒత్తిడి - ఆత్మహత్యలు

'పోటీ పరీక్షల ఒత్తిడి పిల్లలను ఆత్మహత్యలకు ఉసిగొల్పుతోంది. రాజస్థాన్‌లోని 'కోటా'లో కోచింగ్ సంస్థల వ్యాపారం 12 వేల కోట్లకు చేరుకుంది. ఏటా లక్షమంది విద్యార్థులు అక్కడ జెఇఇ, నీట్ ర్యాంకుల కోసం చేరుతున్నారు. తీసుకున్న ఫీజు కోసం నిర్వాహకులు తల్లిదండ్రులను సంతృప్తిపరచడానికి పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. రోజుకు 12 గంటల రొటీన్ వల్ల పిల్లలకు కొద్దిగా కూడా రిలీఫ్ లేదు. రోజువారీ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్నవారికి ఒకరకమైన ట్రీట్‌మెంట్, మార్కులు రాక స్ట్రగుల్ చేస్తున్నవారికి ఒక ట్రీట్‌మెంట్ ఉంటోంది. పిల్లలు తమ మీద తాము విశ్వాసం కోల్పోతున్నారు. చెప్పుకుందామంటే తల్లిదండ్రుల నుంచి కనీస సానుభూతి దొరకడం లేదు. దాంతో ఆత్మహత్యల ఆలోచనలు, చర్యలు పెరుగుతున్నాయి. పిల్లలకు ఏం కావాలో తెలుసుకోకుండా వారు చదువుకునే గదుల్లో ఫ్యాన్లు తీసేసినంత మాత్రాన ఆత్మహత్యలు ఆగవు. పిల్లలే మనకు ప్రధానం అనుకోకపోవడం వల్ల ఈ దారుణ స్థితి ఉంది' డాక్టర్ అమిత్ సేన్ అన్నారు. ఢిల్లీకి చెందిన ఈ చైల్డ్ సైకియాట్రిస్ట్ పిల్లలకు ఎలాగైనా మానసిక చికిత్స అందించాలని 'చిల్డ్రన్ ఫస్ట్' అనే ఆన్‌లైన్ క్లినిక్‌ని నడుపుతున్నారు. కాని పల్లెటూరి పిల్లలకు ఇలాంటి సాయం ఉంటుందని కూడా తెలియడం లేదు అని వాపోయారాయన. వంద మంది పిల్లల్లో ఒక్కరే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు అని తెలిపారు.

పరీక్షల మేళాలు జరగాలి

'పరీక్షలంటే మార్కులు అని పిల్లల బుర్రల్లో ఎక్కించాం. కాని పరీక్ష రాస్తున్నాం అంటే ఏదో ఒకటి నేర్చుకునే అవకాశం వచ్చింది అనే భావన పిల్లల్లో ఎక్కించాలి. నేర్చుకుని, ఆ నేర్చుకున్నది చూపుదాం అని పిల్లలు అనుకోవాలి తప్ప మార్కులు చూపిద్దాం అనుకోకూడదు. నా దృష్టిలో పిల్లలు పరీక్షలు ఎంజాయ్ చేయాలంటే పరీక్షల మేళాలు జరగాలి. మైదానాల్లో రకరకాల పరీక్షలు రాసేందుకు పిల్లలను ఆహ్వానించాలి. అక్కడే ఆ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఉంచాలి. పురాణాలు, క్రీడలు, భౌగోళిక ప్రాంతాలు, ఆరోగ్యం... ఇలా అనేక అంశాల మీద పరీక్షలు అక్కడికక్కడ రాయించాలి. దాంతో పరీక్షల భయం పోతుంది' అన్నారు నిమ్‌హాన్స్ (బెంగళూరు) సీనియర్ చైల్డ్ సైకియాట్రిస్ట్ శేఖర్ శేషాద్రి. 'పిల్లలు ఏదైనా సమస్య చెప్పుకోవాలనుకున్నప్పుడు ముగ్గురు వారితో సున్నితంగా వ్యవహరించాలి. ఒకరు కుటుంబ సభ్యులు... రెండు స్కూల్ టీచర్లు... మూడు సమాజం అనే చుట్టుపక్కలవారు, బంధువులు. పిల్లలకు గౌరవం ఇవ్వాలి అని కూడా చాలామంది అనుకోరు' అన్నారాయన. 'చైల్డ్ అబ్యూజ్ జరిగినప్పుడు పిల్లలు వచ్చి చెప్పుకుంటే వారిని దగ్గరకు తీసుకోవాల్సింది పోయి... నువ్వే దీనికి కారణం అని నిందించే స్థితి ఉంది' అన్నారాయన.

కోవిడ్ చేసిన మేలు

'కోవిడ్ వల్ల తల్లిదండ్రులు, పిల్లలు ఇంట్లో ఎక్కువ రోజులు కలిసి ఎక్కువసేపు గడిపే వీలు వచ్చింది. అప్పటికి గాని మన దేశంలో పిల్లలు, తల్లిదండ్రులు ఒకరికి ఒకరు సంబంధం లేకుండా ఎలా జీవిస్తున్నారో పరస్పరం అర్థం కాలేదు. కోవిడ్ వల్ల బంధాలు బలపడ్డాయి. అది జరిగిన మేలు. అదే సమయంలో పిల్లల మానసిక సమస్యలు, ప్రవర్తనలు తల్లిదండ్రులకు తెలిసి వచ్చాయి. కాని వాటికి సరైన చికిత్స చేయించాలని మాత్రం అనుకోవడం లేదు' అన్నారు నేహా కిర్‌పాల్. ఈమె పిల్లల మానసిక చికిత్స కోసం 'అమాహ హెల్త్' అనే క్లినిక్‌ల వరుసను నడుపుతున్నారు.

'పిల్లల మానసిక ఆహ్లాదానికి కళలు చాలా ముఖ్యమని తెలుసుకోవాలి. ఇటీవల పిల్లల మానసిక సమస్యలకు ఆర్ట్స్ బేస్డ్ థెరపీలు బాగా ఉనికిలోకి వచ్చాయి' అని తెలిపారు వారు.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

● సేవాపథం



'అత్తమ్మ' అనే మాటలో 'అమ్మ' కూడా ఉంది. కనక ధార అలాంటి అత్తమ్మ. 'అత్తమ్మ' ఇచ్చిన స్ఫూర్తితో ధైర్యంగా ముందడుగు వేసిన లక్ష్మీ గౌతమ్ ఆమె పేరు మీద స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించి వితంతువుల నుంచి అనాథల వరకు ఎంతోమందికి అండగా నిలబడుతోంది.

బృందావన దేవదూత

ఉత్తర్‌ప్రదేశ్‌లోని పవిత్ర పట్టణమైన బృందావన్‌లోని యమునా నదిలో పవిత్ర స్నానాలు చేయడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారు. అలా వచ్చే వారిలో ఎవరికి ఏ సమస్య వచ్చినా లక్ష్మికి ఫోన్ చేస్తారు. 'నేను ఉన్నాను' అంటూ వారికి అండగా నిలబడుతుంది డా.లక్ష్మి. వితంతువులు, అనాథలు, నిరుపేదలకు ఆమె బృందావన దేవదూత.

బృందావన్ 'సిటీ ఆఫ్ విడోస్' అని పేరు తెచ్చుకుంది. దీనికి కారణం లక్ష్మి మాటల్లో చెప్పాలంటే...

'పశ్చిమ బెంగాల్‌తోపాటు మన దేశంలోని మారుమూల ప్రాంతాల్లో బాలవితంతువులు ఉన్నారు. కొద్దిమంది విషయంలో భర్త చనిపోయినా, వదిలి వెళ్లినా వారిని పట్టించుకునే వారు ఉండరు. ఈ నేపథ్యంలో వితంతువులకు సురక్షితమైన ఆశ్రమాలు ఉన్న పట్టణంగా బృందావన్ మారింది'

అయితే అందరి పరిస్థితి ఒకేలా లేదు.

కొంతమంది వితంతువులు ఇక్కడ కష్టాలు పడేవారు. కొన్ని సంవత్సరాల క్రితం దర్శనం కోసం బృందావన్‌కు వచ్చిన సుప్రీంకోర్టు న్యాయవాది ఒకరు వితంతువుల దుస్థితిని చూసి ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని వేశారు. అలా నియమించిన కమిటీలో లక్ష్మి కూడా ఉన్నారు. ఈ కమిటీలో భాగం కావడం ద్వారా వితంతువుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను లోతుగా తెలుసుకునే అవకాశం దొరికింది. వితంతువుల అంతిమ సంస్కారాలను ఎవరూ పట్టించుకోకపోవడం ఆమెను ఆవేదనకు గురిచేసింది.

బృందావనంలో ఏ ఒక్క వితంతువు కూడా దయనీయస్థితిలో చనిపోకూడదు. వారి కర్మకాండలు గౌరవప్రదంగా చేయాలనే ఉద్దేశంతో 'కనకధార' అనే స్వచ్ఛంద సంస్థ ప్రారంభించింది. 'కనకధార' అనేది ఆమె అత్తయ్య పేరు. మృదుభాషి అయిన తనను అత్తయ్య నలుగురి ముందు గట్టిగా మాట్లాడే ధైర్యాన్ని ఇచ్చింది.

'భర్త గుర్తింపు మీద ఆధారపడవద్దు. నీదైన గుర్తింపు తెచ్చుకో' అని చెప్పేది ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అత్తయ్య.

అత్తయ్య ప్రోత్సాహంతో లక్ష్మి పీహెచ్‌డీ చేసి అధ్యాపక వృత్తిలోకి వచ్చింది. వృత్తిని, స్వచ్ఛంద సంస్థ కార్యకలాపాలతో బ్యాలెన్స్ చేసుకోవడం అంత సులభం కాదు. అయితే సంకల్పబలం ఉన్న వాళ్లకు అదేమీ కష్టం కాదు. లక్ష్మీగౌతమ్ ఈ కోవకు చెందిన మహిళ.

'కనక ధార' స్వచ్ఛంద కార్యక్రమాలలో అత్తయ్యతోపాటు భర్త విజయ్ గౌతమ్ కూడా భాగం అయ్యారు. ఇప్పటివరకు లక్ష్మి వెయ్యి మందికి పైగా వితంతువుల అంతిమ సంస్కారాలు నిర్వహించింది. అంబులెన్స్ అవసరాల నుంచి ఫైనల్ డ్రెస్సింగ్ వరకు అన్నీ ఆమె చూసుకునేది.

కరోనా మహమ్మారి కాటేస్తున్న సమయంలో మధురలో 72 రోజుల పాటు వందలాది మంది అనాథలకు వండి వడ్డించేది. ఇంటి నుంచి పారిపోయి వచ్చిన యువతులకు మార్గదర్శనం చేయడంలో, అపహరణకు గురైన యువతులను రక్షించి అండగా నిలవడంలో 'కనక ధార' స్వచ్ఛంద సంస్థ సహాయపడుతోంది.

> వృత్తి జీవితాన్ని, సామాజిక సేవను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లేదాన్ని. సామాజిక సేవకు సంబంధించిన కార్యక్రమాలకు తప్ప వ్యక్తిగత పనుల కోసం సెలవుపెట్టే దాన్ని కాదు. ఒక వితంతువు చనిపోయిందని, మృతదేహాన్ని క్లెయిమ్ చేయకుండా అనాథలా పడి ఉందని ఒకరోజు ఫోన్ వచ్చింది. ఆ సమయంలో కాలేజీలో ఉన్నాను. వెంటనే ప్రిన్సిపల్‌ను అనుమతి అడిగి బయటికి వచ్చాను. బైకర్ నుంచి లిఫ్ట్ తీసుకొని ఘటన స్థలానికి చేరకున్నాను. అక్కడ ఎన్నో గంటల పాటు ఉండాల్సి వచ్చింది. అంబులెన్స్ ఏర్పాటు చేసి అంత్యక్రియలు చేశాను. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.
>
> – డా.లక్ష్మీ గౌతమ్

కాలేజీలో ఒకరోజు...



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ...

అను విశ్వనాథన్ ఇంజినీర్, ట్రయాథ్లెట్ (స్విమ్మింగ్, బైస్మిల్ రైడింగ్, రన్నింగ్), రైటర్, ఫిల్మ్ మేకర్. ఇప్పుడు స్టాండప్ కామెడీతో కూడా తన ప్రతిభను చాటుకుంటోంది. పిల్లలకు తల్లిగా తన అనుభవాలే 'బిఫోర్ చిల్డ్రన్: ఆఫ్టర్ డైపర్స్' (బీసి: ఏడీ). ఈ స్టాండప్ కామెడి షోతో నవ్వుల ప్రయాణాన్ని మొదలు పెట్టింది అను విశ్వనాథన్...

● మల్టీ టాలెంట్

సాహసాల నుంచి నవ్వుల వరకు



ఢిల్లీలో పుట్టిన అను విశ్వనాథన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ చేసింది. న్యూజిలాండ్‌లోని 'యూనివర్శిటీ ఆఫ్ కాంటర్‌బరీ'లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేసింది. 2008లో 'హాఫ్ ఐరన్ మ్యాన్ 70.3 క్లియర్ వాటర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్' కు అర్హత సాధించిన మొదటి భారతీయ మహిళగా, 2009లో 'అల్ట్రామాన్ కెనడా' ఈవెంట్‌ను పూర్తి చేసిన మొదటి ఆసియా మహిళగా ప్రత్యేకత చాటుకుంది. ఐఐఎం అహ్మదాబాద్, ఐఐటీ రోపర్‌లలో విజిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేసింది.

తన సాహసాలకు 'ఎనీ వేర్ బట్ హోమ్' పేరుతో పుస్తక రూపం ఇచ్చింది. ఈ పుస్తకానికి మంచి స్పందన లభించింది. సినిమా అవకాశాలు వచ్చాయి. పిల్లల తల్లిగా తన అనుభవాలను 'బిఫోర్ చిల్డ్రన్: ఆఫ్టర్ డైపర్స్'గా మలిచింది. ఈ స్టాండప్-కామెడీ షో ఘన విజయం సాధించింది.

'నవ్వించడం చాలా కష్టం' అంటున్న అను అందుకోసం 'కామిక్ పెర్‌ఫామెన్స్'లో శిక్షణ తీసుకున్న తరువాతే స్టేజీ మీద అడుగు పెట్టింది.

న్యూ మామ్స్‌లో సహజంగా ఉండే ఒత్తిడిని మాయం చేసి వారి మనసులను తేలిక చేయడంలో ఈ షో విజయం సాధించింది.

'తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఎన్నో జరుగుతుంటాయి. వాటిలో నుంచి కామెడీకి అవసరమైన ముడిసరుకు దొరుకుతుంది. మనం ఏదీ మరిచిపోవడం లేదుగానీ నవ్వును మాత్రం మరిచిపోతున్నాం. నవ్వు మనల్ని సంతోషంగానే కాదు చురుగ్గానూ ఉంచుతుంది. పిల్లలకు తల్లిగా నేను కొత్త జీవితాన్ని ప్రారంభించాను. పేరెంట్‌గా ప్రతి రోజూ ఒక కొత్త విషయం తెలుసుకోవచ్చు. ఒకవైపు పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు కామెడీ షో కోసం ప్రయాణాలు చేస్తుంటాను. ఈ విషయంలో నా కుటుంబం నాకు అండగా ఉండి ముందుకు నడిపిస్తోంది' అంటుంది అను విశ్వనాథన్.





విశ్రాంతి ఉద్యోగానికే... జీవితానికి కాదు!

ప్రతిరోజూ మనదే.
ప్రతిరోజునీ శ్వాసించాలి.
ప్రతిరోజునీ ఆఘ్రాణించాలి.
ప్రతిరోజునీ ఆస్వాదించాలి.
ప్రతిరోజుకీ జీవం ఉండాలి.
అప్పుడే...
జీవితం జీవంతో ఉంటుంది.
సంతోషాల సుమహారమవుతుంది.

'బోర్ కొడుతోంది' చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరి ముని పెదవుల మీద ఉంటుందీ మాట. పిల్లలను బోర్‌డమ్ నుంచి బయటేయడం సులువే. కానీ రిటైర్ అయిన వాళ్లను వేధించే బోర్‌డమ్‌కు పరిష్కారం ఎలా? వయసు పై బడేకొద్దీ... అలవాటు పడిన జీవితం నుంచి కొద్దిపాటి మార్పును కూడా స్వీకరించలేని మొండితనం ఆవరించేస్తుంటుంది. ఆ మొండితనం నుంచి బయటపడలేక అవస్థలు పడే వార్ధక్యానికి ఓ సమాధానం చెన్నమాధవుని అశోక్‌రాజు. విదేశాల్లో స్థిరపడిన పిల్లల దగ్గరకు వెళ్లిన తల్లిదండ్రులు 'మేమక్కడ ఉండలేకపోయాం. బోర్ కొట్టి చచ్చాం. ఒక్క రోజు ఒక్క యుగంలా గడిచింది' అనే వాళ్లకు సమాధానంగా అశోక్‌రాజు తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

కలప కరెంట్ స్తంభాలు

"మేము హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో విశ్రాంత జీవనం గడుపుతున్నాం. యూఎస్‌లోని రెడ్‌మాండ్‌లో మా పెద్దమ్మాయి, అల్లుడు, మనుమరాలు ఉన్నారు. గడచిన ఏడాది నేను, మా ఆవిడ వీణారాణి... పెద్దమ్మాయి దగ్గరకు వెళ్లి ఆరు నెలలు ఉండి డిసెంబర్‌లో ఇండియాకొచ్చాం. టూర్‌లో భాగంగా... యూఎస్‌లో టకోమా – సియాటెల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గాన రెడ్‌మాండ్‌కు చేరుకున్నాం. రోడ్డు వెడల్పుగా, ఇరువైపులా నిటారుగా పెరిగిన చెట్లతో పచ్చగా ఉన్నాయి పరిసరాలు. కర్రలతో నిర్మించిన ఇళ్లు చూడముచ్చటగా ఉన్నాయి. ఇంటి చుట్టూ ఎత్తుగా పెరిగిన చెట్లతో అడవిమధ్యలో ఇల్లు కట్టినట్లు ఉంది. ఇంటి నిర్మాణంలో మాత్రమే కాదు, విద్యుత్ స్తంభాలుగా కూడా కలపనే వాడతారు. బాగా ఎత్తుగా పెరిగిన చెట్లను కరెంట్ స్తంభాలుగా ఉపయోగిస్తారు. పైన్ లేక్, లేక్ వాషింగ్టన్, స్నో క్వాలమిన్ ఫాల్స్, విద్యుత్ ఉత్పాదన కేంద్రాలను చూశాం. ఓపెన్ ప్లేస్ మేరిమూర్ పార్క్‌లో సినిమా చూడడం మాకు విచిత్రమైన అనుభూతి. మన దగ్గర ఉన్నట్లు క్లోజ్‌డ్ థియేటర్ కాదది. బహిరంగ ప్రదేశంలో లాన్‌లో కుటుంబాలతో కూర్చుని స్నాక్స్ తింటూ, కూల్‌డ్రింకులు తాగుతూ సినిమా చూస్తుంటారు.

పాశ్చాత్యంలో మన పతంజలి యోగ

మెక్సికోలో ముఖ్యమైన పర్యాటక ప్రదేశం కంకూన్‌కెళ్లాం. అక్కడ క్లాస్ ప్యారడైజ్ క్లబ్... ఐదు వందలకు పైగా గదులున్న పెద్ద హోటల్. యూఎస్, కెనడా, బ్రెజిల్, యూకే నుంచి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. మన దగ్గర ఫైవ్ స్టార్ హోటళ్లలో జిమ్‌లుంటే... అక్కడ అతిథుల కోసం డెయిలీ రొటీన్‌లో యోగసాధన కూడా ఉంది. అక్కడి శిక్షకులు పతంజలి యోగ పుస్తకాన్ని ఆధారం చేసుకుని స్పానిష్ భాషలో వివరిస్తున్నారు. థియరీని మక్కీకి మక్కీ నేర్చుకుని అర్థమైనంతలో సాధ్యమైనంత వరకు ఆచరణలో పెడుతున్నారని అర్థమైంది. నాకున్న ముప్పై ఏళ్ల యోగ సాధన అనుభవంతో సీనియర్ సిటిజెన్ కోసం ఆరు రోజుల కోర్సు డిజైన్ చేసి నేర్పించాను. పవన ముక్తాసనం, మకరాసనం, సర్పాసనం, వజ్రాసనం, భుజంగాసనం, సూర్య నమస్కారాలతోపాటు ప్రాణాయామం, భస్త్రిక సాధనను కూడా వాళ్లు వీడియో తీసుకుని ఇకపై ఇలాగే సాధన చేస్తామని చెప్పారు. పర్యటన కోసం అక్కడికి వెళ్లిన భారతీయులకంటే పాశ్చాత్యులు, అక్కడ స్థిరపడిన భారతీయులు యోగసాధన పట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు.

శంకర నేత్రాలయ కోసం దాండియా

యూఎస్ పర్యటనలో కొన్ని రోజులు అట్లాంటాలో గడిపాం. అట్లాంటాలో ఉన్న రోజుల్లో నేను రోజూ జేమ్స్ క్రీక్ క్లబ్‌లో యోగసాధన చేసేవాడిని. అక్కడి వారి కోరిక మేరకు యోగాతోపాటు విపస్సన ధ్యాన ప్రక్రియ కూడా నేర్పించాను. అక్కడ ఉద్యోగ, వ్యాపారాల్లో భారతీయులు ఎక్కువగా ఉన్నారు. వాళ్లకు యోగ సాధన చేయాలని ఉన్నప్పటికీ టీచర్ లేకపోవడంతో ప్రాక్టీస్ చేయలేకపోయేవారు. 'అట్లాంటా విజిటర్స్ అసోసియేషన్' వాట్సాప్ గ్రూప్‌లో కనెక్ట్ అయ్యాం. అక్కడ చాలా విశాలమైన కమ్యూనిటీ హాల్ ఉంది. అందులో సమావేశపరిచి యోగ, విపస్సన నేర్పించాను. వీటన్నింటికంటే నాకు అత్యంత సంతృప్తినిచ్చిన విషయం ఏమిటంటే... సియాటెల్‌లోని మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో నవరాత్రి సందర్భంగా నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడం. ఎందుకంటే అది మనదేశంలో పేదవారికి ఉచితంగా వైద్యం అందించే సేవాసంస్థ 'శంకర్ నేత్రాలయ' కోసం ఫండ్ రైజింగ్ ప్రోగ్రామ్. పాశ్చాత్య గడ్డ మీద మన భారతీయులతో కలిసి దాండియా నాట్యం చేయడం, విదేశీయులకు నేర్పించడం, అది కూడా ఒక సామాజిక ప్రయోజనం కోసం కావడం నాకు సంతోషాన్నిచ్చింది. మనం ఎక్కడ ఉన్నా సరే... రోజును ఉపయుక్తంగా మలుచుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని నమ్ముతాను. అదే ఆచరణలో పెడతాను.

పని... చేసే వారికి ఎదురొస్తుంది!

ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాను. పెద్దమ్మాయి అమెరికా, చిన్నమ్మాయి ఆస్ట్రేలియాలో స్థిరపడడంతో రెండేళ్లకోసారి ఒక్కో అమ్మాయి దగ్గరకు వెళ్లడం అలవాటు చేసుకున్నాం. ఎక్కడ ఉన్నా నాకు బోర్ అనే మాట నా దగ్గరకు చేరదు. ఎందుకంటే మనిషి సంఘజీవి. ఏ సంఘంలో ఉంటే ఆ సంఘంతో మమేకమై జీవించాలనేది నా ఫిలాసఫీ. ఆస్ట్రేలియాలో ఉన్నప్పుడు అక్కడి వాళ్లతో కలిసి కమ్యూనిటీ ఫార్మింగ్ చేశాను. మా చిన్నల్లుడి సహకారంతో అక్కడి లైబ్రరీలో తెలుగు పుస్తకాలు పెట్టే ఏర్పాటు చేయగలిగాను. మనం ఖాళీగా ఉండకుండా ఎప్పుడూ ఏదో ఒక పని చేయడానికి సిద్ధంగా ఉంటే చాలు. అక్కడ మన అవసరం ఏమిటో, మనం మాత్రమే చేయగలిగిన పని ఏమిటో మనకు కనిపించి తీరుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే పని మనకు ఎదురొస్తుంది. అలా ఒక వ్యాపకంలో నిమగ్నమైతే చాలు. మన వల్ల మరొకరికి ప్రయోజనమూ కలుగుతుంది. మనకు రోజు నిర్వీర్యంగా గడిచిపోకుండా ఉపయుక్తంగా గడిచిన సంతోషమూ కలుగుతుంది" అన్నారు చెన్నమాధవుని అశోక్‌రాజు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



ఎక్స్టైల్లాకు యోగసాధనలో మెళకువలు నేర్పిస్తూ...



అశోక్‌రాజు



శంకర్ నేత్రాలయ ఫండ్ రైజింగ్ కోసం దాండియా ఆడుతూ...

పరుపు మార్చి ఎంతకాలం అయింది?



చాలామంది పరుపులను ఏళ్ల తరబడి వాడుతుంటారు. దీనివల్ల నడుం నొప్పి, వెన్ను నొప్పి లాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇవి రావొద్దంటే పరుపును సకాలంలో మార్చడం అవసరం. పరుపును ఎంత కాలానికి మార్చాలో తెలుసుకుందాం!

ఉదయం నిద్రలేచిన వెంటనే వెన్ను లేదా నడుము నొప్పి ఉంటే మీరు పడుకునే పరుపే అందుకు కారణమని గుర్తించండి. వెంటనే పరుపు మార్చాలి. పాత పరుపుపై సంవత్సరాల తరబడి పడుకుంటూ ఉండటం వల్ల చాలా అనర్థాలు సంభవిస్తుంటాయి. అందుకే పరుపులను కనీసం ఏడెనిమిదేళ్లకొకసారి మారుస్తూ ఉండాలి.

పరుపును ఎక్కువ రోజులు ఉపయోగించాలంటే ముందుగా దాని గలేబును కొనుగోలు చేయండి. దీని కారణంగా ఇది త్వరగా చెడిపోదు. అంతేకాదు, వీలయినంత తరచు పరుపును తిప్పి వేసుకుంటూ ఉండాలి. ఎందుకంటే ఒకేవైపు ఎక్కువ రోజులు పడుకుంటే అది దెబ్బతింటుంది.

బెడ్ షీట్లు, కుషన్ల మాదిరిగా బ్యాక్టీరియా పరుపులో చేరుతుంది. దానిని తొలగించడానికి పరుపు, బొంతలను 15 రోజులకు ఒకసారి ఎండలో వేయాలి లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించి శుభ్రం చేయాలి.

పరుపులనుంచి ఒక విధమైన చెడువాసన రావడం, పరుపు మొత్తం గుంటలు పడడం అది చెడిపోయిందనడానికి నిదర్శనం. ఇతర సమస్యలేమీ లేకుండా అలసి సొలసి పరుపు మీద చేరిన వెంటనే నిద్ర రాకపోతే పరుపులు మార్చి చూడండి.

మీకు తెలుసా?

పెయిన్ కిల్లర్స్ వాడకం ఆరోగ్యానికి అంత మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. తక్షణ ఉపశమనం కోసం మనం వాటిని వాడుతుంటాం. కానీ దీనివల్ల భవిష్యత్‌లో తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా వాడటం వల్ల జీర్ణవ్యవస్థపై చెడు ప్రభావం పడుతుంది. దీర్ఘకాలంలో ఎసిడిటీ వంటి సమస్యలను కలిగిస్తుంది. చాలా పెయిన్ కిల్లర్‌లు కిడ్నీలపై చెడు ప్రభావం చూపుతాయి. ఇవి కిడ్నీల పనితీరుని దెబ్బతీస్తాయి. నొప్పి నివారణిలు అధికంగా వాడడం వల్ల కొంత కాలానికి ఔషధాలు తీసుకున్నా అవి పనిచేయవు. అందుకే ఏ పెయిన్ కిల్లర్ అయినా డాక్టర్ సలహా లేకుండా ఎక్కువకాలం వాడటం మంచిది కాదు.

మసాలాతో షుగర్ అదుపు

షుగర్, బీపీ వంటి జీవనశైలికి సంబంధించిన రుగ్మతలు వస్తే జీవితాంతం కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అసవరం. ఆహారంలో ఉప్పు, చక్కెరలు తగ్గించి తీసుకోవడంతోబాటు ఇతర జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. వీటితోపాటు మన వంటింట్లో దొరికే కొన్ని రకాల మసాలా దినుసులను తీసుకోవడం ద్వారా డయాబెటిస్‌ను అదుపులో ఉంచవచ్చు. అవేమిటో తెలుసుకుందాం.

అధికంగా దాహం వేయడం, ఆకలి, తరచు మూత్రవిసర్జన చేయవలసి రావడం, బరువు తగ్గడం, చూపు మసకబారడం, చేతులు, కాళ్ళు తిమ్మిరిగా ఉండడం, గాయాలైనప్పుడు త్వరగా మానకపోవడం వంటి కొన్ని లక్షణాలను బట్టి షుగర్‌ను గుర్తించవచ్చు. ఇది అదుపులో ఉండకపోతే కాలేయం, మూత్రపిండాలు, గుండె, మెదడు, కంటికి సంబంధించిన సమస్యలొస్తాయి. అయితే, బ్లడ్ షుగర్‌ని నియంత్రణలో ఉంచే కొన్ని మసాలా దినుసులున్నాయి. వాటిని సక్రమంగా వాడటం వల్ల ఎటువంటి ఇతర దుష్ఫలితాలూ లేకుండా షుగర్‌ను అదుపులో ఉంచవచ్చు.




దాల్చిన చెక్క

ఆహార పదార్థాలకు సువాసనను, రుచిని ఇచ్చే దాల్చిన చెక్క జీవక్రియల వేగాన్ని పెంచడానికి దోహదపడుతుంది. కొన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో దీనిని విరివిగా వాడతారు. దాల్చిన చెక్క ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. దీనిని కషాయంలా చేసుకుని తాగడం మంచిది.



మిరియాలు

మిరియాలు, వాటి ఆకుల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉంటాయి. ఇవి రక్తం లో ఇన్సులిన్ సీరమ్‌ని పెంచుతాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయులను అదుపు చేయడంలో సహకరిస్తాయి. వీటిని ఏదో ఒక విధంగా ఆహారంలో చేర్చుకోవడం మంచిది. కుదరని పక్షంలో మిరియాల పొడిని గోరువెచ్చని నీటిలో కలిపి తాగొచ్చు.



మెంతులు

మధుమేహాన్ని అదుపు చేసి, బరువు తగ్గించడంలో మెంతులు బాగా పని చేస్తాయి. వీటిని తీసుకోవడం జుట్టుకి కూడా మంచిది. ఉదయాన్నే పరగడపున మెంతులు నానబెట్టిన నీటిని తాగితే డయాబెటిస్ అదుపులోకి వస్తుంది. ఇందులోని పీచుపదార్థం, కర్కుమిన్లు రక్తంలో చక్కెరస్థాయులను తగ్గిస్తాయి.



యాలకులు

పరమాన్నానికి, ఇతర రకాల స్వీట్లకు యాలకుల పొడిని జత చేస్తే వచ్చే రుచే వేరు. పచ్చి యాలకులని మనం బిర్యానీ, టీలో కలిపి తాగొచ్చు. ఇందులో ఎక్కువగా ఔషధ గుణాలు ఉన్నాయి. యాలకులని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయులు తగ్గుతాయి. ఇది లివర్ పని తీరును మెరుగు పరుస్తుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది.



జీలకర్ర

డయాబెటిస్ లక్షణాలను, ప్రభావాలను జీలకర్ర తగ్గిస్తుంది. యాంటీడయాబెటిక్ ఔషధాల్లో కూడా దీనిని వినియోగిస్తారు. ఇన్సులిన్‌కు మీ శరీరం స్పందించే తీరును ప్రభావితం చేస్తే యూరియా స్థాయిని కూడా ఈ జీలకర్ర తగ్గిస్తుందని పరిశోధకులు తేల్చారు. అంతేకాకుండా రక్తంలో బ్లడ్ షుగర్ స్థాయి నార్మల్ రేంజ్‌లో ఉండేలా చేస్తుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. అందువల్ల ఆహారంలో జీలకర్రను విరివిగా ఉపయోగించాలి. రోజూ ఒక స్పూను జీలకర్రను గ్లాసు నీటిలో నానబెట్టి ఆ నీటిని వడగట్టి తాగడం మధుమేహులకు మంచి మందులా పని చేస్తుంది.



లవంగాలు

షుగర్ వ్యాధిగ్రస్తులు లవంగాలను వాడటం వల్ల రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా ఆహారంలో లవంగాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గుతాయి. అలాగే కీళ్ల నొప్పులు ఉన్నప్పుడు లవంగం నూనెను పై పూతగా రాయడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. మధుమేహం ఉన్న వారు రోజు విడిచి రోజు లవంగాలతో చేసిన టీ తాగడం సత్ఫలితాలనిస్తుంది.

పైన చెప్పుకున్న మసాలా దినుసులను ఆహారంలో భాగంగా వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్ఫలితాలూ లేకండా డయాబెటిస్ అదుపులో ఉంటుంది.

గార్డెనింగ్



మొక్కలకు జీవకళ

ఇంటి కుండీలలో లేదా పెరటి తోటలో పెంచే మొక్కలు ఒక్కొక్కసారి ఎండి పోతుంటాయి. ఎండిన చెట్లు చిగురించాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అసలు చెట్లు ఎందుకు ఎండిపోవడానికి నీరు లేక, మరే ఇతర కారణమా అనేది గుర్తించాలి. నీరు తక్కువైనప్పుడే కాదు.. నీరు ఎక్కువగా ఉన్నా చెట్లు ఎండిపోతుంటాయి. కాబట్టి, అలా లేకుండా చూడండి. త్వరలో వసంత రుతువు రాబోతోంది. మీ పెరటి తోటలో లేదా ఇంటి కుండీలలో ఉన్న చెట్లను సంరక్షించుకోవడం ఇప్పటినుంచే ఆరంభిస్తేనే కదా అప్పటికి చక్కగా చిగిర్చి పూలు పూసేది! ఇంకెందుకాలస్యం? చూసేద్దామా మరి!

మొక్కలు సాధారణంగా పురుగుల కారణంగా అనేక తెగుళ్ళ బారిన పడుతుంటాయి. అప్పుడు ఎండి, వాడిపోతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు వాటిని కాపాడుకోవాలి. ఆకులపై దుమ్ము, ధూళి పేరుకుపోయినా అవి కళ తప్పుతాయి. అందువల్ల వాటిని నీటితో శుభ్రంగా కడిగేయాలి. ఇందుకు చిన్న పాటి పైపు లేదా స్ప్రేయర్ ఉపయోగపడుతుంది.

సూర్యకాంతి...

చెట్లకి సరైన కాంతి అవసరం. అలాగని మరీ ఎండలో కూడా ఉంచరాదు. లేదా బాగా చీకటి ఉన్న ప్రదేశంలో ఉంచడమూ సరికాదు. ఎండ పొడ పడే ప్రదేశంలోనే కుండీలని ఉంచాలి లేదా చెట్లని పెంచాలి.

కుండీల పరిమాణం...

కుండీలో పెంచే మొక్క తీరును బట్టే కుండీని ఎంచుకోవాలి. చెట్ల కుండీలు అవి పెరగడానికి సరిపడనంత లేకుండా చిన్నగా ఉన్నా చెట్లు ఎండిపోవడానికి కారణమవుతాయి. కాబట్టి, సరైన పరిమాణంలో ఉన్న కుండీల్లో పెంచడం మేలు.

మొక్కలని శుభ్రం చేయడం...

దెబ్బతిన్న, ఎండిన, పండిన ఆకులని ఎప్పటికప్పుడు తుంచి శుభ్రం చేయాలి. వీటిని కత్తెరతో కత్తిరించడం మంచిది. తెగులు సోకిన కొమ్మలను, ఆకులని తుంచడం వల్ల మొక్కలు చక్కగా పెరుగుతాయి.

ఎరువులు...

ఎరువు లేకుండా పెంచడం వల్ల చెట్లు నిస్తేజంగా... సారం లేనట్లు... వడలిపోయినట్లు కనిపిస్తాయి. అందువల్ల వాటికి అప్పుడప్పుడు ఎరువులు వేయాలి. అప్పుడే మొక్కలు చక్కగా పెరుగుతాయి. వీలయినంత వరకు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులను వాడటం మంచిది. బియ్యం, పప్పులు కడిగిన నీళ్లని పోయడం, ఉల్లిపొట్టు, కూరగాయల తొక్కలు వంటి వంటింటి వ్యర్థాలతో ఎరువులు తయారు చేసే ఉపకరణాలు ఇప్పుడు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. వాటి సాయంతో తయారు చేసిన ఎరువులు వాడటం వల్ల వాటికే కాదు, అవి తినే మన ఆరోగ్యానికి కూడా మంచిది.

సినిమా




● చిరంజీవి

విశ్వంభర డేట్ ఫిక్స్

సంక్రాంతి రిలీజ్ డేట్‌ను కన్ఫార్మ్ చేసుకున్నాడు 'విశ్వంభర'. చిరంజీవి హీరోగా రూపొందుతున్న ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. గత ఏడాది నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. తొలుత చిరంజీవి పాత్రకు సంబంధించని సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'విశ్వంభర' సినిమా సెట్స్‌లో ఈ శుక్రవారం చిరంజీవి జాయిన్ అయినట్లుగా చిత్ర యూనిట్ పేర్కొని, ఈ సినిమాను జనవరి 10న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని కూడా చిత్రబృందం పేర్కొంది.

వేసవిలో ఫ్యామిలీ స్టార్



వేసవిలో థియేటర్స్‌కు వచ్చేందుకు రెడీ అయ్యాడు 'ఫ్యామిలీ స్టార్'. 'గీత గోవిందం' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ–దర్శకుడు పరశురామ్ పెట్ల కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఫ్యామిలీ స్టార్'. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కాగా 'ఫ్యామిలీ స్టార్'ను ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 5న విడుదల కావాల్సిన హీరో ఎన్టీఆర్–దర్శకుడు కొరటాల శివల 'దేవర' సినిమా వాయిదా పడటం వల్లే విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్' మూవీ ఆ తేదీన విడుదలకు రెడీ అవుతున్నట్లుగా తెలుస్తోంది.

● విజయ్ దేవరకొండ



● అల్లు అర్జున్

చలో జపాన్

జపాన్ వెళ్లనున్నారట పుష్పరాజ్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'పుష్ప'. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఆల్రెడీ సూపర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్' తీస్తున్నారు మేకర్స్. ఈ సినిమా చిత్రీకరణ హైదారాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో జరుగుతోంది. జాతర నేపథ్యంలోని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను జపాన్‌లో ప్లాన్ చేశారట. ఓ ప్రధాన యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ అక్కడి లొకేషన్స్‌లో జరుగుతుందని ఫిల్మ్‌నగర్ టాక్. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది.



● వెంకటేశ్

కాంబినేషన్ రిపీట్?

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల (వరుణ్ తేజ్ మరో హీరో) కోసం కలిసి పని చేసిన హీరో వెంకటేశ్–దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మరో మూవీ తెరకెక్కనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవల అనిల్ రావిపూడి ఓ కథను వెంకటేశ్‌కు వినిపించారట. ఈ కథ బాగా నచ్చడంతో వెంకీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. 'దిల్' రాజు ఈ సినిమాను నిర్మించనున్నారని సమాచారం. అయితే వెంకటేశ్–అనిల్ రావిపూడి కాంబినేషన్‌లోని సినిమా 'ఎఫ్ 4' అవుతుందా? లేక వేరే కొత్త కథా? అనే విషయాలపై స్పష్టత రావాల్సింది. మరి... వెంకటేశ్–అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా సెట్స్ పైకి వెళ్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.



● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

చిన్నారి మల్లె తీగ...

''చిన్నారి మల్లె తీగ చేమంతి పువ్వులాగుంది... సిగ్గూరే బుగ్గ పైన చక్కాని చుక్క బాగుంది'' అంటూ సాగే సెలబ్రేషన్ సాంగ్ 'తిరగబడర సామీ' చిత్రంలోనిది. రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన సినిమా ఇది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఓ వేడుక నేపథ్యంలో సాగే 'చిన్నారి మల్లె తీగ..' పాట లిరికల్ వీడియోను షేర్ చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు జేబీ నేతృత్వంలో సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటను లిప్సికా భాష్యం, అదితీ బావరాజు, చైతు సత్సంగి పాడారు. ఈ చిత్రంలో మన్నారా చోప్రా, మకరంద్ దేశ్‌పాండే, రఘుబాబు, జాన్ విజయ్, అంకిత ఠాకూర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



బ్లడ్ అండ్ బ్యాటిల్

శింబు హీరోగా దేశింగు పెరియస్వామి దర్శకత్వంలో రూపొందిన సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడైంది. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు కమల్‌హాసన్. 'బ్లడ్ అండ్ బ్యాటిల్' అనే క్యాప్షన్ కూడా ఇచ్చారు. నేడు (శనివారం) శింబు బర్త్ డే. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ కలిసి ఈ పీరియాడికల్ వార్ డ్రామాను తెరకెక్కిస్తున్నారు. పోస్టర్‌ని బట్టి ఈ చిత్రంలో శింబు ద్విపాత్రాభినయం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. హీరో, విలన్.. ఈ రెండు పాత్రలనూ శింబుయే చేస్తున్నట్లు కోలీవుడ్ సమాచారం.

పార్టీ వల్ల యువతకు నష్టమే

క్రిష్ సిద్ధిపల్లి హీరోగా, రితికా చక్రవర్తి హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'రేవ్ పార్టీ'. ఐశ్వర్యా గౌడ ఓ కీలక పాత్రలో నటించారు. రాజు బొనగాని స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. జయరామ్ దేవ సముద్ర మరో నిర్మాత. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్‌ను ప్లాన్ చేస్తున్నారు. ''క్షణం' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా, 'గూఢచారి, టైగర్ నాగేశ్వరరావు' చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. హీరోగా 'నేను లేని నా ప్రేమకథ' నా తొలి చిత్రం. ఇప్పుడు మరో మంచి కథతో 'రేవ్ పార్టీ'లో హీరోగా నటించాను'' అన్నారు క్రిష్. ''రేవ్ పార్టీల వల్ల యువతకు జరిగే నష్టం ఏంటి? అనే అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● క్రిష్ సిద్ధిపల్లి, రితికా చక్రవర్తి

నటి పూనమ్ పాండే మృతి?



ప్రముఖ మోడల్, బాలీవుడ్ నటి పూనమ్ పాండే (32) కన్నుమూశారనే వార్త శుక్రవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పూనమ్ తుది శ్వాస విడిచినట్లు ఆ వార్త సారాంశం. సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్) క్యాన్సర్ కారణంగా పూనమ్ మృతి చెందారనే వార్త వైరల్ అయింది. ''ఈ రోజు (శుక్రవారం) చాలా కఠినమైనది. సర్వైకల్ క్యాన్సర్ కారణంగా మా ప్రియమైన పూనమ్ పాండే తుది శ్వాస విడిచారు'' అంటూ పూనమ్ పాండే సిబ్బంది ఆమె ఇన్‌స్టాగ్రామ్ అధికారిక హ్యాండిల్‌లో షేర్ చేశారు. అయితే పూనమ్ కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. వాళ్లెవరూ మీడియాకి అందుబాటులోకి రాలేదు. మరోవైపు పూనమ్ మృతి పట్ల తమకెలాంటి సమాచారం లేదని కాన్పూర్ పోలీసులు చెప్పినట్లు బాలీవుడ్ వర్గాల భోగట్టా. అయితే నాలుగు రోజుల క్రితం పూనమ్ ఓ పార్టీలో చలాకీగా పాల్గొన్న వీడియోను షేర్ చేస్తూ, మృతి వార్త అబద్ధమని ఆమెతో పాటు ఆ పార్టీలో పాల్గొన్నవారు అంటున్నారు. ఇదంతా ప్రచారంలో భాగంగానే జరిగిన తంతుగా కొందరు పేర్కొన్నారు. ఆదివారం 'వరల్డ్ క్యాన్సర్ డే' ప్రచారం కోసం ఈ ఫేక్ వార్త సృష్టించారన్నది పలువురి వ్యాఖ్య.

సాక్షి బిజినెస్
శనివారం
3-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	440	72,086
నిఫ్టీ ▲	156	21,854

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,637	▲ 277
డోజోన్స్	38,587	▲ 67
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,616	▼ 7
డాక్స్	16,918	▲ 59
షాంఘై	2,730	▼ 41
నికాయ్	36,158	▲ 147

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,142	▲ 543
బంగారం (99.5 స్వచ్ఛత)	62,889	▲ 505
వెండి (కిలో)	71,864	▲ 1,021

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.52	83.54
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	107.13
€	యూరో	ఎస్‌బీఐ	89.12	91.48
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.10	57.38
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.74	55.71
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.01	64.26
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.16	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.68	23.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.43	12.50

ఇండిగో లాభం రెట్టింపు

క్యూ3లో రూ. 2,998 కోట్లు



న్యూఢిల్లీ: విమానయాన రంగ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 2,998 కోట్లను అధిగమించింది. వెరసి వరుసగా ఐదో త్రైమాసికంలోనూ లాభదాయక పనితీరును ప్రదర్శించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,423 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 15,410 కోట్ల నుంచి రూ. 20,062 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 15.4 శాతం నికర లాభ మార్జిన్లు ఆర్జించినట్లు ఇండిగో బ్రాండు విమానయాన సేవల కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. వరుసగా ఐదు క్వార్టర్లపాటు లాభాలు సాధించడంతో కోవిడ్–19 కారణంగా నమోదైన నష్టాల నుంచి రికవర్ అయినట్లు తెలియజేశారు. సానుకూల నెట్‌వర్త్‌కు చేరినట్లు వెల్లడించారు. ఈ క్యూ3లో ప్రయాణికుల టికెట్ ఆదాయం 30 శాతం పైగా జంప్‌చేసి రూ. 17,157 కోట్లను తాకగా.. అనుబంధ విభాగాల నుంచి 24 శాతం అధికంగా రూ. 1,760 కోట్లు లభించినట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు బీఎస్‌ఈలో 2 శాతం పుంజుకుని రూ. 3,127 వద్ద ముగిసింది.

ఈఫిల్ సందర్శనకు యూపీఐతో చెల్లింపులు

ఫ్రాన్స్ సంస్థ లైరాతో ఎన్‌పీసీఐ జట్టు

ముంబై: ఇకపై ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్‌ను సందర్శించాలనుకునే దేశీ పర్యాటకులు భారత్‌లో రూపొందిన యూపీఐ (ఏకీకృత చెల్లింపుల విధానం) ద్వారా చెల్లించి, ట్రిప్‌ను బుక్ చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి ఫ్రాన్స్‌కి చెందిన ఈ–కామర్స్ దిగ్గజం లైరాతో ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ (ఎన్‌ఐపీఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో భారత టూరిస్టులు యూపీఐ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి, ఆన్‌లైన్‌లో ఈఫిల్ టవర్ సందర్శన టికెట్లను బుక్ చేసుకోవచ్చని ఎన్‌ఐపీఎల్ తెలిపింది.



రూ.29కే కిలో బియ్యం

- రిటైల్‌గా భారత్ రైస్ విక్రయాలు
- వచ్చే వారమే ప్రారంభం
- ధరల కట్టడే ప్రథమ ప్రాధాన్యం
- కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి చోప్రా



న్యూఢిల్లీ: బియ్యం ధరలు భగ్గుమంటున్న తరుణంలో కేంద్ర సర్కారు దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా సామాన్యులకు ఉపశమనం కల్పించేందుకు 'భారత్ రైస్' పేరిట వచ్చే వారం నుంచి కిలో బియ్యాన్ని రూ.29కే రిటైల్ మార్కెట్లో విక్రయించనుంది. 5కిలోలు, 10 కిలోల బ్యాగుల్లో ఇవి లభించనున్నాయి. అలాగే, ట్రేడర్లు తమవద్దనున్న బియ్యం/వడ్ల నిల్వలను ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ విషయాన్ని కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా ప్రకటించారు. ఈ రెండు చర్యలకు తోడు, బియ్యం ఎగుమతులపై ఆంక్షలతో ధరలు దిగొస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సహేతుక స్థాయికి ధరలు దిగొచ్చేంత వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. బియ్యం ధరలు గడిచిన ఏడాది కాలంలో 15 శాతానికి పైగా పెరిగిపోవడం తెలిసిందే. ధరలను కిందకు తీసుకురావడమే ప్రభుత్వం ముందున్న ప్రథమ ప్రాధాన్యమని చోప్రా చెప్పారు. సబ్సిడీ ధరలపై భారత్ రైస్‌ను కిలో రూ.29 చొప్పున నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (నాఫెడ్), నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్‌సీసీఎఫ్), కేంద్రీయ భండార్ రిటైల్ దుకాణాల ద్వారా విక్రయిస్తామని తెలిపారు. ఈ కామర్స్ సంస్థలను సైతం భారత్ రైస్ విక్రయాలకు వినియోగించుకుంటామన్నారు. తొలి దశలో రిటైల్ విక్రయాలకు 5 లక్షల టన్నుల బియ్యాన్ని కేటాయించినట్టు చెప్పారు.

నిల్వలు ఉన్నా ధరలకు రెక్కలు

దేశీ మార్కెట్లో, ప్రభుత్వం వద్ద బియ్యం మిగులు నిల్వలు ఉన్నప్పటికీ ధరలు పెరుగుతున్నట్టు సంజీవ్ చోప్రా తెలిపారు. తాము ఇచ్చిన ఆదేశాలతో వ్యాపార సంస్థలు బియ్యం నిల్వలను మార్కెట్లోకి విడుదల చేస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ, దీంతో ధరలు దిగొస్తాయన్నారు. బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులను కేంద్రం నిషేధించగా, పారాబాయిల్డ్ రైస్ ఎగుమతులపై 20% సుంకం అమలు చేస్తోంది. అవసరమైతే బియ్యం నిల్వలపైనా ఆంక్షలు, పారాబాయిల్డ్ రైస్ ఎగుమతులు నిషేధించడాన్ని పరిశీలిస్తామని చోప్రా చెప్పారు.

ఫిబ్రవరి తర్వాత కూడా యథావిధిగా పేటీఎం సేవలు

సీఈవో విజయ్ శేఖర్ శర్మ వెల్లడి

న్యూఢిల్లీ: పేటీఎం సేవలు ఈ నెల (ఫిబ్రవరి) 29 తర్వాత కూడా యథావిధిగానే కొనసాగుతాయని డిజిటల్ పేమెంట్స్, సేవల సంస్థ పేటీఎం సీఈవో విజయ్ శేఖర్ శర్మ తెలిపారు. నిబంధనలను పూర్తిగా పాటిస్తూ దేశానికి సేవలందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో శర్మ పోస్ట్ చేశారు.



నిబంధనల ఉల్లంఘనలకు గాను పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) ఫిబ్రవరి 29 తర్వాత నుంచి డిపాజిట్లు, టాపప్ వంటి పలు సర్వీసులను నిలిపివేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌కి (ఓసీఎల్) పీపీబీఎల్‌లో 49% వాటాలు ఉన్నాయి. ఆర్‌బీఐ ఆదేశాల కారణంగా పేటీఎం కార్యకలాపాలపై కూడా ప్రభావం ఉంటుందని అంచనాలు నెలకొన్న నేపథ్యంలో శర్మ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, పేటీఎం సౌండ్‌బాక్స్ వంటి సర్వీసులు అందించే ఆఫ్‌లైన్ వ్యాపారులపై ఆర్‌బీఐ ఆదేశాల ప్రభావం ఉండబోదని పేటీఎం తెలిపింది. తమ ప్లాట్‌ఫాంపై కొత్త వ్యాపారులను చేర్చుకునే ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది.

నిఫ్టీ కొత్త రికార్డ్

- మళ్లీ 72 వేల స్థాయికి సెన్సెక్స్
- రాణించిన రిలయన్స్, ఐటీ షేర్లు
- కలిసొచ్చిన ప్రపంచ మార్కెట్ల రికవరీ
- ఇంట్రాడేలో 2% ర్యాలీ
- బ్యాంకులు, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో శుక్రవారం నిఫ్టీ కొత్త రికార్డు సృష్టించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీ స్టాకులు రాణించడంతో ఇంట్రాడేలో 429 పాయింట్లు ఎగసి 22,127 స్థాయి వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న స్టాక్ సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆయిల్అండ్‌గ్యాస్, ఇంధన, మెటల్, సర్వీసెస్, యుటిలిటీ, ఐటీ, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ప్రథమార్థంలో 2% ర్యాలీ చేశాయి. నిఫ్టీ ఆల్‌టైం హై(22,127)ని నమోదు చేయగా..., సెన్సెక్స్ 1444 పాయింట్లు దూసుకెళ్లి 73,089 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే మిడ్‌సెషన్ నుంచి ఆయిల్ అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్ 440 పాయింట్లు లాభపడి 72,086 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156 పాయింట్లు పెరిగి 21,854 వద్ద నిలిచింది. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.80%, 0.50% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.71 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,463 కోట్ల షేర్లు కొన్నారు. నాస్‌డాక్‌లో ఐటీ షేర్ల ర్యాలీ ప్రభావం గురువారం రాత్రి అమెరికా మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభంతో ముగిశాయి. దీంతో శుక్రవారం ఆసియా, యూరప్ స్టాక్ సూచీలు 0.5–1% మేర పెరిగాయి.

- ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో భాగంగా సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్టం(73,089) నుంచి ఏకంగా 1004 పాయింట్లు, నిఫ్టీ జీవితకాల గరిష్ట స్థాయి(22,127) నుంచి 273 పాయింట్లు నష్టపోయాయి. ఇక ఈ బడ్జెట్ వారంలో సెన్సెక్స్ 1,385 పాయింట్లు, నిఫ్టీ 502 పాయింట్లు చొప్పున ఆర్జించాయి.
- సెన్సెక్స్ 441 పాయింట్లు లాభపడటంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.34 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్టం రూ.382 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది.
- కేంద్రం బడ్జెట్‌లో పర్యావరణ అనుకూల ఇంధనాలకు ప్రాధాన్యత నివ్వడం, అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 80 డాలర్ల దిగువకు చేరుకోవడం ఇంధన షేర్లకు కలిసొచ్చింది. బీపీసీఎల్ 10%, ఐఓసీ 8%, హిందుస్థాన్ పెట్రోలియం 5%, ఓఎన్‌జీసీ 4%, కోల్ ఇండియా 3% లాభపడ్డాయి.
- ఇంధన షేర్లలో భాగంగా రిలయన్స్ షేరు 2% పెరిగి రూ.2915 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 3.33% ర్యాలీ చేసి రూ.2950 వద్ద జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. మార్కెట్ విలువ రూ. 41,860 కోట్లు పెరిగి రూ.19.72 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది.
- పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) ఫిబ్రవరి 29 తర్వాత నుంచి డిపాజిట్లు, టాపప్ వంటి పలు సర్వీసులను నిలిపివేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశించిన నేపథ్యంలో వరుసగా రెండోరోజూ పేటీఎం షేరు 20% లోయర్ సర్క్యూట్ తాకింది. బీఎస్‌ఈలో శుక్రవారం 20% పతనమై రూ.487 వద్ద ముగిసింది.

టాటా మోటార్స్ లాభం జూమ్

- క్యూ3లో రూ. 7,100 కోట్లు
- క్యూ4లో మరింత మెరుగు!

న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 133 శాతం దూసుకెళ్లి రూ. 7,100 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 3,043 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 25 శాతం ఎగసి రూ. 1,10,600 కోట్లకు చేరింది. ఆటో విభాగంలోనూ మూడు రకాల బిజినెస్‌లూ సానుకూల పనితీరును చూపినట్లు టాటా మోటార్స్ పేర్కొంది. సీజనాలిటీ నేపథ్యంలో ఈ ఏడాది క్యూ4(జనవరి–మార్చి)లోనూ మరింత మెరుగైన ఫలితాలను సాధించే వీలున్నట్లు అంచనా వేసింది. ఇందుకు కొత్త ప్రాడక్టుల విడుదల, మెరుగైన సరఫరాలు తోడ్పాటునివ్వనున్నట్లు తెలియజేసింది. వాణిజ్య వాహన(సీవీ) ఆదాయం 19 శాతం వృద్ధితో రూ. 20,100 కోట్లను తాకింది. దేశీ సీవీ విక్రయాలు 1 శాతం వృద్ధితో 91,900 యూనిట్లకు చేరగా.. ఎగుమతులు 14 శాతం ఎగసి 4,800 యూనిట్లుగా నమోదయ్యాయి. ప్రయాణికుల వాహన అమ్మకాలు 5 శాతం పుంజుకుని 1,38,600 యూనిట్లకు చేరాయి. ఆదాయం 11 శాతం అధికమై రూ. 12,900 కోట్లను తాకింది. బ్రిటిష్ అనుబంధ కంపెనీ జేఎల్ఆర్ ఆదాయం 22 శాతం జంప్‌చేసి 7.4 బిలియన్ పౌండ్లకు చేరింది.



తగ్గిన రుణ భారం

ప్రస్తుత సమీక్షా కాలంలో కంపెనీ నికర రుణ భారాన్ని రూ. 9,500 కోట్లమేర తగ్గించుకోవడంతో రూ. 29,200 కోట్లకు చేరుకున్నట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. నిర్వహణ లాభ(ఇబిట్) మార్జిన్లు రెట్టింపునకుపైగా బలపడి 8.8 శాతాన్ని తాకినట్లు వెల్లడించింది. ప్రణాళికలకు అనుగుణంగా రుణ తగ్గింపు లక్ష్యాన్ని సాధించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. విభిన్న వ్యూహాల ఆధారంగా చేపడుతున్న బిజినెస్ నిర్వహణ సంతృప్తికర ఫలితాలను చూపుతున్నట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ పేర్కొన్నారు. పూర్తి ఏడాదిని పటిష్ట పనితీరుతో ముగించనున్నట్లు అభిప్రాయపడ్డారు. రానున్న త్రైమాసికాలలోనూ రుణ భారాన్ని తగ్గించుకోవడంతోపాటు.. మెరుగైన ఫలితాలను కొనసాగించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 879 వద్దే ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



సీజన్ 100వ మ్యాచ్‌లో బెంగాల్ విజయం

ప్రొ కబడ్డీ లీగ్ 10వ సీజన్‌లో భాగంగా శుక్రవారం ఢిల్లీలో 100వ మ్యాచ్ జరిగింది. ఈ పోరులో బెంగాల్ వారియర్స్ 45–38 పాయింట్ల స్కోరుతో దబంగ్ ఢిల్లీపై విజయం సాధించింది. బెంగాల్ తరఫున నితిన్ కుమార్ 13 పాయింట్లతో అగ్రస్థానాన నిలవగా, కెప్టెన్ మణీందర్ సింగ్ 11 పాయింట్లు సాధించాడు. దబంగ్ ఢిల్లీ ఆటగాళ్లలో కెప్టెన్ అషు మలిక్ 17 పాయింట్లతో చెలరేగినా... ఇతర ఆటగాళ్ల వైఫల్యంతో జట్టుకు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 34–30 తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. హరియాణా ఆటగాళ్లలో వినయ్ 9 పాయింట్లు రాబట్టగా... మోహిత్ నందల్, మోహిత్ చెరో 4 పాయింట్లు సాధించారు. గుజరాత్ తరఫున ఫజల్ అత్రచలి, పార్తీక్ దహియా చెరో 7 పాయింట్లు స్కోర్ చేయగా, దీపక్ సింగ్ 5 పాయింట్లు రాబట్టాడు. ఈ సీజన్‌లో 101 మ్యాచ్‌లు ముగించిన తర్వాత 71 పాయింట్లతో జైపూర్ పింక్ పాంథర్స్ అగ్రస్థానాన్ని పటిష్టపర్చుకుంది.

'యశస్వీభవ'

యశస్వి జైస్వాల్ 179 నాటౌట్
తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 336/6
ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

తొలి రోజు 336 పరుగులు చేసిన తర్వాత కూడా జట్టు కాస్త అసంతృప్తికి గురి కావడం సాధారణంగా కనిపించదు... కానీ శుక్రవారం భారత్ పరిస్థితి దాదాపు అలాగే ఉంది. చక్కగా బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌పై తమకు లభించిన ఆరంభాలను బ్యాటర్లు భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. అయితే ఇలాంటి సమయంలో ఒకే ఒక్కడు యశస్వి జైస్వాల్ అద్భుత బ్యాటింగ్‌తో శిఖరాన నిలిచాడు. మైదానం నలుమూలలా చూడముచ్చటైన స్ట్రోక్‌లు కొట్టడంతో పాటు పదునైన డిఫెన్స్‌ను ప్రదర్శిస్తూ భారీ శతకం బాదాడు. మరోవైపు ఆరు వికెట్లు తీసిన ఇంగ్లండ్ ఆనందంగా ఆటను ముగించింది. మిగిలింది బౌలర్లే కాబట్టే యశస్వి, అశ్విన్ జోడి రెండో రోజు భారత్ స్కోరును 400 వరకు తీసుకెళుతుందా లేక ఇంగ్లండ్ ఆలోపు నిలువరిస్తుందా చూడాలి.



విశాఖ స్పోర్ట్స్: ఇంగ్లండ్‌తో ప్రారంభమైన రెండో టెస్టులో తొలి రోజును భారత్ చెప్పుకోదగ్గ ప్రదర్శనతో ముగించింది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 93 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 336 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (257 బంతుల్లో 179 నాటౌట్; 17 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత ఆటతో ఒంటరి పోరాటం చేస్తూ ద్విశతకానికి చేరువయ్యాడు. యశస్వి మినహా మిగతా బ్యాటర్లంతా ప్రభావం చూపలేకపోయారు. ప్రస్తుతం యశస్వితో పాటు అశ్విన్ (5 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు.

మూడు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు...

భారత్ ఇన్నింగ్స్‌లో వరుసగా 40, 49, 90, 70, 52, 29 పరుగుల భాగస్వామ్యాలు ఉన్నాయి. చూస్తే మెరుగ్గానే అనిపిస్తున్నా... ఇందులో ఒక్కటీ భారీ భాగస్వామ్యంగా మారలేకపోయింది. ఒకే ఒక్కడు యశస్వి ఒంటి చేత్తో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా మిగతా బ్యాటర్ల స్కోర్లన్నీ 14నుంచి 34 పరుగుల మధ్య ఉండటం పరిస్థితిని చూపిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ (14) తన సహజశైలికి భిన్నంగా జాగ్రత్తగా ఇన్నింగ్స్ మొదలు పెట్టాడు. అయితే 41 బంతుల్లో ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయిన అతను లెగ్‌స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అరంగేట్ర బౌలర్ బషీర్ ఖాతాలో ఈ వికెట్ చేరింది. ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న శుబ్‌మన్ గిల్ (46 బంతుల్లో 34; 5 ఫోర్లు) ఒక దశలో ఆరు బంతుల వ్యవధిలో నాలుగు ఫోర్లు కొట్టి దూకుడు ప్రదర్శించాడు. అయితే అండర్సన్ చక్కటి బంతికి అతను అవుటయ్యాడు. లంచ్ తర్వాత కుదురుకునేందుకు ప్రయత్నించిన శ్రేయస్ అయ్యర్ (59 బంతుల్లో 27; 3 ఫోర్లు) కూడా తక్కువ ఎత్తులో వచ్చిన బంతిని ఆడలేక కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం యశస్వికి రజత్ పటిదార్ (72 బంతుల్లో 32; 3 ఫోర్లు), ఆపై అక్షర్ పటేల్ (51 బంతుల్లో 27; 4 ఫోర్లు) అండగా నిలిచారు. టీ విరామ సమయానికి భారత్ స్కోరు 225/3. అయితే చివరి సెషన్‌లో ఇంగ్లండ్ బౌలర్లు మూడు వికెట్లు తీయడంలో సఫలమయ్యారు. రేహన్ బౌలింగ్‌లో తన బ్యాట్‌ను తాకి వికెట్ల వైపు వెళుతున్న బంతిని ఆపడంలో విఫలమైన పటిదార్ పెవిలియన్ చేరాడు. అయితే ఆట ముగియడానికి కొద్ది సేపు ముందు భారత్ అనూహ్యంగా రెండు వికెట్లు కోల్పోయింది. అక్షర్ చెత్త షాట్‌తో వెనుదిరగ్గా...సొంత మైదానంలో సత్తా చాటేందుకు వచ్చిన అరుదైన అవకాశాన్ని కేఎస్ భరత్ (23 బంతుల్లో 17; 2 ఫోర్లు, 1 సిక్స్) వృథా చేసుకున్నాడు.

ఈ టెస్టు కోసం భారత తుది జట్టులో మూడు మార్పులు జరిగాయి. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో పటిదార్, కుల్దీప్ యాదవ్ రాగా...సిరాజ్‌కు బదులు ముకేశ్‌ను ఎంపిక చేశారు. ఇటీవల ఎక్కువ క్రికెట్ ఆడిన సిరాజ్‌కు విరామం ఇస్తూ జట్టునుంచి విడుదల చేశామని...అతను తర్వాతి టెస్టుకు అందుబాటులో ఉంటాడని బీసీసీఐ ప్రకటించింది.



జైస్వాల్ అలవోకగా...

రూట్ తొలి ఓవర్లో 2 ఫోర్లతో బౌండరీల ఖాతా తెరిచిన యశస్వి చివరి వరకు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తూ అదే జోరును కొనసాగించాడు. బషీర్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4 కొట్టిన యశస్వి 89 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాతా అతడిని ఇబ్బంది పెట్టడంలో ఇంగ్లండ్ బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. హార్ట్‌లీ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టి ఆధిక్యం ప్రదర్శించిన భారత ఓపెనర్ కొద్ది సేపటికే కెరీర్‌లో రెండో శతకం (151 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. హార్ట్‌లీ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా కొట్టిన భారీ సిక్సర్‌తో సెంచరీని అందుకోవడం విశేషం. యశస్వి చక్కటి షాట్లకు ఇంగ్లండ్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. ఈ క్రమంలో రేహాన్ ఓవర్లో భారీ సిక్స్‌తో అతను టెస్టుల్లో తన అత్యధిక స్కోరును నమోదు చేశాడు.

ఇండోర్‌కు చెందిన రజత్ పటిదార్ ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. భారత్ తరఫున టెస్టు మ్యాచ్ ఆడిన 310వ ఆటగాడిగా రజత్ నిలిచాడు. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ ఇంగ్లండ్ తరఫున టెస్టులు ఆడిన 713వ క్రికెటర్‌గా నిలిచాడు.

స్కోరు వివరాలు:

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (నాటౌట్) 179; రోహిత్ (సి) పోప్ (బి) బషీర్ 14; గిల్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 34; శ్రేయస్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 27; రజత్ (బి) రేహన్ 32; అక్షర్ (సి) రేహన్ (బి) బషీర్ 27; భరత్ (సి) బషీర్ (బి) రేహాన్ 17; అశ్విన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (93 ఓవర్లలో 6 వికెట్లకు) 336. వికెట్ల పతనం:** 1–40, 2–89, 3–179, 4–249, 5–301, 6–330. **బౌలింగ్:** అండర్సన్ 17–3–30–1, రూట్ 14–0–71–0, హార్ట్‌లీ 18–2–74–1, బషీర్ 28–0–100–2, రేహన్ 16–2–61–2.

ఫేవరెట్‌గా బరిలోకి భారత్

నేడు, రేపు పాకిస్తాన్‌తో డేవిస్ కప్ పోరు

ఇస్లామాబాద్: డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లేఆఫ్స్‌లో భారత జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. నేడు, రేపు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగే పోటీల్లో విజయమే లక్ష్యంగా భారత్ ఆటకు సిద్ధమైంది. డేవిస్ కప్ చరిత్రలో పాకిస్తాన్‌పై భారత్‌ది అజేయమైన రికార్డు. దాయాది జట్టుపై ఆడిన ఏడు సార్లు కూడా భారత్ విజయం సాధించింది. ఇప్పుడు పాక్ గడ్డపై కూడా జైత్రయాత్రను కొనసాగించాలనే లక్ష్యంతో ఉంది. అయితే సొంతగడ్డపై ఈ డేవిస్ టై జరగడం, తురుపు ముక్క ఐజాముల్ హక్ ఖురేషి బరిలో ఉండటంతో పాక్ గంపెడాశలు పెట్టుకుంది. గ్రాస్ కోర్టులో ఖురేషికి విశేష అనుభవముంది. ఈ నేపథ్యంలో భారత్‌కు ఏమైనా కఠిన సవాల్ అంటూ ఉంటే మాత్రం అది ఖురేషి నుంచే ఎదురు కావచ్చు. ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మొదటి రోజు రెండు సింగిల్స్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. తొలి సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్... ఐజాముల్ హక్ ఖురేషితో తలపడతాడు. అనంతరం జరిగే రెండో సింగిల్స్‌లో శ్రీరామ్ బాలాజీ... అకిల్ ఖాన్‌ను ఎదుర్కొంటాడు. శ్రీరామ్ బాలాజీ చాన్నాళ్లుగా డబుల్స్‌కే పరిమితమయ్యాడు. అయితే భారత సింగిల్స్ స్పెషలిస్టు అయిన సుమిత్ నగాల్... గ్రాస్‌కోర్టు కావడంతో పాక్ వెళ్లేందుకు విముఖత చూపాడు. దీంతో శ్రీరామ్‌ను సింగిల్స్ బరిలో దించాల్సి వస్తోంది.




ఐజాముల్, రామ్‌కుమార్

సెమీ ఫైనల్లో అస్మిత

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ అస్మిత చాలిహా సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 61వ ర్యాంకర్ అస్మిత 21–14, 19–21, 21–13తో ప్రపంచ 44వ ర్యాంకర్ ఎస్టర్ నురుమి వార్డోయో (ఇండోనేసియా)పై గెలుపొందింది. నేడు జరిగే సెమీస్‌లో ఆమె... స్థానిక ప్లేయర్ సుపనిద కటెతాంగ్‌తో తలపడుతుంది. మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో ఆరో సీడ్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట 12–21, 21–17, 21–23తో ఫెబ్రియానా దివ్యజి–అమలియా ప్రతివి (ఇండోనేసియా) జోడీ చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో మిథున్ మంజునాథ్ 10–21, 15–21తో మార్క్ కాల్‌జౌ (నెదర్లాండ్స్) చేతిలో ఓడిపోయాడు.

ఆస్ట్రేలియా ఘనవిజయం



బార్ట్‌లెట్

మెల్‌బోర్న్: అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియా బౌలర్ జేవియర్ బార్ట్‌లెట్ (4/17) అదరగొట్టాడు. బార్ట్‌లెట్ పదునైన బౌలింగ్‌కు తోడు బ్యాటింగ్‌లో స్టీవెన్ స్మిత్ (79 బంతుల్లో 79 నాటౌట్; 8 ఫోర్లు), కామెరాన్ గ్రీన్ (104 బంతుల్లో 77 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగడంతో వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై ఆసీస్ ఘన విజయం సాధించింది. ముందుగా వెస్టిండీస్ 48.4 ఓవర్లలో 231 పరుగుల వద్ద ఆలౌటైంది. కీసీ కార్టి (108 బంతుల్లో 88; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోస్టన్ చేజ్ (67 బంతుల్లో 59; 7 ఫోర్లు) విండీస్‌ను ఆదుకున్నారు. అనంతరం ఆస్ట్రేలియా 38.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లిస్ (43 బంతుల్లో 65; 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఆసీస్ 1–0తో ఆధిక్యంలో ఉండగా... సిడ్నీలో రేపు రెండో వన్డే జరుగుతుంది.



సచిన్, ఉదయ్

సెమీ ఫైనల్లో భారత్

- అండర్–19 ప్రపంచకప్
- నేపాల్‌పై 132 పరుగులతో విజయం

బ్లూమ్‌ఫోంటీన్ (దక్షిణాఫ్రికా): అండర్–19 ప్రపంచ కప్‌లో యువ భారత్ అజేయంగా సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన గ్రూప్–1 సూపర్ సిక్స్ పోరులో భారత్ 132 పరుగుల భారీ తేడాతో నేపాల్‌పై జయభేరి మోగించడంతో సెమీస్ స్థానం ఖాయమైంది. మొదట భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 297 పరుగులు చేసింది. 62 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో కెప్టెన్ ఉదయ్ సహరన్ (107 బంతుల్లో 100; 9 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సచిన్ దాస్ (101 బంతుల్లో 116; 11 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 215 పరుగులు జోడించడం విశేషం. అనంతరం భారీ లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన నేపాల్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 165 పరుగులే చేసింది. కెప్టెన్ దేవ్ ఖానల్ (53 బంతుల్లో 33; 2 ఫోర్లు) ఇన్నింగ్స్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

అఫ్గానిస్తాన్ 198 ఆలౌట్

కొలంబో: శ్రీలంకతో శుక్రవారం ప్రారంభమైన ఏకైక టెస్టులో అఫ్గానిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే ఆలౌటైంది. అఫ్గాన్ బ్యాటర్లలో రహ్మత్ షా (91; 13 ఫోర్లు) మాత్రమే ఒంటరి పోరాటం చేశాడు. విశ్వ ఫెర్నాండో 4 వికెట్లు పడగొట్టగా...అసిత ఫెర్నాండో, ప్రభాత్ జయసూర్య చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం ఆట నిలిచే సమయానికి లంక తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది. నిషాన్ మదుష్క (36 నాటౌట్), దిముత్ కరుణరత్నే (42 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు.

ఐపీఎంలో అక్రమాలపై విచారణ జరపాలి

టీయూఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెన్టివ్ మెడిసిన్ (ఐపీఎం)లో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం (టీయూఎస్) డిమాండ్ చేసింది. ఉద్యోగులకు అక్రమంగా పదోన్నతులు కల్పించడం.. కొందరు ఉద్యోగులు పదేళ్లుగా కార్యాలయానికి హాజరు కాకున్నా నెలవారీ వేతనం ఇవ్వడం లాంటివాటిపై విచారణ జరపాలని కోరింది. ఇందుకు సహకరిస్తున్న అధికారులను కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈమేరకు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రకుమార్, హరీశ్‌కుమార్ రెడ్డి తదితరులు శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహ కార్యాలయంలో, ఐపీఎంలోను ఫిర్యాదు చేశారు.

9లోగా తొలి వాయిదా చెల్లించాలి

సాక్షి, హైదరాబాద్: 2024హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులు ఈనెల 9లోగా ప్రయాణానికి అయ్యే ఖర్చు మొదటి వాయిదా రూ.81,800 జమ చేయాలని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఇర్ఫాన్ షరీఫ్ తెలిపారు. శుక్రవారం ఆయన హజ్ కమి టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎంపికైన యాత్రికులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ఏదైనా శాఖ నుంచి కేంద్ర హజ్ కమిటీ పేరుతో చలాన్ తీయాలని కోరారు. చలాన్ రాసే సమయంలో హజ్ కమిటీ కేటాయించిన నంబర్‌తో పాటు బ్యాంక్ నిర్ధారణ సంఖ్య తప్పనిసరిగా పేర్కొనా లని సూచించారు. యాత్రికులు తమ పాన్ కార్డు నంబర్ కూడా బ్యాంక్ అధికారులకు తెలపాల్సిఉంటుందన్నారు. రుసుము జమ చేసిన రసీదుతో పాటు డ్రా ద్వారా ఎంపికైన యాత్రికులు తమ ఒరిజినల్ పాస్‌పోర్టు, ఫొటోలు, మెడికల్ సర్టిఫికెట్ జత చేయాల్సి ఉంటుందన్నారు.70 ఏళ్లకు పైబడిన కేటగిరీ ద్వారా ఎంపికైన వారి పాస్‌పోర్టులు, ఫొటోలు ఇప్పటికే కార్యాలయంలో జమ అయ్యాయన్నారు.

ఐటీ కారిడార్‌లో డ్రగ్స్ కలకలం

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో డ్రగ్స్ పట్టివేత కలకలం రేపింది. గచ్చిబౌలి పరిధిలో పోలీసులు 20 గ్రాముల డ్రగ్స్ పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. 10 గ్రాముల కొకైన్, 10 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఓ యువతి, యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరో 10 మందిని విచారిస్తున్నట్లు సమాచారం. బెంగళూర్ నుంచి తీసుకొచ్చి ఐటీ కారిడార్‌లో విక్రయిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ పట్టివేతను ధ్రువీకరించినప్పటికీ ఇంకా విచారణ చేయాల్సి ఉందని, కేసు వివరాలను వెల్లడించేందుకు పోలీసులు విముఖత వ్యక్తం చేశారు.

సైబర్ నేరగాళ్ల హవాలా

ఖాతాల్లోని మొత్తం నగదుగా మార్చేందుకు భారీ నెట్‌వర్క్

- వివిధ బ్యాంకుల క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌ల వినియోగం
- గుజరాత్ కేంద్రంగా సాగుతున్న వ్యవస్థీకృత వ్యవహారం
- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు
- కీలక వ్యక్తుల గుర్తింపు కోసం లోతుగా సాగుతున్న దర్యాప్తు

సాక్షి, హైదరాబాద్

సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కాజేసిన నగదును క్రిప్టో కరెన్సీగా మార్చి విదేశాలకు తరలిస్తున్న కోణం ఇప్పటికే అనేక కేసుల్లో వెలుగులోకి వచ్చింది. ఈ స్కామ్ సొమ్ము దేశీయంగా టర్నోవర్ చేయడానికి ఈ-క్రిమినల్స్ భారీ హవాలా నెట్‌వర్క్‌లు కూడా ఏర్పాటు చేసుకున్నారని తాజాగా గుర్తించారు. గుజరాత్ కేంద్రంగా ఈ దందా చేస్తున్న ఐదుగురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు బ్యాంకు సేల్స్ మేనేజర్లు, ఒక క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్ ఉద్యోగి ఉన్నారు. వీరిని పోలీసులు ట్రాన్సిట్ వారెంట్‌పై శుక్రవారం హైదరాబాద్ తరలించారు. ఈ నగదు ఎక్కడకు చేరుతోంది అనే అంశాన్ని గుర్తించడం కోసం దర్యాప్తు చేస్తున్నారు.



యూనిటీ స్టాక్స్ కేసు దర్యాప్తులో..

నగరానికి చెందిన ఓ మహిళ సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరగాళ్ల వలలో పడింది. పెట్టుబడుల పేరుతో ఈమెను ఆకర్షించిన సైబర్ క్రిమినల్స్ భారీ మొత్తం లాభాలు వస్తాయంటూ నమ్మబలికారు. కేవలం ఆరు నెలల్లో 30 శాతం లాభాలు వస్తాయని చెప్పడంతో బాధితురాలు ఏకంగా రూ.3.16 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. ఈ మొత్తాన్ని వివిధ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసింది. ఆపై మోసపోయానని గుర్తించి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ గంగాధర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఈ నగదు మొత్తం 95 ఖాతాల్లోకి బదిలీ అయిందని గుర్తించిన ఆయన ఇటీవల గోవాకు చెందిన రోణక్ తన్నను అరెస్టు చేశారు. ఇతడి వాంగ్మూలంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లారు.

దుబాయ్‌లో ఉండే అర్జున్ సూత్రధారిగా..

ఈ స్కామ్‌కు చేసిన నిందితులపై దేశవ్యాప్తంగా 83 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్నట్లు భావిస్తున్న గుజరాత్ వాసి అర్జున్ సూత్రధారిగా ఉన్నట్లు తేల్చారు. ఇతగాడు తన ప్రధాన అనుచరుడైన అహ్మదాబాద్‌కు చెందిన »స్వయం« అనే వ్యక్తి ద్వారా కథ నడిపిస్తున్నాడు. బ్యాంకు ఖాతాల్లోని నగదును హవాలా మొత్తంగా మార్చే బాధ్యతలు ఇతడికి అప్పగించాడు. దీనికోసం స్వయం అక్కడి కోటక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంకుల్లో సేల్స్ మేనేజర్లుగా పని చేసే మీట్ తమానియా (స్వయం సోదరుడు), బ్రిజేష్ ద్వారా ఫినా బ్యాంక్‌లో క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్ విధులు నిర్వర్తించే హర్ష్ పాండేను సంప్రదించారు. అర్జున్ సూచనల మేరకు ఈ నలుగురూ కలిసి బ్యాంకు ఖాతాల్లోని నగదును హవాలా ద్వారా పంపిణీ చేసే నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు.

ఎక్కడకు చేరుతోందనే తేల్చడానికి..

తమకు రావాల్సిన మొత్తం అందటంతో మర్చంట్స్ సైతం ఈ-కామర్స్ సంస్థలకు ఆ విషయం చెప్పేవాళ్లు. బ్యాంకు లెక్కల్లో నగదు రూపంలో చెల్లింపు చేసినట్లు రాస్తుండటంతో ఎలాంటి లేడా వచ్చేది కాదు. ఆపై అర్జున్ నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం అతడు సూచించిన వ్యక్తికి అందించేవాడు. ఈ వ్యవహారం, సంప్రదింపులు మొత్తం వాట్సాప్ గ్రూపుల ద్వారా జరిగేది. వాటిలో అర్జున్ నగదు చేర్చాల్సిన వ్యక్తి వివరాలతో పాటు అతడి నుంచే సేకరించిన రూ.5 లేదా రూ.10 కరెన్సీ నోటు నంబర్ పంపేవాడు. ఈ నంబర్‌తో కూడిన నోట్ చూపించిన వ్యక్తికి హర్ష్ పాండే నిర్ణీత మొత్తం ఇచ్చేవాడు. ఈ దందాలో పాలుపంచుకున్న అందరికీ కమీషన్లు దక్కేవి. ఈ విషయం గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు స్వయం, మీట్ తమానియా, బ్రిజేష్, హర్ష్ పాండేలతో పాటు రూ.8 లక్షలు తీసుకోవడానికి వచ్చిన శంకర్‌లాల్‌ను అహ్మదాబాద్‌లో పట్టుకున్నారు. అక్కడ నుంచి వీటిని ట్రాన్సిట్ వారెంట్‌పై సిటీకి తీసుకువచ్చారు. గడచిన పది రోజుల్లోనే వీళ్లు రూ.1.5 కోట్ల హవాలా దందా చేసినట్లు గుర్తించారు. ఈ మొత్తం ఎవరి దగ్గరకు చేరుతోందనేది ఆరా తీస్తున్నారు.

ఈ- కామర్స్ సైట్స్ సొమ్మును మళ్లించి..

వెబ్‌సైట్స్, యాప్స్ ద్వారా వివిధ రకాలైన ఉత్పత్తులను విక్రయించే ఈ-కామర్స్ వర్తకులు రెండు రకాలైన లావాదేవీలను అనుమతిస్తుంటారు. ఆన్‌లైన్‌లో జరిగే చెల్లింపులతో పాటు క్యాష్ ఆన్ డెలివరీ విధానంలో నగదునూ అంగీకరిస్తారు. ఇలా నగదుగా వచ్చిన మొత్తాన్ని రిసీవ్ చేసుకోవడానికి వివిధ బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంటారు. అక్కడ ఉండే క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్ ఉద్యోగులు ఈ మొత్తం నుంచి కొంత ఈ-కామర్స్ వర్తకుల ఖాతాకు మిగిలింది వాళ్లు సూచించిన మర్చంట్స్ ఖాతాకు బదిలీ చేస్తుంటారు. దీనినే హర్ష్ పాండే ద్వారా అర్జున్, స్వయం తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ-కామర్స్ వర్తకులు సూచించిన ఫలానా మర్చంట్ ఖాతాలో ఇంత మొత్తం డిపాజిట్ చేయాలంటూ అర్జున్‌కు స్వయం ద్వారా హర్ష్ సందేశం ఇచ్చేవాడు. అతడు తన బ్యాంకు ఖాతాలోని మొత్తాన్ని అందులోకి మళ్లించి సమాచారం ఇచ్చాక.. దానికి సమానమైన మొత్తాన్ని నగదు రూపంలో హర్ష్ పాండే తన వద్ద ఉంచేవాడు.

రక్తం, ప్లాస్మా ఫర్ సేల్!

హైదరాబాద్‌లో అడ్డగోలు దందా

- మూసాపేట్‌లోని హేమో సర్వీస్ లాబొరేటరీస్‌లో డీసీఏ తనిఖీలు
- భారీగా మానవ ప్లాస్మా బ్యాగుల గుర్తింపు.. సీరం సైతం నిల్వ
- ఒక యూనిట్ రూ.700కు కొని 3,800కు అమ్ముతున్న ముఠా



సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా మానవ రక్తం, ప్లాస్మా, సీరం నిల్వచేస్తున్న ఓ బ్లడ్ బ్యాంకుపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో వాటిని నిల్వచేస్తున్నట్టు గుర్తించారు. 2016 నుంచి కొనసాగుతున్న ఈ దందాకు సంబంధించి పలు కీలక వివరాలు సేకరించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని వారికి మానవ రక్తం, ప్లాస్మా, సీరం అక్రమంగా విక్రయిస్తున్నట్టు ఆధారాలు లభించాయి. డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటన, విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

ప్లాస్మా, సీరం రీప్యాకింగ్ చేసి..

డీసీఏ అధికారులు శుక్రవారం మూసాపేట్ భవానీ నగర్‌లోని ఓ రెసిడెన్షియల్ భవనంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 'హేమో సర్వీస్ లాబొరేటరీస్'లో సోదాలు చేపట్టారు. భారీగా హ్యూమన్ ప్లాస్మా బ్యాగులను గుర్తించారు. అదే ఆవరణలో ఉన్న ఫ్రీజర్‌లలో సీసాల్లో నిల్వ చేసిన సీరం, మానవ రక్తం గుర్తించారు. రాఘవేంద్ర నాయక్ దీనిని నడుపుతున్నట్టు గుర్తించారు. నాయక్ ఎనిమిదేళ్లుగా ప్లాస్మాను సేకరిస్తున్నట్టు కనుగొన్నారు. అనధికారిక పద్ధతుల్లో వివిధ బ్లడ్ బ్యాంక్‌ల నుంచి రక్తం సేకరించి, దాన్నుంచి ప్లాస్మా, సీరం తీసి రీ ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లో ఉన్న శ్రీకర హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, దారు ఉల్ షిఫాలోని అబిద్ అలీ ఖాన్ లయన్స్ ఐ హాస్పిటల్లో ఉన్న న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్, కర్నూలు జిల్లా ధర్మపేటలోని భాగ్యనగర్‌లో ఉన్న ఆర్ఆర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు నుంచి అక్రమంగా రక్తం సేకరిస్తున్నట్టు డీసీఏ అధికారుల వద్ద రాఘవేంద్ర నాయక్ అంగీకరించారు.

రూ.700కు కొని రూ.3,800కు విక్రయం:

తెలంగాణ, ఏపీలోని పలు బ్లడ్ బ్యాంకుల నుంచి ఒక్కో యూనిట్ రక్తాన్ని రూ.700కు కొని రూ.3,800 వరకు విక్రయిస్తున్నట్టు కనుగొన్నారు. ఇలా రాఘవేంద్ర 2016 నుంచి ఆరువేల యూనిట్లకుపైగా రక్తాన్ని అక్రమంగా సేకరించి ప్లాస్మా, సీరం విక్రయించినట్టు డీసీఏ అధికారులు గుర్తించారు. విశాఖపట్నంలోని ఆక్టిమస్ బయోసైన్స్, హైదరాబాద్ ఐడీఏ బొల్లారంలోని క్లియాన్స్ ల్యాబ్స్, పుణేలోని క్లినోవి రీసెర్చ్ ప్రై.లిమిటెడ్, బెంగళూరులోని జీ7 సినర్జీస్ ప్రై.లిమిటెడ్, మైక్రో ల్యాబ్స్, నార్విచ్ క్లినికల్ సర్వీసెస్ ప్రై.లిమిటెడ్, ఐడీఏ మల్లాపూర్‌లోని శిల్పా మెడికా లిమిటెడ్, మదీనగూడలోని జెన్‌రైస్ క్లినికల్ ప్రై.లిమిటెడ్, చర్లపల్లిలోని విమ్‌టా ల్యాబ్స్ లిమిటెడ్‌లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. సోదాల్లో భాగంగా హెచ్‌ఐవీ, ఇతర టెస్టింగ్ కిట్‌లు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సోదాల్లో డీసీఏ డిప్యూటీ డైరెక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ జి శ్రీనివాస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.సహజ, ఎం చంద్రశేఖర్, పి.సంతోష్, సీహెచ్ కార్తీక్ శివచైతన్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలకు సంతృప్తికరంగా నిధులు

- తెలంగాణకు గత బడ్జెట్ కంటే 14% అధికం..
- దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు సంతృప్తికరంగా నిధులు కేటాయించారని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. తాజా బడ్జెట్‌లో రైల్వేలకు రూ.2.52 లక్షల కోట్లు కేటాయించగా.. అందులో దక్షిణ మధ్య రైల్వేకి రూ.14,232.84 కోట్లు కేటాయించారన్నారు. ఇందులో తెలంగాణ ప్రాంత వాటా రూ.5,071 కోట్లని, గత బడ్జెట్ కంటే 14.7 శాతం నిధులు అధికంగా కేటాయించారని వివరించారు. శుక్రవారం ఆయన రైల్‌నిలయంలో మీడియాతో మాట్లాడుతూ, రైలు ప్రయాణికుల భద్రత, సౌకర్యార్థం 40 వేల సాధారణ బోగీలను వందే భారత్ ప్రమాణాలకు తగ్గట్టుగా మార్చనున్నట్లు వివరించారు. ఈసారి పీఎం గతిశక్తి కింద పలు ప్రాజెక్టులను గుర్తించినట్లు తెలిపారు. కవచ్ వ్యవస్థ అభివృద్ధి కోసం ఈ సారి రూ.41.94 కోట్లు కేటాయించారన్నారు. తాజా బడ్జెట్లో నిధులు తగ్గినట్లు కనిపించినప్పటికీ ఇది మధ్యతరం మాత్రమేనని, పూర్తిస్థాయి బడ్జెట్‌లో నిధులు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భద్రాచలం రోడ్ – డోర్నకల్ డబ్లింగ్ ప్రాజెక్టు కింద రూ. 770.12 కోట్లతో 54.65 కిలోమీటర్లు అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఈ సారి రెండు బైపాస్ లైన్ల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారని, ఇందులో కాజీపేట్ బైపాస్ లైన్ 10.65 కిలోమీటర్లు, వికారాబాద్ మార్గంలో 2.8 కిలోమీటర్లు నిర్మించనున్నట్లు వివరించారు. ఈ పదేళ్లలో రాష్ట్రానికి కేటాయింపులు దాదాపు 20 రెట్లు పెరిగాయని తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.